ఏప్రిల్
2021

180

సంపుటి : 15 సంచిక : 11 వెల రు. 10/-

## ఈ సంచికలో........

డబ్బు ఆర్థిక శక్తే కాదు అణచివేత సాధనం కూడా
విప్లవ ధృవతార రోజా లగ్జెంబర్గ్!
స్థానిక సమస్యలు - శాఖలు, అగ్జిలరీ గ్రూపులు
మలి వేద కాలంలో సమాజం, మతం వర్ణ వ్యవస్థ తీరుతెన్నులు
అమెరికా ఆధిపత్య వ్యూహానికి చైనా - రష్యాల చెక్
దేశాభివృద్ధి కోసమే ప్రభుత్వరంగం
ప్రతిపక్షంపై దాడి కోసమే విశ్వగురు ప్రచారం
పెట్టుబడి కేంద్రీకరణతో తీవ్రమౌతున్న సంక్షోభం
పార్టీ మూడో మహాసభ


భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ వ్యాసావళి

# పార్టీ మూడో మహాసభ

1952 సం.లో భారతదేశంలో మొట్ట మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఎన్నోతీవ్రమైన పరిమితులు ఎదురయినప్పటికీ మహాసభ ముగిసిన వెంటనే కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలకు సన్నద్ధం అయేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. పోలీసులు, సైన్యం కలిసి కమ్యూస్టులకు బలమైన స్థానాలలో ప్రజలను భయ భ్రాంతులకు గురి చేశారు. ఇటువంటి పరిస్థితులలో ఎక్కువ మంది కేంద్ర కమిటీ సభ్యులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేక పోయారు. వేలాది మంది పార్టీ నాయకులూ, కార్యకర్తలు అప్పటికి ఇంకా జైళ్లలో మగ్గుతునే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని విడుదల చేయడానికి నిరాకరించింది. 50,000 మంది రాజకీయ ప్రత్యర్థులను జైళ్లలో కుక్కినట్లు ప్రభుత్వమే ఒప్పుకుంది. అంతకు ముందటి మూడేళ్ల పరిపాలనా కాలంలో కనీసం 13,000 మందిని కాల్చి చంపింది లేదా గాయ పరిచింది. అందులో ఎక్కువమంది కమ్యూని స్టులే ఉన్నారు. ఈ నేపథ్యంలో 1952లో ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ పోటీ చేసింది.

కమ్యూనిస్టు పార్టీ తాను ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెసును ఓడించాలని, ప్రజల కోసం పనిచేసే అభ్యర్థులను ఎన్ను కోవాలని, జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరచు కోవాలని పిలుపునిచ్చింది. భూస్వా ములు, గుత్తాధిపతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తున్నదని, అది దేశానికీ ద్రోహం చేసిందని చెప్పింది. హిందూ మహా సభ లాంటి మితవాద పార్టీల నినాదాలకు మోసపోవద్దని, వారికి వ్యతిరేకంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేసింది.

జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని, బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనకు పూర్తి భిన్నంగా ఉంటుందని, బ్రిటిష్ పెట్టుబడినంతా జాతీయం చేస్తుందని, సామ్రాజ్యవాదుల, భూస్వాముల ప్రతిఘటనను పూర్తిగా అణచివేస్తుందని ప్రణాళికలో ప్రకటిం చింది. భూస్వాముల, సంస్థానాధీశుల



మొదటి పార్లమెంట్‌లో కమ్యూనిస్టు గ్రూపు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య

భూమిని, ఉత్పత్తి సాధనాలను స్వాధీనం చేసుకుని దున్నేవారికే పంచి పెడతామని, రైతుల అప్పులన్నీ రద్దు చేస్తామని ప్రకటించింది. అంతేకాదు, వ్యవసాయ కార్మికులకు భూమితో పాటు కనీస వేతనాలు ఇస్తామని, జాతీయం చేయబడిన పెట్టుబడితో పరిశ్రమలు నెలకొల్పు తామని, కార్మికులకు జీవనానికి సరిపడా వేతనాలు చెల్లించబడతాయని, వారు సంఘాలు ఏర్పరచుకునే హక్కు, ఉమ్మడిగా బేరసారాలు, సమ్మెలు చేసుకొనే హక్కు కల్పిస్తామని ప్రణాళికలో పేర్కొంది.

అంతేకాదు, జనతా ప్రజాస్వామిక ప్రభుత్వం కుల అణచివేతను అంతం చేస్తుందని, అస్పృశ్యతను పాటించిన వారిని శిక్షిస్తుందని, కుల వివక్షను పూర్తిగా రూపుమాపుతుందని పేర్కొంది. మతవిద్వేషాలు, వివక్షను రెచ్చ గొడితే శిక్షిస్తుందని, మైనారిటీల హక్కులను, ప్రయోజనాలను కాపాడుతుందని ప్రకటిం చింది. మహిళలు ఎదుర్కొనే సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగిస్తుందని, వారికి పూర్తి స్వేచ్ఛ సమానత్వాల నిస్తుందని, మహిళలకు సమాన పనికి సమాన వేతనం అమలవు తుందని తెలిపింది. జనతా ప్రజాస్వామిక ప్రభుత్వంలో దిగువస్థాయి నుండి ఉన్నతస్థాయి వరకు ప్రజా ప్రతినిధులందరూ ప్రజలచేత ఎన్నుకోబడతారని, ఎన్నుకున్నవారిని వెనక్కు పిలిచే హక్కు ప్రజలకు ఉంటుందని ప్రకటించింది.

ఈ ఎన్నికల తరువాత కమ్యూనిస్టు పార్టీ ఒక బలమైన శక్తిగా అవతరించింది. లోక్ సభలో 16 సీట్లు గెలిచి అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా నిలిచింది. ఆంధ్రాలో మొదటి స్థానంలోనూ, కేరళలో బలమైన శక్తిగాను, త్రిపురలో మెజారిటీ మద్దత్తు ఉన్న పార్టీగాను, బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగాను, ఒరిస్సా పంజాబ్‌లలో వేగంగా ఎదుగుతున్న పార్టీగానూ నిలిచింది. పార్టీ ఎదుగుదల, ప్రజలలో దానికి లభిస్తున్న మద్దతు సామ్రాజ్యవాద శక్తులను భయభ్రాంతులను చేసింది. 'కమ్యూనిజం నుండి రక్షించుకోడానికి, దానిని అరికట్టటానికి భారత దేశం అత్యవసరమైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని' అమెరికా వ్యాఖ్యానించింది.

ఎన్నికల ఫలితాలను సమీక్షించి, భయం కరమైన అణచివేతను, దాడులను ధైర్యంగా ఎదుర్కొని పోరాటాలు చేసిన చోటమంచి ఫలితాలను సాధించామనే అంచనాకు పార్టీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ యొక్క వర్గ పాలనను అంతం చేయడానికి కమ్యూనిస్టు పార్టీ ఐక్య సంఘటనను నిర్మించవలసిన అవసరాన్ని కూడా ఈ ఫలితాలు ఎత్తి చూపాయని పేర్కొంది. కష్టజీవులు కేంద్రంగా పార్టీ నిర్మించబడాలని నొక్కి చెప్పింది. కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దుకునే మార్గంలో ఉన్నామని పార్టీ బహిరంగంగా ప్రకటించింది. పొరపాట్లు జరిగినప్పటికీ పార్టీ ఎన్నడూ కష్టజీవులకు నష్టం కలిగించలేదు. వారిని దోపిడీదారుల దయా దాక్షిణ్యాలకు వదిలేయలేదు. అందువలననే ప్రజలు పార్టీకి ఓటువేసి ప్రధాన ప్రతిపక్షంగా ఎన్నుకున్నారు.

ఎన్నికలు ముగిసిన వెంటనే పార్టీ మూడవ మహాసభకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇతర పార్టీలతో మెలగాల్సిన విధానం, పార్లమెంటు లోను, పార్లమెంటు బయట నిర్వహించవలసిన కార్యక్రమాల గురించి వరుసగా జరిగిన కేంద్ర

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. పార్టీ మూడో మహాసభ ........ 2

2. డబ్బు ఆర్థిక శక్తే కాదు అణచివేత సాధనం కూడా!
వి. శ్రీనివాసరావు......... 4

3. విప్లవ ధృవతార రోజా లగ్జెంబర్గ్ !
బృందాకరత్ ....... 10

4. స్థానిక సమస్యలు-శాఖలు అగ్జిలరీ గ్రూపులు
ఎన్. వీరయ్య ....... 14

5. మలి వేద కాలంలో సమాజం, మతం వర్ణ వ్యవస్థ తీరుతెన్నులు
ఎం. వి. ఎస్. శర్మ... 16

6. అమెరికా ఆధిపత్య వ్యూహానికి చైనా -రష్యాల చెక్
ఎస్. వెంకట్రావు ...... 19

7. దేశాభివృద్ధి కోసమే ప్రభుత్వరంగం
ఎ. కోటిరెడ్డి .......... 25

8. ప్రతిపక్షంపై దాడి కోసమే విశ్వగురు ప్రచారం
ఎ. జి. నూరాని ........... 29

9. పెట్టుబడి కేంద్రీకరణతో తీవ్రమౌతున్న సంక్షోభం
బి. వి. రాఘవులు......... 33



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : **9490099333**
ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె. హరికిషోర్: **9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# 75వ స్వాతంత్ర్య దినోత్సవాలు

భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా, ఆ పోరాటానికి ద్రోహం చేసిన ఒక సంస్థకు చెందిన వ్యక్తి ఆధ్వర్యంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుగుతుండడం భారత దేశ చరిత్రలో అతి విషాధకరమైన పరిణామం. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దాస్య శృంఖలాల నుండి భారత దేశాన్ని విముక్తి చేసేందుకు దేశంలోని అన్ని మతాలు, జాతులు, ప్రాంతాల ప్రజలు రెండు వందల సంవత్సరాల పాటు సమైక్యంగా పోరాడారు. సుదీర్ఘమైన, త్యాగపూరితమైన ఈ పోరాటమే అనేక భిన్నత్వాలు కలిగిన దేశాన్ని స్వాతంత్ర్యానంతరం ఇన్నేళ్లుగా సమైక్యంగా ఉంచింది. ఆనాడు స్వాతంత్ర్య పోరాటానికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించినా, కమ్యూనిస్టులు, ముస్లిం లీగ్, వివిధ భావజాలాలకు చెందిన విప్లవకారులు వీరోచితంగా పోరాటబట్టే దేశానికి విముక్తి లభించింది.

కానీ ఆర్ఎస్ఎస్, దాని పూర్వరూపమైన హిందూ మహాసభలు ఈ స్వాతంత్ర్య పోరాటానికి పూర్తిగా దూరంగా ఉండిపోయాయి. కారణం ఆర్ఎస్ఎస్ ఈ దేశాన్ని విభిన్న మతాల, భాషా జాతుల సమైక్య దేశంగా ఏనాడూ చూడలేదు. స్వాతంత్ర్య పోరాటం ప్రజలందరి సమైక్య పోరాటం గనుక దేశాన్ని హిందూరాష్ట్రగా మార్చాలనుకున్న ఆర్ఎస్ఎస్ ఆ పోరాటానికి దూరంగా ఉండడమే కాదు అవకాశం దొరికినప్పుడల్లా దానికి ద్రోహం చేయడానికి ప్రయత్నించింది. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఏకైక ఆర్ఎస్ఎస్ నాయకుడు సావర్కర్ కూడా చివరికి బ్రిటిష్ వారికి లొంగిపోయి ఈ దేశంలో యువత స్వాతంత్ర్య పోరాటం వైపు వెళ్లకుండా చూస్తానని ఉత్తరం రాసి ఇచ్చాడు. అటువంటి ఆర్ఎస్ఎస్‌కి రాజకీయ విభాగమైన బిజెపి నేడు అధికారంలోకి రావడం, రాష్ట్రపతి, ప్రధానమంత్రి నుండి కింది స్థాయివరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పదవులనధిరోహించడం విషాదం కాకమరేమిటి?

ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాలను 'అజాది కా అమృతోత్సవం' పేరుతో జరపాలని పిలుపు నిచ్చిన ప్రధాన మంత్రి మోడీ ఈ ఉత్సవాలను కూడా తన మాతృ సంస్థ మతతత్వ ఆలోచనలకు అనుగుణంగా నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నారు. 75 ఏళ్ల ఉత్సవాల నిర్వహణ కమిటీ సమావేశంలో ప్రధాని మాట్లాడుతూ ఈ ఉత్సవాలు "సనాతన భారత గౌరవాన్నీ, ఆధునిక భారత వెలుగులనూ" ప్రతిబింబించాలని కోరారు. ఆయన దృష్టిలో భారత దేశ చరిత్రలో ఈ రెండు కాలల మధ్య జరిగిన చరిత్ర చరిత్రే కాదన్న మాట. సనాతన భారత దేశంలో హిందూ ధర్మం రాజ్యమేలిందనీ, తరువాత భారత దేశానికి వచ్చిన ముస్లిం పాలకులు హిందూ ధర్మాన్ని నాశనం చేశారన్నది ఆర్ఎస్ఎస్ వాదన. భారత దేశ చరిత్రలో ముస్లిం రాజులు, ప్రజల పాత్రనే కాదు స్వాతంత్రోద్యమానికి వారు చేసిన సేవలను కూడా అది పరిగణనలోకి తీసుకోదు. అందుకనే మన స్వాతంత్ర్య యోధులు దూరదృష్టితో రూపొందించిన లౌకిక రాజ్యాంగాన్ని వమ్ము చేసి ఆధునిక భారత దేశాన్ని మతఛాందసవాద పునాది మీద 'హిందూ రాష్ట్ర'గా మార్చాలని అది ప్రయత్నిస్తూ వచ్చింది.

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశాన్ని అన్ని విధాలా హిందూత్వ మార్గం పట్టించే ప్రయత్నంలో మన రాజ్యాంగ మౌలిక సూత్రాలను ధ్వంసం చేస్తున్నారు. ఇప్పుడు 75వ స్వాతంత్ర్య ఉత్సవాలను కూడా ఆర్ఎస్ఎస్ హిందూత్వ ప్రాజెక్టులో భాగంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. స్వయంగా దేశ ప్రధాన మంత్రే వివాదాస్పదమైన రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం, దేశ పార్లమెంటు భవనాన్ని పడగొట్టి సెంట్రల్ విస్టా నిర్మాణం చేపట్టడం, స్వాతంత్ర్య దినోత్సవాల పేరుతో హిందూత్వ భావజాలాన్ని ప్రచారం చేయడం ఇందులో భాగమే. జాతీయోద్యమానికి ద్రోహం చేసిన, మన రాజ్యాంగానికి ద్రోహం చేస్తున్న వాళ్లు ఇప్పుడు స్వాతంత్ర్యోత్సవాలకు కూడా ద్రోహం చేస్తుంటే లౌకిక, ప్రజాతంత్ర వాదులు, దేశభక్త శక్తులు చూస్తూ ఊరుకోకూడదు. వారి ప్రచారాన్ని తిప్పికొట్టాలి. వారి ద్రోహాన్ని ఎండగట్టాలి.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా: **రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

చిరునామా
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,**
**అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**
**పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

ఈ మాసం ముఖ్యాంశం

# డబ్బు ఆర్థిక శక్తే కాదు అణచివేత సాధనం కూడా!



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటి సభ్యులు

**వి.శ్రీనివాసరావు**

ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో స్థానిక ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు, అసెంబ్లీ, పార్లమెంటు ఉప ఎన్నికలు జరిగాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలు చాలా వరకు ప్రశాంతంగా జరిగాయి. గత ఎన్నికలకు భిన్నంగా భౌతిక ఘర్షణలు గణనీయంగా తగ్గాయి. అక్కడో, ఇక్కడో అరుదుగా చిన్న చిన్న ఘర్షణలు కొన్ని జరిగాయి. ముఖ్యంగా ఫ్యాక్షనిజం బలంగా ఉన్న రాయలసీమ, పల్నాడు ప్రాంతాలలో ఈ పరిస్థితి కొట్టొచ్చినట్లు కనిపించింది. కొన్ని గ్రామాలలో ఎవరు అధికారముఠా అయితే వారు తమ వ్యతిరేక ముఠాను గ్రామాల నుండి తరిమేస్తుంటారు. ఇలాంటి అనాగరిక సంస్కృతి కొన్ని చోట్ల ఇప్పటికీ కొనసాగుతోంది. భౌతిక ఘర్షణల ద్వారా బలాబలాల్లో పైచేయి సాధించి ఎదుటి పక్షాన్ని భయకంపితులను చేసి ఓట్లు గుద్దేసుకోవడం, బూత్‌లను ఆక్రమించడం, ఓడిపోతామనుకుంటే డబ్బాలనే ఎత్తుకుపోవడం లేదా ధ్వంసం చేయడం ఆనవాయితీగా ఉండేది. ఈసారి రిగ్గింగులు, బాంబు మోతలు, కత్తివేట్లు దాదాపు కనిపించలేదు. ఆధిపత్యానికి కండబలం కన్నా డబ్బు, అధికార బలంపై ఆధారపడడం పెరిగింది. మన రాష్ట్రంలో ఎన్నికల్లో డబ్బు ఖర్చు పెట్టడం కొత్తకాదు. కాని అది నేడు ఉచ్ఛదశకు చేరింది.

### గ్రామాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణ స్వరూపం

గ్రామీణ ప్రాంతాలలో వచ్చిన మార్పుకు ఇది అద్దం పడుతున్నది. గతంలో కరుడుగట్టిన భూస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు పెత్తందారీతనం ప్రధాన అణచివేతగా ఉండేది. బలహీనవర్గాలు పెత్తందార్లకు ఎదురు తిరిగేందుకు భయపడతారు. ప్రశ్నించేవాళ్లపై భౌతికదాడులు చేసి అణచేసేవారు. పట్టణాల లో సైతం రౌడీయిజం రాజ్యమేలేది. కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉన్న చోట దీనికి భిన్నంగా ఉండేది. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, ఆర్థిక సంస్కరణల ఫలితంగా డబ్బు చెలామణీ పెరిగింది. డబ్బుకు ఎక్కడ లేని ప్రాధాన్యతా వచ్చింది. గతంలో ఎవరైనా పోటీ చేయాలనుకుంటే స్థానికులై ఉండి ప్రజలలో గుర్తింపు కలిగి లేదా కుటుంబ నేపథ్యం ఉన్న వారు ముందుకు వచ్చేవారు. తరువాత వారి పిల్లలు ఆ స్థానాన్ని ఆక్రమించేవారు. ఇప్పుడు అగ్రకులాల్లోని యువత దాదాపు చదువుకుని విదేశాలకో, పెద్ద నగరాలకో ఉద్యోగార్థం లేదా వ్యాపారం కోసమో వెళ్తున్నారు. ఊళ్ళో ఉన్న వాళ్ళ కుటుంబాలకు వ్యవసాయంపై ఆసక్తి లేదు. భూములు కౌలుకు ఇచ్చుకుని వ్యవసా యేతర వ్యాపారాలు, వృత్తుల వైపు మళ్ళారు. రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, కాంట్రాక్టులు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, రైస్ మిల్లులు, వాటర్ ప్లాంటులు, ఆక్వా కల్చర్, రవాణా, నిర్మాణరంగం ఇలా రకరకాల వ్యాపకాల వైపు మళ్ళారు. వ్యవసాయంపై వచ్చే ఆదాయం కన్నా ఈ ఆదాయమే వారికి ప్రధానం. క్రమంగా వీరు గ్రామీణ పాలక వర్గంగా మారారు. నయా ధనికవర్గంగా అవతారం దాల్చారు. గ్రామంలో ఉండే ఖాళీ భూములపై కన్నేసి రికార్డులు తారుమారు చేసి ఆక్రమించుకోవడం, పేదవాళ్ళ చేతిలోని అసైన్డ్ భూములను కారు చౌకగా కొనేయడం, వాటిని రియల్ ఎస్టేట్ క్రింద అమ్మేసి లాభం సంపాదించు కోవడం మొదలు పెట్టారు. భూములతో పాటు చెరువులు, అందులోని మట్టి, ఇసుక, చెట్లు, మైనింగ్ వంటి సహజ వనరులపై వారికి ఆధిపత్యం వచ్చింది. కొత్తగా ధనికులైన వారి మధ్య వనరులపై ఆధిపత్యం కోసం పోటీ పెరిగింది. ఇందులో పైచేయి సాధించాలంటే రాజకీయ పెత్తనం కావాలి. వీరి ఆర్థిక ప్రయోజనాల రీత్యా అనివార్యమైతే తప్ప ఘర్షణలకు దిగరు. అధికారాన్ని ఉపయోగిం చుకుని పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ద్వారా ఎదుటివారిని భయపెట్టి లొంగదీసుకోవడం, ఎదుటివారి వ్యాపారాన్ని దెబ్బకొట్టి ఆర్థికంగా కుంగదీయడం సరికొత్త ఎత్తుగడ. ఒకవేళ ఇటువంటి బలహీనతలు లేకపోయినా, ఉండీ లొంగకపోయినా వారి మీద కుటుంబ సభ్యుల ద్వారా, బంధుమిత్రుల ద్వారా ఒత్తిడి చేయడం, అదీ పని చేయకపోతే పోటీలో లేకుండా తప్పుకోవడానికి ఎంత డబ్బైనా ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. దేనికీ లొంగని వారు డబ్బుకు లొంగుతున్నారు. ఖర్చు పెట్టి పోటీ చేసి ఓడిపోయి దివాళా తీసేకన్నా, పెట్టుబడి లేకుండా, రిస్కు లేకుండా డబ్బు వచ్చి ఒళ్ళో పడిపోతుంటే అదే చాలనుకుంటున్నారు. తమకు రాజకీయ అధికారం వచ్చేదాకా తగ్గి ఉండి డబ్బు పోగేసుకుని మరలా అధికారం కోసం పోటీకి సిద్ధపడడం, ఈలోగా సొంత వ్యాపారాలు చూసుకోవడం నేటి తరం బూర్జువా రాజకీయ నాయకుల్లో కనిపిస్తున్న కొత్త ఒరవడి.

### ఏకగ్రీవాల పటాటోపం

ఈసారి స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు పెరిగాయి. ఇవి ప్రజలు నిర్ణయించుకున్న ఏకగ్రీవాలు కాదు. బలవంతంగా రుద్దిన ఏకగ్రీవాలు. అవతలివారిని అదిరించి, బెదిరించి నామినేషన్లు ఉపసంహరిం పజేస్తు న్నారు. ఈ విషయంలో అధికార వైఎస్సార్ పార్టీ ముందంజలో ఉంది. తెలుగు దేశం, ఇతర ప్రతిపక్షాలు పూర్తి ఆత్మరక్షణలో పడ్డాయి. చివరకు డబ్బులు కూడా పనిచేయక

పోతే వారి సంతకాలను ఫోర్జరీ చేసి అధికారుల ను లొంగదీసుకుని నామినేషన్లు ఉపసంహరింప జేశారు. కొన్ని చోట్ల ఏకగ్రీవాలను వేలం పాటకు పెట్టారు. అధికార పార్టీలో సైతం ఏకగ్రీవాలపై అసంతృప్తి ఉంది. ఇది రెండు రకాలుగా కనిపిస్తుంది. పోటీ ఉంటే తమకు ప్రాధాన్యత వస్తుందని అనుకునే రెండవ ర్యాంకు నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. వారికి ఆదాయం కూడా లేకుండా పోయింది. పోటీ ఉంటే ఆ అభ్యర్థి ఓడిపోతే తరువాత ఛాన్స్ తమకు వస్తుందని ఆశించే నాయకులూ భంగపడ్డారు. గతంలో తెలుగుదేశం అనుస రించిన పద్ధతులకే మరింత పదును పెట్టి నేడు వైఎస్సార్ కాంగ్రెస్ అమలు చేస్తోంది. నాడు వైఎస్సార్ కాంగ్రెస్ ఈ పద్ధతులను తప్పుబడితే నేడు తెలుగుదేశం విమర్శిస్తున్నది. ఇద్దరికీ అధికారంలో ఉంటే ఆధిపత్యం, ప్రతిపక్షంలో ఉంటే ప్రజాస్వామ్యం కావాలి.

**డబ్బుంటే రాత్రికిరాత్రే నాయకులైపోతారు**

ఎన్నికల్లో పోటీ చేయడానికి స్థానికులే అవసరం లేదు. డబ్బు ఉంటే స్థానిక నాయ కులను కూడగట్టుకుని రాత్రికి రాత్రి నాయకులై పోవచ్చు. అప్పటివరకు ప్రజలకు పరిచయం లేనివారు కూడా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి నాయకులైపోతున్నారు. ఎక్కడివాడు అనేకన్నా మనవాడు, మనకు డబ్బు ఇచ్చేవాడు అయితే చాలనుకుంటున్నారు. మన వాడు అంటే తమ కులం లేదా ఉపకులం అని అర్థం. అలా బయటినుండి వచ్చినవారు స్థానిక కులాలు, ఉపకులాలను ఉపయోగించుకుని ఆ ప్రజలతో మమేకమై మన వాడే అనిపించుకుంటున్నారు. ఆ విధంగా ఈ ఎన్నికల్లో కులాల పాత్ర మరింత పెరిగింది. కులం సంఘటితం కావాల్సిన అవసరం గురించి పవన్‌కళ్యాణ్ బహిరంగంగా ప్రకటించారు. ఈ కుల నాయకులకు పైనుండే రాజకీయ నాయకులకు మధ్య బంధం డబ్బు, అధికారమే. బలహీన వర్గాల కులాలను ఓటుబ్యాంకుగా ఉపయోగిం చుకుని ఈ నయా ధనికవర్గం అధికారాన్ని అనుభవిస్తున్నది. కులం ఓట్లు కురిపించే రాజకీయ సాధనంగా మారింది. రిజర్వేషన్ల వల్ల సామాజికంగా వెనుకబడిన కులాలు లేదా మహిళలు ఎన్నికయినా ఆధిపత్యం పెట్టుబడి పెట్టిన ఈ నయాధనిక వర్గాల చేతులు దాటిపోదు.

బూర్జువా పార్టీలు తక్కువ రోజుల్లో ఎక్కువ ప్రచార ఆర్భాటం చేశాయి. ఎక్కువ రోజులు ప్రచారం జరిగేకొద్దీ ఎక్కువ ఖర్చు అవుతుంది. ప్రచారంలో పాల్గొనే కార్యకర్తలకు(?) రోజువారీ

> **“ ఈ రోజు పార్టీ టిక్కెట్టు సంపాదించడం కోసం కూడా డబ్బులివ్వాలి. బి-ఫారం ఇవ్వడానికి ముందే వసూళ్లు జరుగుతాయి. ఒకే అభ్యర్థి రెండు ప్రధాన పార్టీల టిక్కెట్ల కోసం ఏకకాలంలో ప్రయత్నిస్తున్నారు. కొందరు తండ్రి, భార్య, బిడ్డల్ని వేర్వేరు పార్టీల్లో చేర్పించి అన్ని పార్టీల్లో వారే పెత్తనం చేస్తున్నారు. ఒక పార్టీ టిక్కెట్టుపై గెలిచి మరో పార్టీలో చేరడం మామూలైంది. ”**



ఎన్నికలల్లో పంపకం కోసం సిద్ధం చేసిన 4.92 కోట్ల రూపాయలను పట్టుకున్న తెలంగాణా పోలీసులు

వేతనం ఇవ్వాలి. భోజనం పెట్టాలి. తిరిగి వెళ్ళేటప్పుడు మందుకు డబ్బులు ఇవ్వాలి. ఇదే తక్కువ రోజులు ఉంటే ఈ ఖర్చు తగ్గిపోతుంది.

**ఏ పార్టీ అయితేనేం....పదవి కావాలి!**

ఈ రోజు పార్టీ టిక్కెట్టు సంపాదించడం కోసం కూడా డబ్బులివ్వాలి. బి-ఫారం ఇవ్వడానికి ముందే వసూళ్లు జరుగుతాయి. ఒకే అభ్యర్థి రెండు ప్రధాన పార్టీల టిక్కెట్ల కోసం ఏకకాలంలో ప్రయత్నిస్తున్నారు. కొందరు తండ్రి, భార్య, బిడ్డల్ని వేర్వేరు పార్టీల్లో చేర్పించి అన్ని పార్టీల్లో వారే పెత్తనం చేస్తున్నారు. ఒక పార్టీ టిక్కెట్టుపై గెలిచి మరో పార్టీలో చేరడం మామూలైంది. ముఖ్యంగా ప్రతిపక్షపార్టీ నుండి గెలిచిన వారు పనులు జరగాలన్న పేరుతో పోలింగు అవ్వడమే ఆలస్యం అధికారపార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఖర్చు పెట్టింది సంపాదించుకోవాలంటే అధికారపార్టీలో ఉంటేనే సాధ్యం. ఇలా డబ్బుతో పాటు అవకాశ వాదం ఆకాశానికి ఎగబాకింది.

**ప్రజా సమస్యలపై చర్చ లేదు**

ఈ ఎన్నికల్లో విధానపరమైన అంశాలపై చర్చ జరగలేదు. సిపిఐ(ఎం), ఇతర వామ పక్షాలు పోటీలో ఉన్న చోట మాత్రమే కొంత వరకు ఈ చర్చ నడిచింది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రచారంలో ప్రధానంగా పథకాలు, జగన్ నాయకత్వం గురించే హోరెత్తించారు. వైఎస్సార్ పార్టీ నాయకులను వ్యక్తిగత విమర్శలు చేయడానికే తెలుగుదేశం పరిమితమైంది. స్థానిక సంస్థల అధికారాలను కుదించడం, యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపడం, ఆస్థి, నీటి, చెత్త పన్నులు పెంచడం అసలు చర్చనీయాంశమే కాలేదు. రేషన్ పంపిణీలో ఎన్నో సమస్యలు ముందుకు వచ్చినా మరుగున పడిపోయాయి. కీడుచేసే పట్టణ సంస్కరణల గురించి సిపిఎం తప్ప ఎవరూ కనీసం ప్రస్తావించ లేదు. వైఎస్సార్, టిడిపిలకు దీన్నిపై భిన్నాభిప్రాయం లేదు. వివిధ పథకాలతో బ్యాంకు ఖాతాల్లో పడుతున్న నగదు, ఇళ్ళ పట్టాల పంపిణీ వగైరా జనాన్ని ఆకర్షించాయి. ఈ పథకాల ప్రభావంతో గెలుపు ఖాయం అయినప్పటికీ ప్రతిపక్షాన్ని లేకుండా చేయాలన్న లక్ష్యంతో అత్యధిక సీట్లు, ఓట్లు సాధించడానికి, తెలుగుదేశం నైతిక శక్తిని దెబ్బ కొట్టడానికి అధికార పార్టీ ప్రయత్నించింది. అందుకోసమే విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారు.

**డబ్బు పంపిణీ కళలో ఆరితేరిన పాలకపార్టీలు**

డబ్బు పంపిణీ కళలో అధికార, ప్రధాన

> **❝ బూర్జువా పార్టీలు దీన్ని నైతికంగా తప్పు అనుకోవడం లేదు. చట్ట బద్ధంగా చేస్తున్నంత ధీమాగా పంపిణీ జరుగు తోంది. అధికార పార్టీ పైనుండే ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించింది. వీరికి ఎలక్షన్ ఇంజనీర్లని పేరు పెట్టారు. అభ్యర్థులు, క్యాంపెయిన్‌లతో వీరికి పని లేదు. ముందు ఓట్ల విశ్లేషణ చేసి వివిధ కులాలు, వారి నాయకులు, ప్రభావం, వివిధ పార్టీల బలాబలాలు, గెలుపోటములు అంచనా వేసుకుని ఎంత డబ్బు పంపిణీ చేయాలి, ఓటుకు ఎంత డబ్బు ఇవ్వాలి అనేది నిర్ణయిస్తారు. ❞**

ప్రతిపక్ష పార్టీలు ఆరితేరాయి. ఈసారి ఎన్నికల్లో అధికార వైయస్సార్ పార్టీ వ ు ు ం ద ్ ం జ ల ో ఉంది. ప్రచారంపై ఆంక్షలు, ఎన్నికల కోడ్ పేరుతో ప్రజాసమస్యలపై ఆందోళనలపై ఆంక్షలు విధించిన ఎన్నికల సంఘం డబ్బు పంపిణీని మాత్రం అడ్డుకోలేదు. కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదు. అక్కడో ఇక్కడో డబ్బులు పట్టుకున్నా అది ప్రధానంగా అధికార పార్టీ వ్యతిరేకులవే. ఖర్చులపై ఆంక్షలు, అభ్యర్థుల ఆదాయం, ఆస్థి వివరాలు, పార్టీల అకౌంట్ల ఆడిటింగు ఇలా ఎన్ని చేసినా ఎన్నికల్లో డబ్బును నియంత్రిం చడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫల మైంది. నిజానికిది వైఫల్యం కాదు. అది కూడా రాజ్యాంగయంత్రంలో ఒక భాగమే. పాలక వర్గాల ప్రయోజనాలను బట్టే దాని నియమ నిబంధనలు కూడా ఉంటాయి. గేమ్ రూల్సు నిష్పాక్షికంగా ఉన్నట్లు అనిపించినా దాన్ని అమలు జరిపే యంత్రాంగం ప్రభుత్వ అదుపులోనే ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆటంకం లేకుండా వివాదం నడిచినా అధికార పార్టీ తన పని తాను చేసుకుపోయింది. కొన్ని నియోజకవర్గాలలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ వాహనాల్లో డబ్బు మూటలు పెట్టుకుని ముందూ వెనుక పోలీసు వాహనాల పహారాతో అత్యంత పకడ్బందీగా డబ్బు పంపిణీ చేసేశారు.

నోట్లరద్దు తరువాత కేంద్ర ప్రభుత్వం నగదు చెలామణీపై అనేక ఆంక్షలు విధించినా కరెన్సీ నోట్ల కట్టలు విచ్చలవిడిగా పంపిణీ అయ్యాయి. అంటే బ్లాక్‌మనీ తోకను కూడా కేంద్రం కత్తిరించలేకపోయిందనేది అర్థమవు తోంది. డబ్బు పంపిణీ ప్రజాపంపిణీ వ్యవస్థ లాగా మారింది. బూర్జువా పార్టీలు దీన్ని నైతికంగా తప్పు అనుకోవడం లేదు. చట్ట బద్ధంగా చేస్తున్నంత ధీమాగా పంపిణీ జరుగు తోంది. అధికార పార్టీ పైనుండే ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించింది. వీరికి ఎలక్షన్ ఇంజనీర్లని పేరు పెట్టారు. అభ్యర్థులు, క్యాంపెయిన్‌లతో వీరికి పని లేదు. ముందు ఓట్ల విశ్లేషణ చేసి వివిధ కులాలు, వారి నాయకులు, ప్రభావం, వివిధ పార్టీల బలాబలాలు, గెలుపోటములు అంచనా వేసుకుని ఎంత డబ్బు పంపిణీ చేయాలి, ఓటుకు ఎంత డబ్బు ఇవ్వాలి అనేది నిర్ణయిస్తారు. పోలింగ్ స్లిప్పుల ఆధారంగా డబ్బులు ఇస్తారు. కొన్ని చోట్ల ఓటర్ లిస్టులో ఉన్న వారి గుర్తింపు కార్డులు జిరాక్సులు తీసుకుని ఆ లెక్క ప్రకారం డబ్బులు ఇచ్చిన ఘటనలు ఉన్నాయి. తమకు ఓటేసినా, ఓటు వేయకపోయినా ఇంటింటికీ తిరిగి స్లిప్పులు పంపిణీ చేసినట్లుగా డబ్బులు పంపిణీ చేశారు. విద్యావంతులు, ధనవంతులు కూడా డబ్బు తీసుకున్నారు. గుడిసెవాసులే కాదు, అపార్ట్‌మెంట్ నివాసితులు కూడా డబ్బుకు ఎగబడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన ఉపాధ్యాయులు, మధ్యతరగతి వేతనజీవులు కూడా డబ్బులు తీసుకొన్నారంటే దీని శక్తి ఏమిటో అర్థమవుతుంది. ఉదాహరణకు ఒక పేటలో డబ్బు పంపిణీకి అడ్డం వచ్చారని ఆ పార్టీకి చెందిన కార్యాలయం వద్ద ఓటర్లు ధర్నా చేశారు. డబ్బు తీసుకోవడం తమ హక్కుగా వారు భావిస్తున్నారు. ఎవరైనా డబ్బు తీసుకోవడానికి నిరాకరిస్తే ఆ కవర్లు ఇంటి ముందే పడేసి పోతున్నారు లేదా పంపిణీ చేసే కార్యకర్త జేబులో వేసుకుంటున్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ లక్ష మందికి నాలుగు నుండి ఐదు వేలు పంపిణీ చేసినట్లుగా వార్తలు వచ్చాయి. ఇలా పంపిణీ చేస్తున్న ఒక కార్యకర్త "మీరు డబ్బులు తీసుకోకుంటే మేము వెనక్కి తీసుకెళ్లం. మీకిచ్చి నట్టే వ్రాసుకుని నా జేబులో వేసుకుంటాను. నేను వెనక్కి ఇచ్చేస్తే అసమర్థుడినని తిడతారు" అని నిజాయితీగా అంగీకరించాడు. డబ్బు పంపిణీలో సరికొత్త కోణానికి ఇది నిదర్శనం.

ఈసారి ఎన్నికల్లో మందు పంపిణీ తగ్గింది. ఓటర్లకు మందు కొని ఇచ్చేకన్నా దానికి కూడా కలిపి డబ్బులే ఇచ్చేశారు. కావల్సిన వారు వారికి కావాల్సిన బ్రాండ్లు కొనుక్కుని తాగే స్వేచ్ఛనిచ్చారు. డబ్బులు తీసుకొని కూడా స్వేచ్ఛగా ఓటేసే చైతన్యం ఓటర్లలో ఇంకా రాలేదు. కొన్ని చోట్ల ఇద్దరి దగ్గరా తీసుకొని ఇంట్లో ఉన్న వారి ఓట్లను చెరిసగం వేసి నిజాయితీ నిరూపించుకున్నవారు కూడా ఉన్నారు. డబ్బులు అందకపోతే ఓటుకు రాకపోవడం, డబ్బులు ముట్టాక ఆలస్యంగానైనా వచ్చి ఓటేసిన ఘటనలు కోకొల్లలు. ఫలితంగా ఓటింగు శాతం కూడా పెరిగింది. డబ్బు పంపిణీని అడ్డుకునే ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. అలాంటి ప్రయత్నాలు కూడ పెద్దగా జరగలేదు. కొన్ని చోట్ల అలా అడ్డుకున్న వారికి ప్రజల నుండే ప్రతిఘటన వచ్చిన సందర్భాలున్నాయి.

### ప్రజలు డబ్బులకెందుకు ఎగబడుతున్నారు

పాలకుల విధానాలే దీనికి కారణం. పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం, ధరలు, ఆర్థిక అసమానతలు, వినియోగదారీ సంస్కృతి, ఖరీదైన విద్యా, వైద్య సౌకర్యాలు తదితర సమస్యలు వారిని ఆర్థిక ఇబ్బందుల్లోకి తోస్తున్నాయి. ఎన్నికైన వారు పదవుల్ని అడ్డం పెట్టుకొని సంపాదించు కోవడం కళ్లారా చూస్తున్నారు. వాళ్లు పదవుల్ని కొనుక్కుంటు న్నారు. తాము ఓట్లు అమ్ముకుంటున్నామన్న ధోరణి ప్రబలింది. చేతికి డబ్బు వస్తే ఏదో ఒక అవసరం తీరుతుందనుకుంటున్నారు. మధ్యతరగతి వారు సైతం డబ్బులొస్తే ఇయంఐ ల ద్వారా పిల్లలకు సెల్‌ఫోను మొదలుకొని ఏదో ఒక వస్తువు కొనుక్కోవచ్చన్న ధోరణి కనిపిస్తోంది. డబ్బు పంచడం, తీసుకోవడం మమూలేనన్న ధోరణి పెరిగింది. ప్రజల అవసరాలు తీర్చడంలో విఫలమైన పాలకులు ఆ అవసరాలనే రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు.

### ఈ డబ్బుకు మూలం ఏమిటి?

ఎన్నికల్లో ఖర్చయిన డబ్బు ఎక్కడి నుండి వచ్చింది అనేది ప్రశ్న. ఇది వ్యవసాయ ఆదాయం కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్భవించిన వ్యవసాయేతర ఆదాయం ఇందులో కొంతభాగమే. అధిక భాగం బయటి నుండి వచ్చింది. రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, బిల్డర్లు, బయట వ్యాపారాలు చేసుకుంటున్న ఆ గ్రామస్థులు, పెద్ద ఉద్యోగాలు చేసుకుంటున్న ఆ గ్రామస్థుల బిడ్డలు, విదేశాల్లో ఉంటున్నవారు ఈ ఎన్నికలకు పెట్టుబడి

పెట్టారు. ముఖ్యంగా అత్యధిక గ్రామాలు జిల్లా, మండల కేంద్రాలు, పట్టణాల చుట్టూ కేంద్రీకరించి ఉండడం వల్ల, ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల ప్రణాళికలు చూపెట్టి భవిష్యత్తులో జరగబోయే అభివృద్ధిపై ఆశలు పెట్టుకుని తద్వారా తమకు వచ్చే ఆదాయం లెక్కేసుకుని రాజకీయాల్లో పెట్టుబడి పెడుతున్నారు. జనరల్ సీట్లలోనే కాదు, రిజర్వుడు సీట్లలో కూడా ఈసారి తక్కువ ఖర్చేమీ కాలేదు. అయితే ఇప్పటికీ అనేక చోట్ల ప్రతిష్టకు పోయి అప్పులు చేసి, ఆస్తులమ్మి ఎన్నికల్లో పోటీ చేసినవారు కూడా ఉన్నారు. కాని ప్రధాన ధోరణి ఈ డబ్బు చుట్టూనే తిరిగింది.

> **❝ ఎన్నికల్లో డబ్బులున్న వారిని గుర్తించి ప్రధాన పార్టీలు అభ్యర్థులుగా నిలబెడుతున్నాయి. 543 మంది లోకసభ సభ్యుల్లో 315 మంది బిలియనీర్లు అంటే శతకోటీశ్వరులన్నమాట. గతంలో ఈ సంఖ్య 156గా ఉండేది. వీరు తమ పదవుల్ని వ్యాపార ప్రయోజనాలకే వాడుకుంటారు. గతంలో స్థానిక సంస్థలపై ఆధిపత్యం తమ పెత్తనానికి గుర్తుగా ఉండేది. కానీ నేడు రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి. ❞**

### పెట్టుబడికి రాజకీయ బంధం

ఎన్నికల్లో డబ్బులున్న వారిని గుర్తించి ప్రధాన పార్టీలు అభ్యర్థులుగా నిలబెడుతున్నాయి. 543 మంది లోక్‌సభ సభ్యుల్లో 315 మంది బిలియనీర్లు అంటే శతకోటీశ్వరులన్నమాట. గతంలో ఈ సంఖ్య 156గా ఉండేది. వీరు తమ పదవుల్ని వ్యాపార ప్రయోజనాలకే వాడుకుంటారు. గతంలో స్థానిక సంస్థలపై ఆధిపత్యం తమ పెత్తనానికి గుర్తుగా ఉండేది. కానీ నేడు రాజకీయాలు వ్యాపారాలుగా మారాయి. అన్నింటికన్నా అత్యధిక ఆదాయం సమకూర్చే వ్యాపారంగా రాజకీయం ముందుకు వచ్చింది. కార్పొరేట్ పరిభాషలో ఇది గొప్ప బిజినెస్ మోడల్. ఒక పోర్టు, ఒక ఎస్ఈజెడ్, ఒక పైపులైన్, ఒక హైవే ఏదైనా కావచ్చు. ఆ చుట్టుపక్కల గ్రామాలపై పట్టు లేకుంటే వ్యాపారం చేసుకోలేరు. వ్యాపారమే కాదు తమ దగ్గర పనిచేసే కార్మికులను అదుపులో ఉంచాలన్నా స్థానిక నాయకుల మద్దతు అవసరం. అందువల్ల గతంలో గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండే కార్పొరేట్ కంపెనీలు కూడా ఈసారి పట్టు బిగించాయి. తమకు అనుకూలంగా ఉండేవారికే ఆర్థిక సహాయం చేసి కార్మికులను అదుపు చేయడానికి, ఉద్యమాలను అణచివేయడానికి, చీల్చడానికి వారిని సాధనాలుగా మలుచుకుంటున్నారు. ఆ రకంగా పెట్టుబడికీ, రాజకీయాలకు బంధం బలపడింది.

### బిజెపి ఎలక్షనీరింగుతో కొత్తపోకడలు

ఎలక్షనీరింగ్‌లో 2012 తరువాత సరికొత్త పోకడలు వచ్చాయి. దీనికి నాంది పలికింది మోడీ. 2012 నుండి న్యూ జనరేషన్ (మిలీనియల్స్, వై, జడ్ జనరేషన్స్), నూతన మధ్య తరగతిని (ఐటి, ఫైనాన్స్ తదితర రంగాల్లో కొత్తగా చేరిన విద్యావంతులు) ప్రాతిపదికగా చేసుకుని సోషల్ మీడియాను సాధనంగా వాడుకుని అసత్యాలను సత్యంగా నమ్మిస్తూ (పోస్ట్ ట్రూత్) మోడీ చుట్టూ ఒక ఆకర్షణ వలయాన్ని సృష్టించారు. దీనికి టెక్నాలజీని పెద్దయెత్తున వాడుకున్నారు. ఇందుకోసం నిరుద్యోగులైన యువతను వేల సంఖ్యలో ఉద్యోగులుగా నియమించారు. కొన్ని కంపెనీలే వాటిని స్పాన్సర్ చేశాయి. ఆ తర్వాత బిజెపి ఇలాంటి పనుల కోసమే కొన్ని ట్రస్టులు, సంస్థలు, కంపెనీలనే ప్రారంభించింది. మోడీ మేనియాను సృష్టించడంలో వీరు జయప్రద మయ్యారు. ఇందుకు వేలకోట్లు పెట్టుబడి పెట్టిన అంబానీ, అదానీ లాంటి వారికి మోడీ అధికారంలోకి వచ్చాక లాభం చేకూర్చారు. దీన్నే క్రోనీ క్యాపిటలిజం అంటున్నారు. అప్పటి నుండి ప్రతి ఎన్నికలలోనూ వేలకోట్ల కరెన్సీ కట్టలు పైనుండే ప్రవహించడం మొదలైంది. ఎన్ ఆర్ ఐల పేరుతో విదేశీ డబ్బులు కూడా వస్తున్నాయి. బూత్ స్థాయి వరకు పెయిడ్ క్యాడర్‌ను పెట్టి, వారికి మోటార్ సైకిల్ ఇస్తారు (వీటినే బైక్ గ్యాంగ్స్ అంటారు). ప్రచారం, ఓట్ల గాలింపు, నాయకుల కొనుగోళ్ళు వంటి పనులకు బాధ్యత వహిస్తారు. నాయకులు అంతగా పేరులేని హొటళ్లలో దిగి ఈ పనిని పర్యవేక్షిస్తుంటారు. ఇలా కొత్త తరహాలో ఎలక్షనీరింగు, సోషల్ ఇంజనీరింగు కళలకు బిజేపీ పట్టం కట్టింది. దీన్నే ఆదర్శంగా మిగతా పార్టీలు అనుసరిస్తున్నాయి.

### బిజినెస్ మోడల్‌గా రాజకీయం

రాజకీయాల్లో బిజినెస్ మోడల్ అమెరికా లాంటి పెట్టుబడిదారీ దేశాలనుండి దిగుమతి అయ్యింది. అక్కడ దీన్ని పొలిటికల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అంటారు. ఇందుకు కోర్సులు, కోచింగ్ సెంటర్లు కూడా ఉన్నాయి. పొలిటికల్ కన్సల్టెంట్స్ ఉంటారు. అలాంటి వారు ఇప్పుడు మన దేశంలో కూడా ప్రవేశించారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో మోడీకి ప్రశాంత్ కిషోర్ కంపెనీ అలా పని చేసింది. ఇప్పుడాయన వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు పని చేస్తున్నారు. 2019 వైఎస్సార్ కాంగ్రెస్‌కు ఆయనే పని చేశారు. ఇప్పటికీ ఆ కన్సల్టెన్సీ కొనసాగుతోంది. ప్రభుత్వ పథకాల అమలు, వలంటీర్ల వ్యవస్థను రాజకీయాలకు అనుసంధానం చేయడం వంటి పనులను వారు అజమాయిషీ చేస్తుంటారు. శాస్త్రీయ పద్ధతుల్లో సర్వేలు చేయడం ద్వారా ప్రజానాడిని అంచనా వేస్తుంటారు. ఇందుకోసం ఐఐటిలో టాపర్స్‌ని రిక్రూట్ చేసుకున్నారు. ప్రజలలో మంచి పేరుండి ఓట్లు సంపాదించ గలరనుకున్న నాయకులను గుర్తిస్తారు. వారు ఏ పార్టీలో ఉన్నా తమ పార్టీలోకి లాగడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తారు. ప్రజాసమస్యలను అధ్యయనం చేసి ఆకర్షించే నినాదాలను తయారు చేస్తారు. ఎన్నికల ప్రణాళికను కూడా వీరే రూపొందిస్తారు. గెలుపే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిస్తారు. గెలిచిన తరువాత అధికారం దీర్ఘకాలం కొనసాగడానికి కూడా ప్రణాళికలు రచిస్తారు. అవి విఫలమైనా, సఫలమైనా రాజకీయాల్లో ఇదొక ట్రెండుగా ఉందని చెప్పుకోవాలి. తెలుగుదేశం కూడా ఇప్పుడు ఇలాంటి కన్సల్టెన్సీని ఒకదాన్ని నియమించు కుంది.

### రాజకీయ అస్త్రంగా సోషల్‌మీడియా

2014 లోకసభ ఎన్నికల నుండి సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషిస్తోంది. వాట్సప్ గ్రూపుల ద్వారా చాపకింద నీరులాగా తప్పుడు ప్రచారానికి బిజెపి తెర లేపింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌తో సహా త్రీడీ టెక్నాలజీని ఉపయోగించింది. ఇందుకోసం వేల కోట్ల డబ్బు కుమ్మరిం చింది. ప్రచార ట్రెండింగు ద్వారా జనం బుర్రలను వాష్ చేసింది. ప్రత్యేకించి కొత్తతరం యవతపై వారు కేంద్రీకరించారు. మొత్తం ఓటర్లలో వీరు 51శాతం. అంతేకాదు ట్రెండింగు సృష్టించడంలో కూడా వీరిదే ప్రధాన పాత్ర. సోషల్‌మీడియాలోప్రచారం కోసం ఫోన్ నంబర్లను అమ్మటం కూడా వ్యాపారంగా మారింది.దీనికోసం కార్పొరేట్ కంపెనీలు హ్యాక్ చేయటం, వ్యక్తిగత ప్రైవసిని దెబ్బకొట్టటం

> “ఎన్నికలంటే రాజకీయ పోరాటం. అది వర్గపోరాటంలో భాగమే. అభ్యర్థి పార్టీ ప్రతినిధి మాత్రమే. తద్విరుద్ధంగా అభ్యర్థి చుట్టూ ఈ పోరాటం తిరిగితే అది పార్టీ స్ఫూర్తికి భిన్నం. బూర్జువాపార్టీల లక్షణం అది. ఈ పోరాటానికి దూరంగా ఉండి ప్రజల్ని కూడగట్టలేం. అంతేకాదు పోరాటాల ద్వారా సమీకృతులైన ప్రజలను రాజకీయంగా సంఘటితం చేయడానికి ఎన్నికలు కూడా ఒక సాధనం.”

జరుగుతుంది.

### ఎన్నికల్లో కార్పొరేట్ మనీ

అధికారంలోకి రావడానికి డబ్బే ప్రధాన సాధనంగా భావించి దాన్ని పెట్టుబడిగా పెట్టడానికి కంపెనీలు ముందుకొస్తున్నాయి. వారు అందించే నిధులకు పన్ను మినహాయింపు ఉంటుంది. గతంలో బ్లాక్‌మనీ ఇచ్చేవారు. ఇప్పుడు చట్టబద్ధంగానే ఇస్తున్నారు. దీనికి ఎలక్షన్ బాండ్లు విడుదల చేస్తున్నారు. కంపెనీలు కేటాయించే డబ్బుల్ని బాండ్లుగా కొంటారు. ఆ బాండ్లనే పార్టీలకు ఇస్తారు. పార్టీలు వాటిని క్యాష్ చేసుకుంటాయి. ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందీ బహిర్గతం కాదు. డబ్బు పంపిణీలో పారదర్శకత ఉండదు. తాము అధికారంలోకి తేదలచుకున్న పార్టీకి విచ్చలవిడిగా నిధులు ఇస్తున్నారు. బడా కార్పొరేట్ కంపెనీల నుండి ప్రవహిస్తున్న డబ్బే ఈ రోజు రాజకీయాలను నడుపుతోంది. రాజకీయాల్లో పెట్టే డబ్బు కూడా పెట్టుబడే కాబట్టి దానికి అత్యధిక లాభం రావాలి. దీనికి అనుగుణంగానే ప్రభుత్వ విధానాలు కూడా రూపొందుతాయి. దీన్నే క్విడ్ ప్రో కో అంటున్నారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక చోట ఏదో ఒక ఎన్నిక వస్తుంది. ఆర్థిక సంక్షోభ కాలంలో అంత డబ్బు కార్పొరేట్లు రాజకీయాలపై పెట్టడానికి సిద్ధం కారు. అందుకే ఐదేళ్ళకొకసారి పెట్టుబడి పెట్టాలని నిర్ణయానికి వచ్చారు. కాబట్టి అన్ని ఎన్నికలనూ ఒకేసారి జరిపేయమని ప్రభుత్వాలు, పార్టీలపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ అవసరంలో నుండి ముందుకొచ్చిందే జమిలి ఎన్నికల ఎజెండా.

### రాజకీయ వ్యాపారం

గతంలో ఇతర వ్యాపారాల్లో సంపాదించి రాజకీయాల్లో ఖర్చు చేసేవారు. ఇప్పుడు రాజకీయమనే వ్యాపారంలో సంపాదించి ఇతర వ్యాపారాలకు మళ్లిస్తున్నారు. రాజకీయ నాయకులకు కూడా వ్యాపార ప్రయోజనాలే ప్రధానం. స్థానికంగా ఉండే గ్రానైట్, సున్నపురాయి, ఎర్రచందనం, ఇసుక, ఖనిజాలపై పెత్తనం సంపాదిస్తారు. వ్యాపార ఎత్తుగడలన్నీ రాజకీయాల్లో ప్రవేశించాయి. ఓటు ఒక సరుకుగా మారింది. రాజకీయాల్లో వచ్చిన ఈ పెను మార్పు డబ్బులు లేని వాళ్లను, పేద వర్గాలను రాజకీయాలకు దూరం చేస్తున్నది. డబ్బు లేకుంటే పోటీ చేయలేమని, గెలవాలంటే డబ్బు కావాలని, డబ్బు లేని పార్టీలు పోటీ చేయకూడదన్న వాతావరణాన్ని సృష్టించారు.

### కార్పొరేట్ ఆలోచనా విధానంతో ప్రజలపై నియంత్రణ

డబ్బుతోనే ఎన్నికల్లో ఎవరూ గెలవలేరు. అలా అయితే డబ్బు పెట్టిన అభ్యర్థులంతా గెలవాలి. కాని ఎవరో ఒకరే గెలుస్తారు. సమ ఉజ్జీల మధ్య పోటీలో డబ్బు ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఒక్కోసారి ఎక్కువ పంచిన వారు కూడా ఓడిపోతున్నారు. రాజకీయ బలా బలాలే ప్రధానం. అభ్యర్థులు, ప్రభుత్వ స్కీములు, ప్రజల అసంతృప్తి స్థాయి, ప్రత్యామ్నాయ పార్టీ బలం, పార్టీల్లోని అంతర్గత వైరుధ్యాలు, కులం, మతం, ప్రాంతం తదితర అంశాలు గెలుపును ప్రభావితం చేస్తున్నాయి. అందుకే పాలకపార్టీలు కూడా ప్రజాసంబంధాలకు ప్రాధాన్యత నిస్తున్నాయి. ఆధునిక పద్ధతుల్ని పాటిస్తున్నాయి. బూర్జువా ఆలోచనలతో మేధావులు, మీడియా ద్వారా ప్రజలను ప్రభావితం చేస్తున్నారు. తద్వారా సమాజాన్ని నియంత్రిస్తున్నారు. సమాజంలో డబ్బు పాత్ర, బూర్జువా ఆలోచనలు ఒకే నాణేనికి బొమ్మబొరుసు వంటివి. పాత పెత్తందారీ పద్ధతుల్లో ప్రజలను నియంత్రించలేమని వారికి అర్థమవుతోంది. ప్రజలతో సంబంధాల కోసం సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించుకొని సమీక్షించుకుంటారు. వాస్తవిక అంచనాలపై ఆధారపడి నిర్ణయాలు తీసుకుంటారు. దీనికి స్థిరత్వం లేకపోవచ్చు. కాని తాత్కాలిక అవసరాలను తీరుస్తుంది. ఒకసర్వే ప్రకారం గెలుపోటముల్లో డబ్బు నిర్ణయాత్మకపాత్ర10 శాతంగా ఉంది.

### కమ్యూనిస్టులు – ఎన్నికలు

కమ్యూనిస్టులు ఎన్నికల్లో పోటీ చేయడమంటే కొత్త పద్ధతులతో పని చేస్తున్న బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని ఎదుర్కోవడమే. రాజ్యాంగ యంత్రంలో పార్లమెంటు, కోర్టులు, జైళ్లు, అధికారం అంతా భాగమే. ఇందులో డబ్బు కూడా ఒక సాధనం. బూర్జువా, భూస్వామ్య వర్గాలతో పోరాడటమంటే పెత్తనంతో పాటు డబ్బుతో కూడా పోరాడటం. డబ్బుతో పోరాటం కూడా ఒక రాజకీయ పోరాటమే. డబ్బుపై ఆధిపత్యం ఉన్న వర్గాలను ఓడించకుండా డబ్బును ఓడించలేం. నిర్బంధాలు, కేసులు ఎదుర్కొన్నవారు కూడా డబ్బు శక్తిని చూసి నిరాశపడుతుంటారు. పెట్టుబడిదారీ సమాజంలో డబ్బు పాత్రను అర్థం చేసుకుంటే దానిపై పోరాడే తెగువ కూడా వస్తుంది. ఆ దిశగా ప్రజలను సమాయత్తం చేయాలి. డబ్బుల్లేవు కాబట్టి కమ్యూనిస్టులు గెలవరని, గెలవని పార్టీకి ఓట్లేస్తే మురిగిపోతాయని బూర్జువా పార్టీలు చేసే ప్రచారానికి ప్రజలు కూడా గురవుతున్నారు. రాజకీయ పునాది, ప్రజా ఉద్యమాల చైతన్యం లేనిచోట ప్రజలు కూడా కమ్యూనిస్టుల పోటీని నిరుత్సాహపరుస్తున్నారు. కార్మిక వర్గ ప్రత్యామ్నాయ రాజకీయాలను లేకుండా చేయడమే వీరి ప్రధాన ఉద్దేశ్యం. మనం పెట్టుబడిదారీ వ్యవస్థలో పని చేస్తున్నాం. డబ్బు దాని ఆస్తి. అదే దాని బలం. అది సృష్టించే ప్రళయంలో నుంచే ఉద్యమాలు కూడా పుట్టుకొస్తాయి. ఆ ఉద్యమాలే దానికి సమాధి కడతాయి.

### డబ్బుతో పోరాటం కూడా రాజకీయ పోరాటమే

ప్రజలు ఓట్లేస్తే కమ్యూనిస్టులు గెలుస్తారు, అధికారానికి కూడా వస్తారని అనేక అనుభవాలు రుజువు చేశాయి. ఎన్నికలంటే రాజకీయ పోరాటం. అది వర్గపోరాటంలో భాగమే. అభ్యర్థి పార్టీ ప్రతినిధి మాత్రమే. తద్విరుద్ధంగా అభ్యర్థి చుట్టూ ఈ పోరాటం తిరిగితే అది పార్టీ స్ఫూర్తికి భిన్నం. బూర్జువాపార్టీల లక్షణం అది. ఈ పోరాటానికి దూరంగా ఉండి ప్రజల్ని కూడగట్టలేం. అంతేకాదు పోరాటాల ద్వారా సమీకృతులైన ప్రజలను రాజకీయంగా సంఘటితం చేయడానికి ఎన్నికలు కూడా ఒక సాధనం. పోరాటంలో పాల్గొనే ప్రజలు తామే అధికారానికి రావాలని, అందుకు కమ్యూనిస్టు పార్టీ మినహా మరో వేదిక లేదని గుర్తించేట్లు చేయగలిగితేనే వారి చైతన్యం మరో మెట్టు ఎక్కుతుంది. అంటే ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని

రాజకీయ చైతన్యంగా మార్చడం. స్థానిక ప్రజల మధ్య ఒక రాజకీయ కార్యకర్త ఉంటేనే ఈ లక్ష్యాన్ని సాధించగలం. డబ్బు కన్నా శక్తివంత మైంది రాజకీయ చైతన్యం.

### స్థానిక ఎన్నికల్లో సిపిఐ(ఎం)

పార్టీ బలాన్ని బట్టి ఈ సారి ఎన్నికల్లో సిపిఐ(ఎం) స్వతంత్రంగా, పరిమితమైన స్థానాల్లోనే పోటీ చేసింది. కనీస ఓటింగు వచ్చే ఉద్యమస్థాయి ఉండే వార్డులు, గ్రామాల్లోనే పోటీ చేసింది. లేని చోట్ల ఉద్యమ ప్రయోజ నాలను బట్టి ఇతరులను బలపరచింది. డబ్బుకి భయపడి పోటీకి విముఖత చూపిన ధోరణి అనేక చోట్ల కనిపించింది. మరికొన్ని చోట్ల బలం లేకున్నా పోటీకి దిగి నామక: ఓట్లతో నీటి నుండి ఒడ్డునపడ్డ చేపలాగా అయింది. ఈ రెండు ధోరణులు సరికాదు. ప్రజలతో సంబంధాలకు ఎన్నికలు ఒక పరీక్ష. సంబంధాలంటే ముఖ పరిచయాలు కాదు. లేదా నాయకులకిచ్చే గౌరవం, గుర్తింపు కాదు. వారికీ మనకూ మధ్య నుండే రాజకీయ అనుబంధం. అది మనతో ఎంత బలంగా ఉందనేది గీటురాయి. ప్రజలకు మనతోనే కాదు ఏకకాలంలో మన శత్రు వర్గాలతో కూడా సంబంధాలుంటాయి. ఈ రెండు బంధాలలో ఏది బలంగా ఉందో ఎన్నికల్లో తెలుస్తుంది. మనతో బంధం బలంగా ఉంటే డబ్బు, అధికార ఒత్తిళ్లు కూడా పని చేయవు. ఈ ఎన్నికల్లో ఓట్లేయకపోతే రేషనుకార్డు తీసేస్తామని, పెన్షన్ ఇవ్వబోమని అధికారపార్టీ నేతలు బెదిరించిన ఘటనలున్నాయి. వీటిని అధిగమించి మనకు ఓటేసిన ఘటనలూ ఉన్నాయి. అదే ఉద్యమశక్తికి తార్కాణం. బలాబలాలను అంచనా వేయడంలో జరిగే పొరపాటే మన నిర్ణయాల్లో పొరపాటుకు దారితీస్తుంది. అది అంతిమంగా కార్యకర్తల ఆశ, నిరాశలను ప్రభావితం చేస్తుంది.

### ప్రజలతో మమేకమైన చోట్లే ఓట్లు

ప్రజలతో ప్రత్యక్షంగా సత్సంబంధాలు కలిగినచోట స్థానిక ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు రావడం జరిగింది. ఇలాంటి చోట డబ్బు ప్రభావాన్ని కూడా అధిగమించి ప్రజలు ఓటు వేశారు. ఎన్నికల్లో పోటీ అంటే ధనాఢ్య వర్గాల పై పోరాటమే. అది డబ్బుతో పోరాటంగా కార్యరంగంలో కనబడుతుంది. డబ్బును డబ్బుతో ఎదుర్కోలేం. ప్రజాబలంతోనే ఎదుర్కో వాలి. ప్రజల యొక్క చైతన్యాన్ని పెంచడం రాజకీయంగా సంఘటితం చేయడం ద్వారానే మనం ఈ యుద్ధంలో ముందుకు పోగలం. అందుకు భిన్నంగా నిరాశ పడినా లేదా దూరంగా ఉన్నా ఫలితం శూన్యం.

> **"ప్రజలతో సంబంధాలకు ఎన్నికలు ఒక పరీక్ష. సంబంధాలంటే ముఖ పరిచయాలు కాదు. లేదా నాయకులకిచ్చే గౌరవం, గుర్తింపు కాదు. వారికీ మనకూ మధ్య నుండే రాజకీయ అనుబంధం. అది మనతో ఎంత బలంగా ఉందనేది గీటురాయి. ప్రజలకు మనతోనే కాదు ఏకకాలంలో మన శత్రు వర్గాలతో కూడా సంబంధాలుంటాయి. ఈ రెండు బంధాలలో ఏది బలంగా ఉందో ఎన్నికల్లో తెలుస్తుంది. మనతో బంధం బలంగా ఉంటే డబ్బు, అధికార ఒత్తిళ్లు కూడా పని చేయవు."**



రాను రాను శత కోటీశ్వరులతో నిండిపోతున్న భారత పార్లమెంటు

ఉద్యమాలు చేసి ప్రజలను కూడగట్టిన చోట కూడా ఓట్లు తక్కువగా రావడం గమనించవచ్చు. అలాగే సంప్రదాయంగా బలంగా ఉన్న చోట కూడా ఓటమికి గురైన అనుభవం ఉంది. కొన్ని గ్రామాలు, వార్డుల్లో ఇప్పటికీ పట్టు నిలబెట్టుకున్నవీ ఉన్నాయి. స్థానికంగా ప్రజలతో మమేకమయ్యే నాయకత్వం ఉన్నచోట ఎక్కువ ఓట్లు వచ్చాయి. ముఖ్యంగా యువతరం, మహిళా నాయకత్వం ఉన్నచోట ప్రజల్లో పట్టు నిలబడింది. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన కార్యకర్తలకు తగినంత సైద్ధాంతిక, రాజకీయ చైతన్యం కల్పించడం, ప్రజలతో బంధాన్ని పెంచే నిర్మాణ పటిష్టత ఉంటేనే బూర్జువా ఎత్తుగడలను, డబ్బు బలాన్ని ఎదుర్కొని నిలబడగలమని ఈఎన్నికలు రుజువు చేశాయి.

### ఎన్నికల సంస్కరణల కోసం యువతను కూడగట్టాలి

ఎన్నికల్లో పోరాడుతూనే ఎన్నికల సంస్కరణల కోసం కూడా పోరాడాలి. నేటి ఎన్నికల వ్యవస్థలో మైనార్టీ ఓట్లతో మెజార్టీ సీట్లు సాధించవచ్చు. 32 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ 100 శాతం ప్రజలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. నిరంకుశంగా ప్రజావ్యతిరేక విధానాలను దేశంపై రుద్దు తున్నారు. ఏ ప్రభుత్వమైనా మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే విధంగా ఉండాలి. పాక్షిక జాబితాతో కూడిన దామాషా విధానం దీనికి ప్రత్యామ్నాయం. అప్పుడు ప్రజల ఓట్లకు, పార్లమెంటులో ప్రాతినిధ్యానికి మధ్య సమతూకం ఉంటుంది. అలాగే డబ్బు ప్రభావాన్ని అరికట్టడానికి కార్పొరేట్ నిధులను నిషేధించాలి. చేసిన వాగ్దానాలను అమలు జరపని వారిని వెనక్కి పిలిచే హక్కు ఉండాలి. డబ్బు ప్రభావాన్ని అరికట్టకుండా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయలేరు. తమ భావాలను, ప్రయోజనాలను ప్రక్కన పెట్టి ఇష్టం లేనివారికి కూడా ఓటేయ డానికి కారణం డబ్బు, అధికారం. ఎన్నికల నిర్వహణలో అధికార జోక్యాన్ని, డబ్బు పంపిణీని నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యం బ్రతికి బట్టకట్టగలు గుతుంది. నేటి ఎన్నికల విధానం నిరంకుశ పాలనకు దోహదం చేస్తుంది. ప్రజలను ఆర్థిక, సామాజిక సమస్యలపై సమీకరిస్తూ, రాజకీయంగా సంఘటితం చేయడం ద్వారానే డబ్బు ప్రభావాన్ని అధిగమించి కమ్యూనిస్టుపార్టీ బలపడగలుగుతుంది. ❋

# విప్లవ ధృవతార రోజా లగ్జెంబర్గ్ !

బృందా కరత్



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

మార్చి 5, 2021 రోజా లగ్జెంబర్గ్ 150వ జయంతి దినోత్సవం. తన సహచరులు ఆమెను 'ఎర్ర రోజా' అంటూ ఆప్యాయంగా పిలిచేవారు. ఆమె ప్రతిభావంతమైన మార్క్సిస్టు సిద్ధాంతవేత్త. అంతర్జాతీయవాది. విప్లవకారిణి. శ్రామికవర్గ పోరాటాలలో దృఢంగా నిలబడ్డారు. దృఢ సంకల్పం గల మహిళ. రోజా మనోబలం, ధైర్యం దోపిడీదారుల గుండెల్లో గుబులు పుట్టించేవి. పురుషాధిక్య ప్రపంచంలో ఆమె పలురంగాలలో ప్రకంపనలు సృష్టించింది. శ్రామికవర్గ ఉద్యమ విద్రోహులు, పాలకవర్గాల ఏజంట్లు ఆమెను కిరాతకంగా హత్యచేశారు. ఆ దారుణం జరిగిన శతాబ్దకాలం తర్వాత కూడా ఆమె కృషి, పోరాటాలు అజరామరంగా నిలిచాయి.

పోలెండ్‌లోని జోమోస్కో పట్టణంలోని ఒక మధ్య తరగతి యూదు దంపతులకు ఆమె జన్మించారు. చిన్న వయసులోనే తీవ్ర వ్యాధి గ్రస్తులయ్యారు. కాలు, తుంటిలో ఏర్పడిన తీవ్రమైన వైకల్యపు సమస్యలు జీవితాంతం ఆమెను బాధించాయి. బలహీనమైన శరీరాకృతి, భౌతిక అస్వస్థతలు సోషలిజం పట్ల ఆమెలో రగిలిన దృఢదీక్షను మసకబార్చలేక పోయాయి.

16వ ఏట రోజా రాజకీయ జీవితం ఆరంభమైంది. 'పోలెండ్ ప్రోలిటేరియట్ పార్టీ'పై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్న కాలంలో ఆమె ఆ పార్టీలో చేరారు. ఆ కాలంలో వేలాది కార్మికులతో సార్వత్రిక సమ్మె జరిగింది. అపూర్వమైన ఆ సమ్మెలో పాల్గొనటం ద్వారా ఆమె తన తొలి కార్యాచరణను ప్రారంభించారు. ఆ సందర్భంగా ప్రభుత్వం నలుగురు పార్టీ నాయకులను ఉరితీసింది. రోజాతో పాటు, అనేకమంది నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. అక్కడి కామ్రేడ్స్ సలహాపై 1889లో ఆమె స్విట్జర్లాండ్‌కు తరలిపోయారు.

ఆ సమయంలో పోలెండ్, రష్యా వలస దారులకు స్విట్జర్లాండ్ కేంద్రంగా వుండేది. వారితో పాటు 1883లో ప్లెఖనోవ్, వేరా జసూలిచ్ తదితరులు స్థాపించిన 'రష్యన్ మార్క్సిస్టు లేబరు విమోచన గ్రూపు' వారు కూడా వుండేవారు. రోజా, లియో జోగిచెస్‌లు జ్యూరిచ్ విశ్వవిద్యాలయంలో చేరారు. లియో జోగిచెస్ లిథువేనియన్ మార్క్సిస్టు. తర్వాత కాలంలో ఆయన రోజాకు జీవితకాల సహచరుడుగా ఉన్నాడు. ఆమె ఒక ప్రతిభా వంతమైన విద్యార్థి. "పోలెండ్ పారిశ్రామిక అభివృద్ధి"పై తన డాక్టరేట్ పరిశోధనా వ్యాసాన్ని సమర్పించారు. జోగిచెస్‌తో కలసి పోలెండ్, లిథువేనియా 'సోషల్ డెమోక్రాటిక్ పార్టీ' (యస్‌డిపి)ని స్థాపించారు. అది పోలెండ్ మరియు లిథువేనియాల్లోని మార్క్సిస్టుల ప్రధాన పార్టీగా మారింది.

ఆ కాలంలో జర్మనీ కార్మికోద్యమాల కేంద్రంగా వుండేది. అది మార్క్సిస్టు ఆలోచనలు, కార్యాచరణకు కూడా కేంద్రంగా భాసిల్లింది. జర్మన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ(యస్‌డిపి) అక్కడ ప్రధాన మార్క్సిస్టు పార్టీగా ఉండేది. 1898లో రోజా స్విట్జర్లాండ్ నుండి బెర్లిన్ మారారు. అక్కడ జర్మన్ పౌరసత్వాన్ని స్వీకరించారు. సోషల్ డెమొక్రటిక్ పార్టీ జర్మనీలో భాగంగా ఉన్న పోలెండ్‌పై కేంద్రీకరించాలని భావించటంతో ఆమె మొదట పోలెండ్‌పై దృష్టి సారించారు. కానీ కేవలం పోలెండుకే పరిమితం అయ్యేందుకు ఆమె ఆసక్తి కనబరచలేదు.

జర్మనీ సోషలిజం రెండు ప్రధానమైన పోటీ శిబిరాలుగా విడిపోయింది. వాటిలో ఒకటి విప్లవ ధోరణి, రెండవది రివిజనిస్టు ధోరణి. పెట్టుబడిదారీ వ్యవస్థలోనే సర్దుబాటై పనిచేయాలని రివిజనిస్టులు ప్రబోధించే వారు. పార్లమెంటరీరంగం పనికే అధిక ప్రాధాన్యత నిచ్చేవారు. ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్ వారి అధికార ప్రతినిధి. జర్మనీ రాజ్యం తన చట్టాలకు కట్టుబడి వుండేలా సరళమైన ఎజండాతో యస్‌డిపి పనిచేయాలని, తద్వారా రాజ్యం కార్మికవర్గం పట్ల ఉదార వైఖరిని అవలంబిస్తుందని బెర్న్‌స్టీన్ వాదించేవాడు. ఆపాటికే జర్మనీ రాజ్య వ్యవస్థ సోషలిజం బాటపట్టిందని, ఆ పరిణామాత్మక మార్గంవైపు రాజ్యాన్ని నెట్టడమే తమ పార్టీ కర్తవ్యమని ఆయన నొక్కి వక్కాణించేవాడు. రోజా రచించిన "సంస్కరణలా? విప్లవమా ?" అనే శీర్షికతో వెలువడిన బుక్‌లెట్ సరిగ్గా ఈ రివిజనిజాన్నే లక్ష్యంగా చేసుకుంది. కార్మికవర్గం అధికారాన్ని స్వాధీనం చేసుకుని, ఉత్పత్తి క్రమాన్ని శ్రామికవర్గానికి అనుకూలంగా మార్చగల్గితేనే పెట్టుబడికి, శ్రమకు మధ్య నెలకొన్న వైరుధ్యాన్ని అధిగమించటం సాధ్యమని రోజా విశ్వసించారు. 'పరిమాణాత్మక మార్పుల ద్వారా సోషలిజం' సాధించటం సాధ్యం కాదని ఆమె భావించారు.

ఆగస్ట్ బెబెల్, కారల్ కాట్‌స్కీ, విల్‌హెమ్ లిబెనెక్ట్, రోజా లగ్జంబర్గ్‌లతో కూడిన యస్‌డిపిలోని వామపక్ష శిబిరం బెర్న్‌స్టీన్‌ను వ్యతిరేకించింది. బెర్న్‌స్టీన్ వాదనలను కట్టడిచేసే బాధ్యత కేవలం రెండు సంవత్సరాలుగా మాత్రమే జర్మనీలో వుంటున్న రోజాపై పడింది. 1900ల్లో ఆమె రాసిన 'సంస్కరణలా? విప్లవమా?' వ్యాసం పార్టీని కుదిపేసింది. నాడు ఆ వ్యాసంలో ఆమె సంధించిన మౌలిక ప్రశ్నలు ఒక శతాబ్దం అనంతరం కూడా ఆచరణాత్మకమైనవి గానే ఉన్నాయి. వ్యూహం, ఎత్తుగడల మధ్యగల సంబంధాలను అత్యంత సులువుగా, స్పష్టంగా వివరించింది. వ్యవస్థ లోపల సామాజిక సంస్కరణల కోసం జరిగే పోరాటాలతో దీనికి ఎలాంటి వైరుధ్యం లేదని ఆ వ్యాసంలో పేర్కొంది. ఎన్నికల్లో పాల్గొనాలన్న అంశానికున్న ప్రాధాన్యతను రోజా

“సైనికతత్వానికి, నాటి జర్మనీ చక్రవర్తి కైజర్‌కు వ్యతిరేకంగా అమె వరుసగా అనేక వ్యాసాలు రాశారు. (మొదటి ప్రపంచ యుద్ధం ముగింపు దశ -1918 నాటి జర్మన్ చక్రవర్తి కైజర్). జాతీయ దురహం కారానికి వ్యతిరేకంగా ఆమె పోరా డారు. ఆ తర్వాత 'రెండవ ఇంటర్నేషనల్'లో లెనిన్ నాయకత్వం లో సాగిన పోరాటం కన్నా ముందే ఆమె జాతీయ దురహం కారానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు.”

తక్కువ అంచనా వేయలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పించిన అవకాశాలను వినియోగించుకొని ప్రజలను కదిలించాలని ఆమె నొక్కి చెప్పారు.

ఇదే కాలంలో రష్యాలో జరిగిన పరిణామాలు పార్టీ అంతిమంగా బోల్షివిక్కులు, మెన్షివిక్కులుగా విడిపోయేందుకు దారితీసింది. అక్కడ కూడా పార్లమెంటరీ తత్వం, ఆర్థికతత్వం వంటివే చీలికకు దారితీశాయి. బెర్న్‌స్టీన్ సిద్ధాంతాలపై రోజా కరపత్రం రివిజనిజపు భిన్న అంశాలను, దాని వర్గమూలాలను విశ్లేషించేందుకు నూతన భూమికను ఆవిష్కరించింది. వర్గ సంకర విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న పోరాటానికి రోజా అందించిన సహకారం ఏ ఇతర అంశం కంటే తక్కువ ప్రాధాన్యత కలది కాదు.

అద్భుతమైన ఈ విప్లవకారిణి సిద్ధాంతానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆమె నిరంతర ఆచరణశీలి కూడా. 1905 రష్యా మొదటి విప్లవవెల్లువ సందర్భంలో రష్యా అధీనంలోని పోలెండ్ ప్రాంతంలో రోజా రహస్యంగా పనిచేశారు. అక్కడ అన్ని రకాల సమావేశాలను ప్రభుత్వం నిషేధించింది. అయినప్పటికీ తమ బలమైన ప్రాంతాల్లోనూ, పరిశ్రమల్లోనూ కార్మికులు సమావేశాలు జరిపారు. రోజా చట్టవిరుద్ధమైన ఒక పత్రాన్ని రూపొందించి కార్మికుల్లో పంపిణీ చేశారు. 1906 మార్చిలో ఆమెను అరెస్టుచేసి జైలుకు పంపారు. అనారోగ్యంతోపాటు జర్మనీ పాస్‌పోర్టు వుందన్న కారణాలతో నాలుగు నెలల తర్వాత అధికారులు ఆమెను విడుదల చేసి, దేశం నుండి బహిష్కరించారు.

రివిజనిస్టులతోనూ, కారల్ కాట్‌స్కీ అనుయాయులతోనూ రోజా భిన్నాభిప్రాయాలు తీవ్రమైనాయి. జర్మన్ సామ్రాజ్యవాద కాంక్షతో పాలకవర్గాలు చేస్తున్న సైనికీకరణ, యుద్ధ ప్రయత్నాలతో రానున్న ప్రమాదాన్ని ఆమె ముందుగానే గ్రహించారు. యుద్ధం అనివార్యమని కూడా ఆమె విశ్వసించారు. తన పార్టీలోనూ, ఇంకా అనేక యూరోపియన్ సోషలిస్టు పార్టీల్లో నెలకొన్న రివిజనిస్టు ధోరణులు “అలాంటి సామ్రాజ్యవాద యుద్ధాలు జాతీయ దురహంకారాన్ని రగల్చటానికి, ఆ మత్తులో కార్మికులు పొరుగుదేశపు సోదర కార్మికులతో పోరాడుతూ రక్తపుటేరులు పారటానికి కారణమౌతారని పేర్కొంది. ఇవి కార్మికవర్గ విప్లవ శక్తిని నాశనం చేసి, అంతిమంగా సామ్రాజ్య వాదులకే ఉపయోగపడతాయని'' ఆమె



విప్లవ నారి రోజా లగ్జెంబర్గ్

ఆందోళన చెందారు. సైనికతత్వానికి, నాటి జర్మనీ చక్రవర్తి కైజర్‌కు వ్యతిరేకంగా ఆమె వరుసగా అనేక వ్యాసాలు రాశారు. (మొదటి ప్రపంచయుద్ధం ముగింపు దశ–1918 నాటి జర్మన్ చక్రవర్తి కైజర్). జాతీయ దురహం కారానికి వ్యతిరేకంగా ఆమె పోరాడారు. ఆ తర్వాత 'రెండవ ఇంటర్నే షనల్'లో లెనిన్ నాయకత్వంలో సాగిన పోరాటం కన్నా ముందే ఆమె జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు. ఆమెను అనేక సార్లు జైలుపాలు చేశారు. నిర్బంధ కాలాన్ని రచనలు చేయటం కోసం ఆమె వినియోగించుకున్నారు.

1907లో 'రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ డే' సందర్భంగా ఆమె లెనిన్‌ను కలుసుకున్నారు. ఆ మీటింగ్‌లో వారి మధ్య జరిగిన చర్చల సందర్భంగా నమోదైన వివరాలు లేవు. యూరపులోని అనేక దేశాలను కమ్మేస్తున్న రివిజనిస్టు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం వుందని వారిరువురూ అభిప్రాయపడ్డారు. ఈ మీటింగ్ జరిగిన కొద్ది కాలం తర్వాత 'స్టట్‌గార్ట్'లో జరిగిన సోషలిస్టు 'రెండవ ఇంటర్నేషనల్ మహాసభ'కు ఆమె హాజరైనారు. “కార్మికవర్గ పార్టీలన్నీ యుద్ధానికి వ్యతిరేకంగా నిలవాలని” ఆమె ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆ మహాసభ ఆమోదించింది. రోజాకు అత్యంత సన్నిహిత కామ్రేడ్ క్లారాజట్కిన్ 'శ్రామిక మహిళా సమస్యల' అంశాన్ని ఆ మహాసభ ఎజండాలో చేర్చటానికి రోజా మద్దతుగా నిలిచారు.

రోజా 1907 నుండి 1919లో తాను హత్యకు గురయ్యేవరకు అనేక రచనలు చేశారు. పెట్టుబడి సమీకరణతో పెట్టుబడి సంచయనం (ఎక్యుములేషన్ ఆఫ్ క్యాపిటల్ విత్ ద ఎక్యుములేషన్ ఆఫ్ క్యాపిటల్) సామ్రాజ్య వాదం గురించి వివరణకు తోడ్పాటు అంశం పై 1913లో జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలకు పెట్టుబడి దారీ విధానం విస్తరించటాన్ని, దాని పర్యవసానంగానే పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గత వైరుధ్యాలు వుత్పన్నమౌతున్నట్లు ఆమె గమనించారు. పెట్టుబడిదారీ అంతర్గత సూత్రాలు సంపద సంచయనానికి, సామ్రాజ్య వాదానికి దారితీస్తాయని ఆమె వాదించారు. సామ్రాజ్యవాదంపై పోరాటం చేయకుండా

**“రష్యా విప్లవం జర్మనీలో పెను తుఫాను సృష్టించింది. తదనంతరం నవంబరులో 40,000 మంది జర్మనీ నౌకాదళ నావికులు 'కిఎల్' (నాటి జర్మనీలోని నౌకాదళ స్థావరం)లో తిరుగుబాటు చేశారు. రష్యాలోని సోవియట్‌ల నమూనాలో జర్మనీ కార్మికులు, సైనిక కౌన్సిళ్లు అనేక ప్రాంతాలను తమ అదుపులోకి తీసుకున్నాయి. ఆ వెంటనే కైజర్ పదవీచ్యుతుడై నాడు. అదే మాసంలో రోజా, కారల్ లీబ్‌నెక్ట్ ఇరువురూ జైలు నుండి విడుదలయ్యారు.”**

పెట్టుబడిదారీ విధానంపై పోరాటం చేయలేమని ఆమె వక్కాణించారు. జైల్లోవున్న కాలంలో ఇలా రాశారు :“ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా మాత్రమే అంతర్జాతీయ కార్మికవర్గం సోషలిజం అంతిమ లక్ష్యాన్ని సాధించగలుగుతుంది. తన సంపూర్ణ బలంతో, ఎనలేని త్యాగాలకు సిద్ధపడి కార్మికవర్గం 'యుద్ధంపై యుద్ధం' ప్రకటించాలి.

ముంచుకొస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రత్యక్ష కార్యాచరణల్లో పాల్గొంటూ, రచనలు చేస్తూ, అనేక సమావేశాల్లో పాల్గొంటూ ఆమె ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించారు. ప్రజలను సంఘటితపరుస్తూ, వారిని కదిలించేందుకు ఆమె తన శక్తినంతటినీ వినియోగించారు. యుద్ధం మొదలైతే సార్వత్రిక సమ్మెను నిర్వహించాలన్న లక్ష్యంతో ఆమె కృషిచేశారు. ఆ సందర్భంగా ఆమె ఇలా రాశారు : సైనికవాదం – యుద్ధం/సాయుధశాంతి – రెండు రూపాల్లోనూ వ్యక్తం కావడం పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క సహజ పరిణామం. విధానాన్ని అంతమొందించటం ద్వారా మాత్రమే పెట్టుబడిదారీ యుద్ధాన్ని మనం నిరోధించగలం. అందుకే ఎవరైతే నిజాయితీగా ప్రపంచ శాంతిని, భయం కరమైన ఆయుధీకరణ నుండి విముక్తిని కోరుకుంటారో అలాంటి వారందరూ సోషలిజాన్ని కూడా కోరుకోవాలి.”

1910లో యస్‌డిపిలోని కారల్ లీబ్‌నెక్ట్, క్లారాజెట్కిన్, ఫ్రాంజ్ మెహ్రింగ్ వంటి సన్నిహిత సహచరులతో పాటు రోజా ఒక నిర్ణయానికి వచ్చారు. యస్‌డిపి తన రివిజనిస్టు పంథాను మార్చుకోబోదన్నదే వారి నిర్ణయం సారాంశం. అందువలన వారంతా యస్‌డిపితో తెగదెంపులు చేసుకున్నారు. అంతర్జాతీయ వాదుల (ఇంటర్నేషలిస్ట్స్)పేర వారొక ప్రత్యేక గ్రూపుగా ఏర్పడ్డారు. తర్వాత ఆ గ్రూపు 'స్పార్టకస్ లీగ్'గాను, అనంతరం అది 'కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ జర్మనీ'గాను రూపాం తరం చెందింది. యుద్ధానికి వ్యతిరేకం గా చేపట్టిన పలు కార్యక్రమాల మూలంగా ఆమెపై అనేక కేసులు బనాయిం చారు. శాంతి, భద్రతలకు విఘాతం కల్గిస్తూ, ప్రజల్లో అవిధేయతను రెచ్చగొడుతున్నట్లు నేరారోపణ చేశారు.

1914 ఆగష్టులో జర్మనీ సామ్రాజ్యం రష్యాపై యుద్ధం ప్రకటించింది. ఆ మరునాడే పార్లమెంట్‌లో యుద్ధానికి ఆర్థిక సహకారాన్ని అందించాలని, నిర్బంధంగా సైన్యంలో చేర్చాలన్న ప్రభుత్వ ఆదేశాలను యస్‌డిపి ప్రతినిధులు ఆమోదించారు. యుద్ధకాలంలో ఎలాంటి సమ్మెలూ చేయబోమని వాగ్దానం చేస్తూ ప్రభుత్వంతో సంధి చేసుకున్నారు. కారల్ లీబ్‌నెక్ట్, రోజా నాయకత్వంలోని 'స్పార్టకస్ లీగ్', ఈ విద్రోహాన్ని ఖండించి, దీనికి వ్యతిరేకంగా తీవ్రంగా పోరాడింది. 'జీనస్' అన్న మారుపేరుతో 'సోషల్ డెమోక్రసీలో సంక్షోభం' శీర్షికతో రోజా సుప్రసిద్ధమైన కరపత్రం రాశారు. ఒక సంవత్సరంలోపే రోజా, కారల్ లెబ్‌నెక్ట్‌లను అరెస్టు చేశారు.

యుద్ధం కలిగించిన అపార నష్టాలతో ప్రజల్లో అసమ్మతి చెలరేగింది. రష్యాలో లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్కులు యుద్ధ వినాశనాలను జార్ చక్రవర్తిని గద్దెదించే రణన్నినాదంగా మార్చారు. లెనిన్ నాయకత్వం లో బోల్షివిక్‌పార్టీ రష్యాలో తొలి కార్మికవర్గ రాజ్యం ఏర్పరచే నాటికి రోజా జైలు నిర్బంధం లో వున్నారు. యుద్ధంలో ఓటమిని అంగీకరిం చేందుకు జర్మనీ సామ్రాజ్యం తిరస్కరించింది. రష్యా విప్లవం జర్మనీలో పెను తుఫాను సృష్టించింది. తదనంతరం నవంబరులో 40,000 మంది జర్మనీ నౌకాదళ నావికులు 'కిఎల్' (నాటి జర్మనీలోని నౌకాదళ స్థావరం)లో తిరుగుబాటు చేశారు. రష్యాలోని సోవియట్‌ల నమూనాలో జర్మనీ కార్మికులు, సైనిక కౌన్సిళ్లు అనేక ప్రాంతాలను తమ అదుపులోకి తీసుకున్నాయి. ఆ వెంటనే కైజర్ పదవీచ్యుతుడై నాడు. అదే మాసంలో రోజా, కారల్ లీబ్‌నెక్ట్ ఇరువురూ జైలు నుండి విడుదలయ్యారు. కానీ 'కీయల్' కౌన్సిల్ ఎక్కువ కాలం నిలబడలేదు. సోషల్ డెమోక్రాటిక్ పార్టీ సోషలిస్టు లక్ష్యానికి మరోసారి ద్రోహం చేసింది. ఆ పార్టీ నాయకుడు ఫ్రెడరిక్ ఎబర్ట్ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అతడు, అతడి పార్టీ పాలకవర్గాలకు ఏజంట్లుగా పనిచేశారు.

1919 జనవరిలో బెర్లిన్‌ను మరోసారి తిరుగుబాట్లు చుట్టుముట్టాయి. రెండవ విప్లవవెల్లువ తలెత్తింది. ఆ వెల్లువ విజయ వంతం కాబోదని రోజా గ్రహించింది. అందుకే దాని పట్ల ఆమె అంతగా వుత్సాహం చూప లేదు. కానీ ఆమె పోరాడుతున్న కార్మికవర్గాన్ని బలపరిచింది. యస్‌డిపి నేతృత్వంలోని ప్రభుత్వం ఆదేశం మేరకు విప్లవకారులపై అణచివేత చర్యలు ప్రారంభమైనాయి. జనవరి 15న పేరా మిలిటరీ దళాలు వందలాది మంది కార్మికుల ను కాల్చేశాయి. వేలాది మందిని అరెస్టు చేశాయి. పాలకులు బెర్లిన్‌ను తమ అధీనంలోకి తీసుకున్నారు. రోజా, కారల్ లీబ్‌నెక్ట్‌లను పట్టుకుని దారుణంగా చంపేశారు. రోజా శవాన్ని నదిలోకి విసిరేశారు. ఐదు నెలల తర్వాతనే ఆ శవాన్ని గుర్తించారు.


అంతర్జాతీయ కమ్యూనిస్టు వుద్యమ స్రవంతిలో రోజాకు సముచిత స్థానం లభించ లేదు. ఆమెకు చారిత్రకంగా అన్యాయం జరిగింది. కొన్ని ముఖ్యమైన అంశాల్లో రోజా నిర్ధారణలు సరికావన్నది వాస్తవం. కేంద్రీకృత పార్టీ లేకుంటే విప్లవమే తీవ్రమైన ప్రమాదంలో పడిపోయే పరిస్థితులలో కేంద్రీకృతపార్టీ నిర్మాణాన్ని వ్యతిరేకించింది. ఆమె హత్యా నంతరం, సోవియట్‌లో జరిగిన పలు పరిణామాల నేపథ్యంలో పార్టీ వ్యతిరేకులు ఆమె రచనల నుండి ఎంపిక చేసిన అంశాలను తీసుకొని, పార్టీపై దాడి చేసేందుకు వాటిని వినియోగిం చారు. రెండవ ఇంటర్నేషనల్‌లోని రివిజనిస్టు లూ ఈ విధంగానే వ్యవహరించారు. రోజాను ఒక ప్రముఖ కమ్యూనిస్టుగా గుర్తిం చేందుకు ఈ అంశాలు ఆటంకం కలిగించి వుండవచ్చు. కానీ ఈ గొప్ప విప్లవకారిణి కృషిని అంచనా వేయటంలో లెనిన్ అభిప్రాయాలకు ఈ వైఖరి పూర్తి భిన్నంగా వుంది. ఈ అంశంపై లెనిన్ తన నోట్స్‌లో ఇలా పేర్కొన్నారు:

“రష్యా కల్పిత గాథల్లోని రెండు వాక్యాలను ఉటంకించటం ద్వారా ఈ ప్రశ్నకు జవాబు నిద్దాం: 'కొన్నిసార్లు గద్దలు కోడిపెట్టల కంటే తక్కువ ఎత్తే ఎగరవచ్చు. కానీ కోడి పెట్టలు

మాత్రం ఎపుడూ గద్దల అంత ఎత్తుకు ఎగరలేవు....' కొన్ని తప్పులున్నప్పటికీ ఆమె... మన కోసం గరుడ పక్షిలా నిలుస్తుంది. ప్రపంచంలోని కమ్యూనిస్టులు ఆమె జ్ఞాపకాల పరిరక్షణకే పరిమితం కారాదు. అనేక తరాల కమ్యూనిస్టులకు శిక్షణనిచ్చేందుకు ఆమె ఆత్మకథను, రచనలన్నింటినీ వినియోగించుకోవాలి. (రోజా రచనలను ప్రచురించటంలో జర్మనీ కమ్యూనిస్టులు మితిమీరిన జాప్యం చేశారు. కానీ వారుచేస్తున్న పోరాటాల్లో పలు నష్టాలు, కష్టాలు ఎదుర్కొంటున్న దృష్ట్యా, అందుకు వారిని ఒక మేరకు క్షమించవచ్చు)".

**"లెనిన్ ప్రస్తావించిన తప్పులకు మించి రోజా కృషి వున్నందువల్లనే ఆమె రచనలన్నింటినీ ప్రచురించాలని లెనిన్ కోరాడు. జర్మనీ సోషల్ డెమోక్రాటిక్ పార్టీలో రివిజనిజానికి వ్యతిరేకంగా బెర్న్‌స్టీన్, కాట్‌స్కీవంటి అగ్రనేతలతో జరిపిన పోరులో ఆమె ముందు పీఠిన నిలిచారు. ఆమె సిసలైన అంతర్జాతీయవాది. అందుకే యుద్ధం విషయంలో సోషల్ డెమోక్రాట్ల అతివాద జాతీయవాద ధోరణులను ఆమె తిరస్కరించారు. ఆమె వర్గ పోరాటాలను విశ్వసించారు."**

లెనిన్ ప్రస్తావించిన తప్పులకు మించి రోజా కృషి వున్నందువల్లనే ఆమె రచనలన్నింటినీ ప్రచురించాలని లెనిన్ కోరాడు. జర్మనీ సోషల్ డెమోక్రాటిక్ పార్టీలో బెర్న్‌స్టీన్, కాట్‌స్కీవంటి అగ్రనేతలతో రివిజనిజానికి వ్యతిరేకంగా జరిపిన పోరులో ఆమె ముందు పీఠిన నిలిచారు. ఆమె సిసలైన అంతర్జాతీయవాది. అందుకే యుద్ధం విషయంలో సోషల్ డెమోక్రాట్ల అతివాద జాతీయవాద ధోరణులను ఆమె తిరస్కరించారు. ఆమె వర్గ పోరాటాలను విశ్వసించారు. లెనిన్ నాయకత్వంలోని పార్టీ ప్రమాణాలతో పోల్చినపుడు, అతి కేంద్రీకరణల ప్రమాదాలను గురించి ఆమె పొరపాటు సూత్రీరణలు చేశారు. కానీ ఆమె హెచ్చరించిన ప్రమాదాలు అనంతర కాలంలో అనేక మాజీ సోషలిస్టు దేశాల్లో చోటుచేసుకున్నాయన్న వాస్తవాన్ని తోసిపుచ్చ రాదు. 'స్పార్టకస్ లీగ్' జర్మనీ కమ్యూనిస్టుపార్టీగా మారిన కేవలం ఒక నెలలోపే ఆమె అమరు లయ్యారు. అనుభవ రహితమైన పార్టీని సంఘటితం చేసుకునే అవకాశం ఆమెకు లభించలేదు. ఒక ప్రజా పార్టీని కార్మి కోద్యమంతో మమేకం చేయవచ్చన్న తన గత సూత్రీకరణలను పున: పరిశీలించుకొనే అవకాశం ఆమెకు దొరకలేదు. అందుకే దాని నాయకులు అమరులయ్యాక పాలకులు ఆ పార్టీని నాశనం చేశారు. ఏదియేమైనా కేంద్రీకృత ప్రజాస్వామ్యంపై ఆధారపడిన పార్టీ అవసరం గురించి లెనిన్ భావనలు స్పష్టం. లెనిన్ భావనలు సరైనవని చారిత్రక అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. మాజీ సోషలిస్టు దేశాల్లో, కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమల్లో పలు వక్రీకరణలు జరిగాయి. అందుకే కేంద్రీకృత ప్రజాస్వామ్యంపై రోజా లగ్జంబర్గ్ చేసిన విమర్శనాత్మక పరిశీలనలపై నిశితంగా దృష్టి సారించాలి. అతి కేంద్రీకరణను నిలువరించేందుకు సంస్థాగత ఏర్పాట్లు చేయవలసిన అవసరమున్నది.




అధికారాలన్నీ ప్రజా పరిపాలనా మండళ్లకే అనే నినాదంతో 1918 జర్మన్ విప్లవంలో పాల్గొన్న ప్రజలు

రోజా కృషిని ఒక మూలకు నెట్టేయటంలో మరొక ముఖ్యమైన అంశం కూడా దాగి వుంది. జర్మనీ, పోలండ్లలో స్థిరపడ్డ పార్టీ నాయకులు ఆమెపట్ల ప్రత్యక్షంగా వ్యతిరేకతను కనబరిచే వారు. ఆమె వారసత్వాన్ని (లీగసీ)కూడా వక్రీకరించారు. సైద్ధాంతిక పోరాటంలో ఒక మహిళ నుండి సవాలు ఎదురుకావటాన్ని వారు సహించలేకపోయారు. రోజా పట్ల వారి విముఖతలో పై ధోరణి కూడా ఒక ప్రచ్ఛన్న అంశంగా దాగివుందని నిస్సంశయంగా చెప్పవచ్చు. ఎలాంటి సందేహాలు లేకుండా ఆమె తన రాజకీయ విధానాలను అమలు చేయటానికి పూనుకునేవారు. యస్‌డిపిలో మహిళలు బలమైన పాత్రను పోషించారు. కానీ వారిలో కొందరు మాత్రమే సిద్ధాంత కర్తలుగా గుర్తింపు పొందారు. రోజా తన కృషి ద్వారా లింగపరమైన మూసపోత పద్ధతులను పరోక్షంగా ప్రశ్నించే వారు. పార్టీలో నెలకొన్న పితృస్వామిక భావాలను, లింగపరమైన భౌతిక /నైతిక శక్తులను కూడా ఆమె సవాలు చేశారు. తద్వారా ఇతర మహిళా విప్లవకారులు ఎదిగేందుకు వుపకరించే సోపానాలను ఆమె నిర్మించారు.

రోజాకు ప్రియ నేస్తం క్లారా జట్కిన్ రోజాకు ఘనమైన నివాళులర్పిస్తూ ఇలా చెప్పారు: "ఆమె ఒక ఖడ్గం. ఒక విప్లవాగ్ని. అంతర్జాతీయ సోషలిజం చరిత్రలో రోజా లగ్జెంబర్గ్ ఒక ధృవతారగా మిగులుతారు." అది నిజం. ఆమె అలాగే నిలిచారు.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

**పార్టీ నిర్మాణం**

# స్థానిక సమస్యలు -శాఖలు ఆగ్జిలరీ గ్రూపులు



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

**ఎస్.వీరయ్య**

ప్రజా సమస్యల మీద కృషి అంటే ఏమిటి?

ప్రజలకు దగ్గర కావాలంటే ఏం చేయాలి?

ప్రజా కార్యాచరణ లేకుండా కమ్యూనిస్టు చైతన్యం వస్తుందా?

అనర్గళంగా జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు మాట్లాడితే ప్రజలు మనవైపు వస్తారా? చాలామంది బూర్జువా పార్టీల నాయకులకంటే, కార్యకర్తలకంటే కమ్యూనిస్టు కార్యకర్తలు బాగా మాట్లాడగలరు. వాస్తవాలు చెప్పగలరు. అయినా బూర్జువా పార్టీలకే ఓట్లు వేస్తున్నారు. బూర్జువా పార్టీలలో నాలుగైదు నిమిషాలు కూడా ఉపన్యాసం ఇవ్వలేని వారు కూడా ప్రజలను ఆకర్షించగల్గుతున్నారు. సమీకరించగల్గుతున్నారు. నిజాయితీలో గానీ, అంకితభావంలోగానీ కమ్యూనిస్టు కార్యకర్తలను, సభ్యులను మించినవారు లేరు. ప్రజలు గౌరవిస్తున్నారు. ఓట్లు మాత్రం వేయటం లేదు. కమ్యూనిస్టు పార్టీకి తమ శక్తిమేరకు విరాళా లివ్వడానికి కూడా సిద్ధమే! అధికారం మాత్రం బూర్జువా పార్టీలకే కట్టబెడుతున్నారు. ఇందుకు కారణం వెతకాలి. పని విధానంలో అవసరమైన మార్పులు చేసుకోవాలి.

జనం అనేక సమస్యలుఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగం, నిత్యజీవితావసర సరుకుల ధరల భారం. కానీ ఈ సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి పిలుపునిస్తే ప్రజలు కదలటం లేదు. వీటిని ప్రజలు సమస్యలుగా గుర్తించటం లేదా? ఇవి పరిష్కారం కావాలని కోరుకోవటం లేదా? నిత్యం ఎదుర్కొంటున్న ఇలాంటి సమస్యలను ప్రజలు గుర్తించకుండా ఎట్లా ఉంటారు? ఈ సమస్యల తీవ్రత ప్రజలకు బాగా తెలుసు. వీటి లోతులు కూడా వారికి తెలుసు. అందుకే కదలటం లేదు. మనతో వస్తే ఈ సమస్యలు పరిష్కారమవుతాయన్న విశ్వాసం ప్రజలకు లేదు. మనం అధికారంలోకి వస్తామన్న నమ్మకం కూడా వారికి లేదు. తాము ఓటేస్తే....కొన్ని సీట్లైనా గెలుస్తామని వారు అనుకోవటం లేదు.

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. నిరంకుశ పోకడలు పెరుగుతున్నాయి. లౌకిక విలువలు దెబ్బతింటున్నాయి. ఇవి మరింత ప్రమాదకరమైన, మరింత విస్తృతమైన, సంక్లిష్టమైన సమస్యలు కూడా. తక్షణం తమ కుటుంబాన్ని గట్టెంక్కించగల ఆర్థిక సమస్యలు కాదు. ఇవి తమ కుటుంబానికి లేదా తనకు సంబంధించిన సమస్యలుగా గుర్తించటం కూడా అంత సులభం కాదు. మహిళల మీద దాడులు, కుల దురహంకార దాడులకు వ్యతిరేకంగా చేసే సాధారణ నిరసన కార్యక్రమాలు కూడా ఇంతే. ఇవేవీ తమను తక్షణం వేధిస్తున్న సమస్యలుగా గానీ, తక్షణం పరిష్కారం కోసం తాము పోరాడవలసిన సమస్యలుగా గానీ ప్రజలు భావించటం లేదు. నిర్దిష్ట ఘటన జరిగినపుడు, సమస్య తీవ్రతను బట్టి కదలిక ఆధారపడి ఉంటుంది. సమాజాన్ని పీడిస్తున్నవైనప్పటికీ, అప్పుడప్పుడు మాత్రమే ముందుకు వచ్చే సమస్యలు. అట్లా ముందుకొచ్చినపుడు ఏమాత్రం వెనకబడకూడదు.

సాధారణంగా పైన చెప్పిన రకరకాల సమస్యల మీద పిలుపులను జయప్రదం చేయాలని కోరుతుంటాము. అంటే.... లాంఛన ప్రాయమైన పిలుపులు. పార్టీ నిరసనను తెలియజేసే రూపాలవి. ప్రజలు తమ నిరసనను తెలియజేసే కార్యక్రమాలుగా భావించలేము. కేంద్ర, రాష్ట్ర పిలుపులు గానీ, జిల్లా కమిటీ పిలుపులు గానీ అనేక సందర్భాలలో ఈ తరహా పిలుపులే ఉంటాయి. ధర్నాలు, ప్రదర్శనలు, దిష్టిబొమ్మ తగులబెట్టటం వంటి పిలుపులలో చురుకైన పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొంటారు. అందుకే ప్రజలు పాల్గొంటున్నారని చెప్పజాలము. సాధారణ భాషలో జయప్రదం చేసే కార్యక్రమాలుగా భావించాలి. ప్రజలు పాల్గొంటే ఎవరూ జయ ప్రదం చేయవల్సిన అవసరం ఉండదు.

ఇలాంటి కార్యక్రమాల వల్ల పేపర్లో వార్త రావచ్చు, టీవీలలో చూపించవచ్చు, దానికీ అనేక పరిమితులుంటాయి. మీడియాలో ఎంత కవరేజీ వచ్చినప్పటికీ... పార్టీ ఉనికిని చాటు కోవడానికి మాత్రవే అది ఉపయోగ పడుతుంది. పార్టీ అక్కడ ఉన్నదని అనిపించు కోవటం వరకే పరిమితం. పార్టీ ప్రతిష్ట కూడా ఆ మేరకు పెరుగుతుంది. అంతే తప్ప ప్రజలు మన వెంటరారు. అయినా... రెగ్యులర్‌గా ఇలాంటి పిలుపులు ఇవ్వటం అవసరమే ! ఉనికిని చాటుకోవటం కూడా అవసరమే. కానీ...ఉనికిని చాటుకుంటే ఓట్లు రావు. ఈ వాస్తవం కూడా గమనించాలి. ప్రజలు కదలకుండా...పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా ప్రజా పునాది ఏర్పడదు. పార్టీ బలపడదు. మనకు పెద్దగా ఓట్లు లేవని అర్ధమైన తర్వాత, ఇతర పార్టీలు కూడా మనతో పొత్తుకు సిద్ధపడవు. సీట్ల పంపకానికి అంగీకరించరు. మనతో వారికి ఓట్లు వస్తాయనీ, వారి గెలుపుకు మనం తోడ్పడ తామనే పరిస్థితి ఉంటే గదా వారికి మన అవసరం ఉండేది. అందువల్ల ఎన్నికల కోణంలో చూసినా, జయప్రదం చేసే కార్య క్రమాలకు పరిమితులున్నాయి. గత కొంత కాలంగా కమ్యూనిస్టు ఉద్యమం అనుభవా లివి. ఈమధ్య ప్రజా సమస్యల మీద చేసే కార్య క్రమాలకు మీడియాలో స్థానం కూడా పరిమితమైంది. ఒకటీ, రెండు పత్రికలలో వచ్చిన చిన్న వార్తను సోషల్‌మీడియా గ్రూపుల లో పెడుతున్నారు. మంచిదే... కానీ ఇది మన సంతృప్తికే తప్ప ప్రజలను ఒక స్థాయికి మించి ప్రభావితం చేయవు.

ప్రజలను వేధిస్తున్న సమస్యలను నిర్దిష్టంగా గుర్తించాలి. అధికార పార్టీ కాకపోయినా, బలమైన ప్రతిపక్షం కాకపోయినా, మనం కూడా ఎంతోకొంత చేయగలమని ప్రజలు నమ్మే సమస్యలు ఎంపిక చేసుకోవాలి. ఏమాత్రం చొరవ చూపినా, కొంతైనా ఊరటనివ్వగలిగే అవకాశమున్న సమస్యలను తీసుకోవాలి. ఎంతోకొంత ఫలితం సాధించినపుడు ప్రజలలో విశ్వాసం పెరుగుతుంది. కనీసం, అధికారులు సానుకూలంగా స్పందించినా బాధిత ప్రజలు ఊరట పొందుతారు. పార్టీ

సభ్యులు, ప్రజా సంఘాల కార్యకర్తలు ఉత్సాహపడతారు. స్థానిక సమస్యల మీద కృషి చేసినపుడే ఇలాంటి ఫలితాలు ఆశించగలం. అధికారులు తగిన విధంగా స్పందించనపుడు ప్రజలకు పోరాటం అవసరం కూడా అర్థమవుతుంది. మంచినీరు, బోరింగ్, రోడ్లు, కరెంటు, మురికి కాల్వలు, ఆట స్థలాలు, కమ్యూనిటీ హాల్స్, పోలీసుల వేధింపులు, రవాణా సదుపాయాలు, ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్య సౌకర్యాలు, ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలలో చదువులు వంటి అనేక సమస్యలుంటాయి. ప్రైవేటు విద్య, వైద్య రంగాలలో జోక్యం చేసుకోవచ్చు. ఆటపాటల లాంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో యువతను భాగస్వాములను చేయవచ్చు. గ్రంథాలయాలు నడుపవచ్చు. పారిశుధ్యం, చదువు, వైద్యం లాంటి అనేక రంగాలలో సేవా కార్యక్రమాలు చేయవచ్చు. మహిళల మీద దాడులు, కులవివక్ష, కులదురహంకార దాడుల వంటి నిర్దిష్ట ఘటనలు జరిగినపుడు న్యాయం కోసం బాధితుల తరపున నికరంగా నిలబడాలి.

స్థానిక సమస్యల మీద కృషి అంటే ప్రజల దగ్గరికే వెళ్ళాలి. వారు కోరితేనే సహాయం చేయటం కాదు. సామూహిక సమస్యల పరిష్కారం కోసమే కాదు... సామూహిక కార్యక్రమాలకే పరిమితం కావద్దు. వ్యక్తిగత సమస్యల మీద, వ్యక్తిగతంగా కూడా పరిష్కారానికి సహకరించాలి. స్థానిక సమస్యల మీద పని చేయటం, తమ బస్తీ సమస్యల మీద, గ్రామ సమస్యల మీద పని చేయటం ఒక కార్యక్రమంగా కాదు.... అలవాటుగానే ఉండాలి. ఎవరికి ఏ సమస్య వచ్చినా వారికి మన కార్యకర్త గుర్తు రావాలి. పరిష్కారానికి సహకరిస్తారన్న విశ్వాసం పొందాలి. ప్రజలతో మమేకం కావటమంటే అదే. ఈ పనులు చేయడానికి పెద్ద నాయకులే కావాల్సిన అవసరం లేదు. సాధారణ పార్టీ సభ్యులు కూడా చేయవచ్చు. ఆగ్జిలరీ సభ్యులను కూడా ప్రోత్సహించాలి. కావల్సిందల్లా కొంచెం చొరవ, ప్రజల కోసం పని చేయాలన్న తపన. శాఖ పరిధిలోని బస్తీ / గ్రామం / పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజల సమస్యల మీద పార్టీ శాఖ, ఆగ్జిలరీ గ్రూపుల సమావేశాలలో ఎజెండాగా పెట్టి చర్చించాలి. పరిష్కారం కోసం కృషి చేయాలి. ప్రజలను కదిలించేందుకు ప్రయత్నిం చాలి. ప్రజలకు సమస్యను వివరించాలి. సమిష్టిగా కదిలితే తప్ప అధికారులు/పాలకులు పట్టించుకోరన్న విషయం చెప్పాలి. పాత న్యూస్‌పేపర్ మీద స్కెచ్ పెన్నులతో డిమాండ్స్ రాసి తలుపులకు, గోడలకు అంటించవచ్చు. కరపత్రం వేయవచ్చు, పత్రికా ప్రకటన

**“ శాఖ పరిధిలోని బస్తీ/గ్రామం/పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజల సమస్యల మీద పార్టీ శాఖ, ఆగ్జిలరీ గ్రూపుల సమావేశాలలో ఎజెండాగా పెట్టి చర్చించాలి. పరిష్కారం కోసం కృషి చేయాలి. ప్రజలను కదిలించేందుకు ప్రయత్నిం చాలి. ప్రజలకు సమస్యను వివరించాలి. సమిష్టిగా కదిలితే తప్ప అధికారులు/పాలకులు పట్టించుకోరన్న విషయం చెప్పాలి. పాత న్యూస్‌పేపర్ మీద స్కెచ్ పెన్నులతో డిమాండ్స్ రాసి తలుపులకు, గోడలకు అంటించవచ్చు. ”**



తెలంగాణాలో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న సిపిఐ(ఎం) నాయకులు

చేయవచ్చు. జనం కదలకపోతే సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇవ్వవచ్చు. ప్రజల్లో సంతకాల సేకరణ చేయవచ్చు. నల్లబ్యాడ్జీలు, డిమాండ్ బ్యాడ్జీలు ధరింపజేయవచ్చు. తమ ఇంటి ముందు పది నిమిషాలు ప్లకార్డులు పట్టుకుని నిలబడాలని నచ్చజెప్పవచ్చు. ప్లకార్డులు కూడా న్యూస్‌పేపర్ మీద రాసి పట్టుకోవచ్చు. కొంతమంది రావడానికి సిద్ధపడితే సామూహిక వినతిపత్రం ఇవ్వాలి. ఎక్కువమంది సామూహికంగా కదిలితే ధర్నా/ప్రదర్శన వంటి పోరాటాలు కూడా చేయవచ్చు. సమస్య తీవ్రత, ప్రజల సంసిద్ధతను బట్టి సమరశీల పోరాటం కూడా చేయవచ్చు. ఇవన్నీ ప్రధానంగా కార్యకర్తల చొరవ, పట్టుదల, ప్రజల పట్ల నిబద్ధత మీద ఆధారపడి ఉంటాయి. కార్యకర్తల ఆచరణ నుంచి పార్టీ సభ్యులు, ఆగ్జిలరీ సభ్యులు కూడా స్ఫూర్తి పొందుతారు. చొరవ ప్రదర్శిస్తారు. ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకోవటం, బాధల్లో ఉన్నపుడు పరామర్శ, సంబరాలు జరుపుకుంటున్నప్పుడు ఆశీర్వాదాలు లేదా శుభాకాంక్షలు, విజయాలు లేదా మంచి ఫలితాలు సాధించినపుడు అభినందనలు తెలుపటం అలవాటుగా మారాలి. అర్ధరాత్రి సమస్య వచ్చినా ఆదుకుంటారన్న భరోసా కల్పించాలి.

స్థానిక సమస్యల మీద నిరంతర కృషి జరుగుతున్నపుడే పార్టీ సజీవంగా ఉంటుంది. పార్టీ శ్రేణులలో ఉత్సాహం ఉంటుంది. పార్టీ సభ్యులైనా, ఆగ్జిలరీ సభ్యులైనా బాగా ఉత్సాహ పడేది స్థానిక సమస్యల మీద కృషిలోనే! చురుకుగా కూడా పాల్గొంటారు. సొంత బస్తీ / గ్రామం / వార్డులో ప్రజల గుర్తింపు పొందుతారు. తమ సమస్యలు పట్టించుకునే కమ్యూనిస్టు కార్యకర్తలు తమ పక్కనే ఉన్నారన్న విశ్వాసం కూడా ప్రజలకు కలుగుతుంది.

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల మీద నిరంతరం పని చేస్తున్నపుడు.... దానికి మన నిజాయితీ, నిబద్ధత, నమ్రత, అంకితభావం, పట్టుదల, త్యాగనిరతి వంటివి తోడవుతాయి. అందువల్ల ప్రతినెలా శాఖలూ, ఆగ్జిలరీ గ్రూపులు సమావేశపర్చటం మాత్రమే సరిపోదు. ప్రజా సమస్యల మీద కృషి చేయాలి. పార్టీ సభ్యులు, ఆగ్జిలరీ సభ్యులు స్వయంగా పాల్గొనాలి. ప్రజా కార్యాచరణ లేకుండా, కేవలం సిద్ధాంత చర్చలతో విప్లవ చైతన్యం రాదు. ఆగ్జిలరీ గ్రూపులను పని చేయించే క్రమంలో కార్యకర్తలు, పార్టీ శాఖలు, శాఖ కార్యదర్శులు, ఆగ్జిలరీ గ్రూపుల కన్వీనర్లు ఈ విషయాలు నిరంతరం గమనంలో ఉంచుకోవాలి. ❋

చరిత్ర

# మలి వేద కాలంలో సమాజం, మతం వర్ణ వ్యవస్థ తీరుతెన్నులు



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

**ఎంవిఎస్ శర్మ**

**ఋ**గ్వేద కాలం చివరి దశలోనే సమాజంలో నాలుగు తరగతులు ఏర్పడినట్టు పురుష సూక్తంలో ఉంది. వీటినే ఆ తర్వాత కాలంలో నాలుగు వర్ణాలుగా పరిగణించడం జరిగింది. అదే మంత్రం అథర్వవేదంలోను, శుక్ల యజుర్వేదంలోను మళ్ళీ చెప్పబడింది. బ్రహ్మ నుండి వచ్చినవారు బ్రాహ్మణులు అని బ్రాహ్మణ పదానికి అర్థం. ఈ విషయాన్ని శతపథ బ్రాహ్మణం నొక్కిచెప్పింది. అంటే తండ్రి వైపు నుండి వారసత్వాన్ని గుర్తించినట్టు కనపడుతోంది. వేదాలు చదవడం, తిరిగి నేర్పడం బ్రాహ్మణుల వృత్తి అని అందులో పేర్కొన్నారు. యాగాలను, క్రతువులను నిర్వహించినందుకు ప్రతిఫలంగా కానుకలను స్వీకరించడం, (ఆదాయి) వాటిని అనుభవించడం (ఆపాయి) బ్రాహ్మణుల వ్యాపకంలో భాగం. పౌరోహిత్య కర్మకాండలు నిర్వహించినందుకు భారీగా ప్రతిఫలాన్ని డిమాండు చేసేవారు. అంతే కాదు, సమాజం మొత్తం వారికి కొన్ని విషయాల్లో సేవలందించాలి. బ్రాహ్మణుడి భార్య, అతడి ఆవులను పవిత్రమైనవిగా పరిగణించాలి అని అథర్వవేదంలో పేర్కొన్నారు. యజ్ఞం నిర్వహించినందుకు ప్రతిఫలంగా బ్రాహ్మణుడు కోరిన భూమిని అతడికి రాజు ఇవ్వాల్సిందే. ( ఆ భూమి అప్పటికే వేరే బ్రాహ్మణుడి అధీనంలో ఉంటే గనుక దానికి మినహాయింపు ఇవ్వాలి) దేవతలకు అత్యంత ఇష్టులు గనుక బ్రాహ్మణులు పూజింపదగ్గవారు అని అథర్వవేదంలో చెప్పారు. ఎక్కడకు పోవాలనుకున్నా అక్కడకు పోయే స్వేచ్ఛ బ్రాహ్మణులకు ఉంది అని ఐతరేయ బ్రాహ్మణం తెలిపింది.

పాలకులను రాజన్యులు అని క్షత్రియులు అని రెండు విధాలుగా అథర్వవేదం పేర్కొంది. రాజన్ అంటే పాలకుడు. ఆ పదంలోంచి రాజన్య అన్న పదం వచ్చింది. అంటే రాజు యొక్క కుటుంబానికి చెందిన వ్యక్తి అని అర్థం. క్షత్రియ అన్న పదం క్షాత్రం అన్న పదం నుంచి వచ్చింది. క్షాత్రం అంటే యుద్ధం చేసే స్వభావం. రాజన్య, క్షత్రియ అన్న రెండు పదాలనూ ఒకదానికొకటి పర్యాయ పదాలుగా అథర్వవేదంలో, శుక్ల యజుర్వేదంలో ఉపయోగించారు. దానిని బట్టి యుద్ధం చేయగలవారి నుండే రాజు వస్తాడు అని, అధికారం వారిదే అని అనుకోవాలి. శతపథ బ్రాహ్మణంలో విశ్ ల నుండి క్షత్రియులు వచ్చారు అని తెలిపారు. విశ్ అంటే సామాన్యజనం అని అర్థం. ఆ సామాన్యజనంలో విలువిద్యలో మంచి నైపుణ్యం కలిగి, రథాలపై నిలిచి యుద్ధం చేయగల సమర్థులు క్షత్రియులుగా పరిగణించబడ్డారు.

బ్రాహ్మణులు, క్షత్రియులు కాక తక్కిన వారంతా విశ్ లు గా పరిగణించబడ్డారు. వైశ్యులు అన్న పదం చాలా అరుదుగా ఋగ్వేదంలో గాని అథర్వవేదంలో గాని కనిపిస్తుంది. రకరకాల వ్యాపకాలలో ఉండే సామాన్యులంతా విశ్‌లు. ఐతే వీరు స్వతంత్రులు. వీరినుండి రకరకాలుగా పన్నులు వసూలు చేయవచ్చు. వివిధ వృత్తులు చేసే విశ్ లకు, శూద్రులకు మరి తేడా ఏమిటి? బ్రాహ్మణులు, క్షత్రియులు కాని ఆర్యులంతా విశ్‌లు. శూద్రులు ఆర్యేతరులు. విశ్‌లకు ( తర్వాత కాలంలో వైశ్యులు) శూద్రులకు వారు చేసే వృత్తులను బట్టి వేరువేరుగా పరిగణించే విధానం ఏదీ లేదు. విశ్ లు ఆర్యులు, శూద్రులు ఆర్యేతరులు. అంతే. ఆర్యులు గనుక విశ్‌లు కూడా యజ్ఞాలు చేయడానికి, బలి ఇవ్వడానికి, యజ్ఞవాటికలలో ప్రవేశించడానికి అధికారం కలిగివుంటారు. శూద్రులకు ఆ అధికారం ఉండదు.

ఋగ్వేద కాలంలో ఆర్యులు కానివారిని 'దాస', 'దస్య' పదాలతో ప్రస్తావించారు. శుక్లయజుర్వేదకాలం నాటికి ఆ విధమైన ప్రస్తావన లేదు. దానికి బదులు ఆర్యులు, శూద్రులు అన్న విధంగా ప్రస్తావనలు ఉన్నాయి. అంటే ఆర్యులలో మూడు తరగతులు ఉన్నాయి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు. ఆర్యులు కాని వారు అందరూ శూద్రులుగా పరిగణింపబడ్డారు. ఇక్కడ తేడా వారు ఉపయోగించే భాషను బట్టి గాని, వారు నివసించే ప్రాంతం బట్టిగాని కాదు. అదే దాసులు, లేదా దస్యులు అని ఋగ్వేదంలో చేసిన ప్రస్తావనలు ఒక ప్రాంతంలో నివసించే వారి గురించి ఉన్నాయి. పైగా దాసులు, దస్యులు సమాజంలో భాగంగా పరిగణింపబడలేదు. వారిని సమాజానికి శత్రువులుగా పరిగణించారు. దానికి భిన్నంగా మలివేదకాలం వచ్చేసరికి శూద్రులు సమాజంలో అంతర్భాగంగానే పరిగణింపబడ్డారు. ఆర్య సమాజంలోని మూడు దొంతరల అడుగున నాలుగో దొంతరగా శూద్రులు వచ్చారు.

### ఆర్యేతరులే శూద్రులు

సమాజంలో భాగంగానే శూద్రులను పరిగణించినప్పటికీ, వారికి ఎటువంటి హక్కులూ లేవు. ఐతరేయ బ్రాహ్మణంలో శూద్రులు ఇతరులకు సేవకులుగా ఉండాలని, వారిని ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు బహిష్కరించవచ్చునని, ఎప్పుడు కావాలంటే అప్పుడు చంపేయవచ్చునని పేర్కొన్నారు.

శూద్రుడివద్ద ఎన్ని గోవులు ఉన్నా అతడి స్థాయి మారదని, శూద్రులు శాపగ్రస్తులని పంచవింశ బ్రాహ్మణం ప్రకటించింది. శూద్రులకు యాగాలు చేసే హక్కు లేదు. యజ్ఞం చేసే వ్యక్తి నేరుగా శూద్రుడితో మాట్లాడరాదు. మత గురువుల కంట పడరాదు. ఆ విధంగా సమాజ ఆచారాలలో “ మైల పడడం” అనే భావన ప్రవేశించింది. తర్వాత కాలంలో ఇదే అంటరానితనం గా మరింత బలపడింది.

ఆర్యులను ఎదిరించి, ప్రతిఘటించిన తెగలకు చెందిన దస్యులు, దాసులు తదితరుల నుండే శూద్రులు వచ్చారని మనం నిర్ధారించవచ్చు. వారిని తమకు సేవలు చేసే బానిసలుగా ఆర్యులు భావించారు గనుకనే దాసుడు, దాసి వంటి పదాలతో వారిని పిలిచారు. దాసీలు చాలా విలువైన కానుకలుగా పరిగణింపబడేవారు. యజ్ఞాలు నిర్వహించినందుకు ప్రతిఫలంగా పెద్ద సంఖ్యలో దాస, దాసీ జనాన్ని కానుకలుగా బ్రాహ్మణులు స్వీకరించేవారు.

క్రీ.పూ. 1500 నాటికి గంగా మైదాన ప్రాంతంలో వ్యవసాయం మొదలైంది. ఇనుము వాడకం బహుశా లేకపోవచ్చు. కేవలం కొయ్య తవ్వుకోలలతో వ్యవసాయం సాగివుండాలి. అయినా వ్యవసాయం మొదలైంది కనుక ఆ భూముల చుట్టూ కొంతమంది స్థిరనివాసాలు ఏర్పరచుకునివుండాలి. ఆ తర్వాత అక్కడికి వచ్చిన ఆర్య తెగలు స్థానికులపై ఆధిపత్యం సాధించి వారివద్ద నుండి పన్నుల రూపంలో, కానుకల రూపంలో ఆ వ్యవసాయంలోని మిగులును స్వాధీనం చేసుకోసాగారు. ఇక వేట, చేపలు పట్టడం వంటి వృత్తులపై ఆధారపడి జీవించే సంచార తెగల విషయంలో వైదిక ఆర్యులు క్రూరంగా వ్యవహరించారు. యజుర్వేదంలో నరబలి గురించిన ప్రస్తావనలు ఉన్నాయి. నిషాదులు, చండాలురు వంటి తెగలను అంటరాని జాతులుగా పరిగణించినట్టు కూడా ఆ సందర్భంలో ప్రస్తావించారు.

### వివాహ నియమాలు

రక్త సంబంధీకులు కాని వారిని మాత్రమే వివాహం చేసుకోవాలన్న నియమం అప్పటికి ఇంకా

ఉనికిలోకి వచ్చిన దాఖలాలు లేవు. (గోత్ర అన్న పదం పశువుల మందను ఉద్దేశించి మాత్రమే

ఉపయోగించారు.) అదే విధంగా కులం లోపలే వివాహం జరగాలన్న నియమాన్ని కూడా పాటించిన దాఖలాలు లేవు. వివాహ

“ దీనిని బట్టి ఒక స్త్రీ వివిధ కులాలకు చెందినవారిని భర్తగా స్వీకరించవచ్చునని ముందు నిర్ధారించవచ్చు. అలా స్వీకరించినవారిలో బ్రాహ్మణుడిదే మొదటి ప్రాధాన్యత అని ఆ మంత్రం స్పష్టం చేస్తోంది. పురుషుడు తన కులంలో కాని, అంతకన్నా తక్కువ కులంలోకాని స్త్రీని వివాహం చేసుకోవచ్చునన్న నియమం ఉండేదని భావించవచ్చు. శుక్ల యజుర్వేదంలో శూద్రుని భార్యను ఆర్యుడు ఎవడైనా లోబరుచుకోవడం తప్పు కాదు అని పేర్కొన్నారు. ”

సంబంధాలు ఏ విధంగా ఉండేవో సూచించే ఒక ఆసక్తికరమైన అథర్వవేద మంత్రాన్ని చూడండి ;

‘‘ పది మంది మాజీ భర్తలతో – వారెవరూ బ్రాహ్మణులు కాకపోతే – ఒక స్త్రీ జత కట్టినప్పటికీ,

ఆ తర్వాత ఒక బ్రాహ్మణుడు ఆమె పాణిగ్రహణం చేసినచో, అతడు మాత్రమే ఆమెకు యజమాని.

వేరే వైశ్యుడు కాని, రాజన్యుడు కాని ఆమెకు యజమాని కాజాలరు. ఆ బ్రాహ్మణుడే ఆమెకు యజమాని”

దీనిని బట్టి ఒక స్త్రీ వివిధ కులాలకు చెందినవారిని భర్తగా స్వీకరించవచ్చునని ముందు నిర్ధారించవచ్చు. అలా స్వీకరించినవారిలో బ్రాహ్మణుడిదే మొదటి ప్రాధాన్యత అని ఆ మంత్రం స్పష్టం చేస్తోంది. పురుషుడు తన కులంలో కాని, అంతకన్నా తక్కువ కులంలోకాని స్త్రీని వివాహం చేసుకోవచ్చునన్న నియమం ఉండేదని భావించవచ్చు. శుక్ల యజుర్వేదంలో శూద్రుని భార్యను ఆర్యుడు ఎవడైనా లోబరుచుకోవడం తప్పు కాదు అని పేర్కొన్నారు.

### స్త్రీల పరిస్థితి

మహిళల స్థానం సమాజంలో తక్కువగా ఉండేదని చెప్పవచ్చు. ఏ కులానికి చెందినప్పటికీ, స్త్రీ తక్కువ స్థాయికే చెందుతుందని, శూద్రులతో, కుక్కలతో, నల్ల పక్షితో ఆమె సమానమని, అపవిత్రతకు స్త్రీ మారురూపమని, ఆడువారు నేసిన దుస్తులను ధరించాల్సివచ్చినప్పుడు ప్రత్యేకంగా శుద్ధి చేయాలని, స్త్రీలు విచ్చలవిడిగా తిరిగే కాముకులని – ఇలా అథర్వ వేదంలో, శతపథ బ్రాహ్మణంలో పలు కించపరిచే ప్రస్తావనలు కానవస్తాయి.

అదే సమయంలో స్త్రీలకు శారీరకంగా కష్టసాధ్యమైన పనులను కేటాయించారని పలు వేద మంత్రాలను పరిశీలిస్తే తెలుస్తుంది. కంకర. సున్నం కలిపి గానుగాడే గృహనిర్మాణ సంబంధమైన పనులతో సహా వెదురు చీల్చి మేదరి పనులు చేయడం, ముళ్ళపొదలను తొలగించడం, బట్టలుతకడం, రంగులు వేయడం, కవచాలను తయారు చేయడం, వంటి పనులు స్త్రీలు చేయాలని వాజసనేయ మంత్రాలు (యజుర్వేదం) చెప్తున్నాయి. ఈ పనులను చేసే స్త్రీలను నరబలిలో బలి పశువులుగా వాడవచ్చునని కూడా పేర్కొన్నారు.

సంతానాన్ని కనలేని స్త్రీలు, వివాహం కాకుండా పుట్టింట్లో ఉండిపోయిన స్త్రీలు చాలా హీనంగా పరిగణింపబడేవారు. వివాహం సమయంలో కట్నం ఇచ్చే ఆచారం అప్పటికే ఉన్నట్టు అథర్వవేద మంత్రాల్లో ఉంది. బాల్య వివాహాలు అప్పటికి లేవనే చెప్పాలి. ఆ ఆచారం క్రీ.పూ. 700 తర్వాత రూపొందిన సూత్రాలలో మాత్రమే తొలుత కానవస్తుంది. ఎక్కువమంది భార్యలను కలిగివుండడం సంపన్నులకు, అధికారం ఉన్నవారికి పరిపాటిగా ఉండేది. భర్త మరణిస్తే ఆ స్త్రీ మళ్ళీ పెళ్ళి చేసుకునే పద్ధతి ఉండేది.

స్త్రీలను లైంగికంగా దోపిడీ చేసే విధానాలు ఉండేవి. ముఖ్యంగా శూద్ర స్త్రీలను అనుభవించడం ఆర్యులకు తప్పు కాదన్న నియమం దీనికి సూచన. శుక్ల యజుర్వేదం వ్యభిచారం ఒక వృత్తిగా చేపట్టిన స్త్రీల గురించి ప్రస్తావించింది.

### మతాచారాలు

ఋగ్వేదంలో కానవచ్చే విశ్వాసాలు, ఆరాధనా పద్ధతులు మలివేద కాలంలో కూడా కొనసాగినట్టు కనిపించినా, మత విశ్వాసాలలో, ఆచారాలలో చాలా మార్పులు వచ్చాయి. ఆర్యేతరులు అనుసరించిన పలు మతాచారాలను స్వీకరించినట్టు అథర్వవేదంలో మత ప్రస్తావనలు సూచిస్తున్నాయి. ఋగ్వేదంలో ఎక్కువ స్తోత్రాలు అగ్నికి, సోమ (మత్తుపానీయం) కు సంబంధించినవి. వాటితో బాటు అథర్వవేదంలో మంత్రించిన తాయెత్తులు,

" దేవతలకుండే శక్తులకన్నా యజ్ఞాలకు గల శక్తిని బ్రాహ్మణాలు ఎక్కువగా పరిగణించాయి. ప్రపంచంలో సంభవించే అద్భుతాలన్నీ ఏదోవొక యజ్ఞం చేయడం నుంచే సాధ్యపడ్డాయని బ్రాహ్మణాలు భావిస్తాయి. అందుచేత ఆ యజ్ఞాలను నిర్వహించే పద్ధతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చాయి. "

యంత్రాల ప్రస్తావనలు చాలాచోట్ల కనపడతాయి.

**బ్రాహ్మణాలు**

బ్రాహ్మణాలు ఋగ్వేద మంత్రాల యెడల చాలా భక్తిశ్రద్ధలు కనపరుస్తాయి. కాని ఋగ్వేదంలో అగ్ని, వరుణుడు, ఇంద్రుడు వంటి దేవతలకు పెద్ద స్థానం కల్పిస్తే బ్రాహ్మణాలు విష్ణువు, రుద్రుడు వంటి దేవతలకు ప్రముఖ స్థానం కల్పించాయి. ఈ రుద్రుడే ప్రస్తుత కాలంలో శివుడుగా కొలవబడుతున్నాడు. విష్ణువు అవతారాల ప్రస్తావనలు మాత్రం ఎక్కడా లేవు. స్థానిక తెగలను లొంగదీసుకున్న ఆర్యులు వారి మత నమ్మకాలను, ఆచారాలను, దేవతలను తమ మతాచారాలలో విలీనం చేసుకున్నారు. ఈ విధంగా స్థానిక దేవతల శక్తులను ఎక్కువగా రుద్రుడికి (శివుడికి) ఆపాదించారు. ఆ శివుడిని పశుపతిగా ఆరాధించారు.

దేవతలకుండే శక్తులకన్నా యజ్ఞాలకు గల శక్తిని బ్రాహ్మణాలు ఎక్కువగా పరిగణించాయి. ప్రపంచంలో సంభవించే అద్భుతాలన్నీ ఏదోవొక యజ్ఞం చేయడం నుంచే సాధ్యపడ్డాయని బ్రాహ్మణాలు భావిస్తాయి. అందుచేత ఆ యజ్ఞాలను నిర్వహించే పద్ధతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చాయి.

**ఆరణ్యకాలు**

సమాజ జీవితాన్నుండి విరమించుకుని జీవితపు చివరి రోజుల్ని అడవుల్లో గడపడానికి నిర్ణయించుకున్న పురోహిత వర్గం రూపొందిచినవి ఈ ఆరణ్యకాలు. వీటిలో యజ్ఞాలకు ప్రాధాన్యత తగ్గిపోయింది. బలులివ్వడం, కానుకలు స్వీకరించడం వంటివి ఆరణ్యకాలలో ప్రస్తావనకు నోచుకోలేదు. ఆ స్థానంలో ధ్యానం ప్రధానం అయింది. ఈ ధ్యానం నుంచే తాత్విక చర్చలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన ఉపనిషత్తులు వచ్చాయి.

**ఉపనిషత్తులు**

ఉపనిషత్తులు తర్కబద్ధమైన తాత్విక చర్చలకు ప్రాధాన్యతనివ్వలేదు. గురువు బోధించేదే పరమ సత్యం అన్న సూత్రాన్నే ఎక్కువగా పాటించారు. ఐనప్పటికీ, ఉపనిషత్తులలో ముందుకు తెచ్చిన తాత్విక భావనలకు ప్రాధాన్యత ఉంది. "బ్రహ్మ", "ఆత్మ" అనే రెండు భావనలను ఉపనిషత్తులు ఎక్కువగా చర్చించాయి. ఏ శక్తినైతే ఈ విశ్వానికంతటికీ మూలంగా వేదాలు పరిగణించి కొలిచాయో, దానినే బ్రహ్మ (పరమాత్మ) అన్నారు. శరీరంతో నిమిత్తం లేకుండా ఆత్మ ఉనికిలో

ఉంటుందని సూత్రీకరించి దానికి, బ్రహ్మకు మధ్య ఉండే సంబంధం గురించి సుదీర్ఘమైన, ఊహాజనితమైన చర్చలకు తెర లేపారు.

"విశ్వానికి మూలం బ్రహ్మ" అన్నది వేదాలలో వ్యక్తం అయిన విశ్వాసం. దాని స్థానంలో " అసలు ఉనికిలో ఉన్నదే బ్రహ్మ, తక్కినదంతా మాయ" అన్న సూత్రం వచ్చింది. శరీరం నశించినా ఆత్మకు చావు ఉండదు అన్న సూత్రం వచ్చింది. చేసిన కర్మలను బట్టి ఆత్మ వివిధ జన్మలను పొందుతుంది అన్న కర్మ సిద్ధాంతం వచ్చింది. చేసిన కర్మలు అత్యున్నత స్థాయికి చేరాక ఆత్మ బ్రహ్మలో విలీనం ఔతుంది. ఆత్మ బ్రహ్మలో విలీనం అవడమే మోక్షం. -- తొలి దశలో వచ్చిన ఉపనిషత్తులలో వ్యక్తం అయిన భావాలు ఇవి. తర్వాత కాలంలో వేదాంతం అనే తాత్విక సిద్ధాంతానికి మూలం ఈ ఉపనిషత్తులే.

ఏ కులంలో పుట్టినవారు ఆ కులంలోనే ఉండాలన్న కులవ్యవస్థ నియమాలకు, ఉపనిషత్తులలో చెప్పిన కర్మ సిద్ధాంతానికి తేడా ఉంది. బతికివున్నంతకాలమూ కులం మార్చుకోవడం సాధ్యం కాదు కాని మరణించాక పెద్ద కులంలో తిరిగి జన్మించే అవకాశం ఉంటుంది. ఐతే అది మనం చేసే కర్మను బట్టి ఉంటుంది అని కర్మ సిద్ధాంతం చెప్తుంది. వచ్చే జన్మలో పెద్ద కులంలో పుట్టవచ్చునన్న ఊరట కలిగిస్తూ, అదే సమయంలో కులవ్యవస్థను అణగారిన కులాల వారు సవాలు చేయకుండా చూస్తుంది. దయ, జాలి, ఆత్మనిగ్రహం వంటి లక్షణాలు కలిగివుండాలని

ఉపనిషత్తులు బోధిస్తాయి.

**సంస్కృతి**

మలివేద కాలంలో భాషను క్రమబద్ధీకరించి వ్యాకరణం రూపొందించే ప్రయత్నం జరిగింది. ఛాందోగ్యోపనిషత్‌లో ఈ ప్రయత్నాన్ని చూస్తాం. నోటితో ఉచ్చరించే తీరును బట్టి అచ్చులు, హల్లులు అన్న విభజన చేశారు. ఈ ప్రయత్నం మొదలైన తర్వాత చాలా కాలానికి గాని పాణిని వ్యాకరణం రాలేదు. (క్రీ.పూ. 400)

వేదాల్లో సైన్సు అంతా ఉందని ఇప్పటి పాలకులు తెగ ప్రచారం చేస్తున్నారు. కాని మలివేదకాలం నాటికి కనీసం సౌరమానం కూడా రూపొందలేదు. చాంద్రమానం పాటించినట్టు దాఖలాలు

ఉన్నా, దానిలో సౌర సంవత్సరానికి సర్దుబాటు చేసే విధానం ఏదీ లేదు. శతపథ బ్రాహ్మణంలో ఒక దగ్గర 12 మాసాల సంవత్సరం అని, మరో దగ్గర 13 మాసాల సంవత్సరం అని ప్రస్తావనలు ఉన్నాయి. కృష్ణ యజుర్వేదంలో చంద్రుడి కదలికల గురించి, 28 నక్షత్రాల గురించి పేర్కొన్నారు. నక్షత్రాల గమనాన్ని పరిశీలించడం ఒకవృత్తిగా గుర్తించబడింది. ఐతే గ్రహణాలు ఎందుకు సంభవిస్తాయో ఆనాటికి తెలియదు. రాహువు వల్లనే గ్రహణాలు వస్తాయని విశ్వసించేవారు. ఇదీ వేదాలలో విజ్ఞానం స్థాయి.

ఇక వైద్యం సంగతి చూద్దాం. అథర్వవేదం శరీరంలో వివిధ భాగాల గురించి ప్రస్తావించింది. శతపథ బ్రాహ్మణంలో మనిషి వెన్నుపూసలు 26 ఉంటాయని లెక్కించింది. రకరకాల రోగాల గురించి ప్రస్తావనలు ఉన్నాయి కాని అవేమిటో స్పష్టంగా చెప్పలేము. రకరకాల లేపనాలను ఉపయోగించేవారు. వివిధ రకాల మొక్కలను, చెట్ల వేళ్ళను, బెరడులను వైద్యం కోసం

ఉపయోగించేవారు.

దేవతారాధనల సమయాల్లో, బలులిచ్చే సందర్భాల్లో నృత్యాలు చేసేవారు, పాడేవారు, రకరకాల వాయిద్యాలను వాయించేవారు ఉండేవారు. వీళ్ళు పాడే పాటలేవీ లిఖితపూర్వకంగా లేవు. నోటిమాటద్వారానే నేర్చుకునేవారు.

❋

# అమెరికా ఆధిపత్య వ్యూహానికి చైనా-రష్యాల చెక్



రచయిత 'మార్క్సిస్టు' సంపాదకులు

**ఎస్. వెంకట్రావు**

అమెరికా అధ్యక్ష పీఠంపై ఎవరున్నా దాని సామ్రాజ్యవాద విధానాల్లో మార్పు ఉండదన్న విషయాన్ని డెమోక్రాటిక్ పార్టీకి చెందిన కొత్త అధ్యక్షుడు జో బైడెన్ మరోమారు రుజువు చేశారు. అంతర్జాతీయ వాతావరణ ఒప్పందం లోనూ, ప్రపంచ ఆరోగ్య సంస్థలోనూ తిరిగి చేరడం వంటి కొన్ని సానుకూల చర్యలు మినహా, దిగజారిపోతున్న అమెరికా ప్రపంచా ధిపత్యాన్ని కాపాడుకోడానికి యుద్ధోన్మాదం వైపు అడుగులు వేయడం విషయంలో బైడెన్ గత అధ్యక్షులు ఒబామా, డొనాల్డ్ ట్రంప్ అడుగు జాడల్లోనే నడుస్తున్నారు. ముఖ్యంగా రష్యా, చైనాలను నిలువరించే వ్యూహాన్ని అమలు చేయడంలో ఆయన ట్రంప్ కన్నా కొంచెం దూడుకు గానే వ్యవహరిస్తున్నారు. జనవరి 20న బైడెన్ అధికారం చేపట్టి రెండు మాసాలు తిరగక ముందే వరుసగా జరిగిన ఐదు అంతర్జాతీయ వ్యూహాత్మక సమావేశాల్లో అమెరికా వైఖరి కయ్యానికి కాలుదువ్వే విధంగానే ఉంది. వాటిలో మొదటిది, ఫిబ్రవరి 19న ఆన్‌లైన్‌లో జరిగిన మ్యూనిచ్ భద్రతా వార్షిక సమావేశం. రెండవది, ఫిబ్రరి 17,18 తేదీల్లో రెండు రోజుల పాటు బ్రసెల్స్‌లో జరిగిన 'నాటో' రక్షణ మంత్రుల సమావేశం. మూడోది, ఆ మరునాడే జరిగిన జి7 దేశాల ఆన్‌లైన్ సమావేశం. నాల్గవది మార్చి 12న అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య ఆన్‌లైన్‌లో జరిగిన చతుర్ముఖ కూటమి (క్వాడ్) సమావేశం. అయిదోది, మార్చి 19న అలస్కాలోని యాంకరేజ్‌లో అమెరికా, చైనాల మధ్య విదేశాంగ శాఖల స్థాయిలో జరిగిన ద్విముఖ సమావేశం. తన సామ్రాజ్యవాద ప్రపంచాధిపత్యానికి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనడమే ఎజెండాగా ఈ సమావేశాలను అమెరికా నిర్వహించింది. క్షీణించిపోతున్న ఆధిపత్యాన్ని తిరిగి నిలబెట్టుకోడానికి జో బైడెన్ ప్రభుత్వ పెనుగులాట, ముఖ్యంగా ఐరోపా లోనూ, ఆసియా-పసిఫిక్‌లోనూ తన ఆధి పత్యానికి అడ్డుగా నిలిచిన రష్యా, చైనాలకు వ్యతిరేకంగా వివిధ ప్రాంతాల్లో ప్రాంతీయ, సైనిక కూటములను పటిష్ట పరుచడానికి అది చేసే ప్రయత్నాలు ఇందులో మనకు కనిపిస్తాయి.

**మ్యూనిచ్ భద్రతా వార్షిక సమావేశం**

ప్రధానంగా నాటో, ఐరోపా యూనియన్‌కు చెందిన నాయకులు, భద్రతా వ్యవహారాల నిపుణలతో కూడిన ఈ వేదిక వార్షిక సమావేశంలో ప్రపంచాధిపత్య పోరుకు నాయకత్వం వహించడానికి "అమెరికా తిరిగి వచ్చింది" అని బైడెన్ ప్రకటించారు. ట్రంప్ 'అమెరికా మొదట' (అమెరికా ఫస్ట్) నినాదం వల్ల ప్రపంచాధిపత్య పోరులో అమెరికా వెనుకబడిపోయిందనీ, ఇప్పుడు ఆ వైఖరి నుండి అమెరికా వెనక్కు వచ్చేసిందని, "ప్రజాస్వామ్యం కోసం" చైనా, రష్యాలకు వ్యతిరేకంగా జరిగే 'ప్రపంచ ఆధిపత్య' (వరల్డ్ పవర్) ఘర్షణలో అమెరికా ప్రపంచానికి నాయకత్వం వహిస్తుం దని ఆయన పేర్కొన్నాడు. బైడెన్‌తో పాటు జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. బైడెన్ అధికారం చేపట్టిన తరువాత తొలిసారిగా అంతర్జాతీయ రంగంలో అమెరికా నిర్వహించబోయే పాత్ర గురించి ఈ సమావేశంలో ప్రకటించారు. "ప్రపంచంపై ఆధిపత్యం వహించే శక్తి ఎవరు అనే పోటీ తిరిగి వచ్చింది. నియమాల ప్రకారం నడిచే అంతర్జాతీయ వ్యవస్థ, దాని సంస్థలు బలహీనమైపోయాయి" అని బైడెన్ పేర్కొన్నారు. 20 నిమిషాల ప్రసంగంలో బైడెన్ 'అమెరికా తిరిగి వచ్చింది' అన్న మాటను మూడు సార్లు ప్రస్తావించారు. ఈ మాట వెనుక 'ట్రంప్ కన్నా తాను మరింత దుందుడుకు విధానాలకు, సైనిక చర్యలకు పాల్పడతానన్న' హెచ్చరిక దాగి ఉంది.

యూరప్‌లో రష్యానూ, ఆసియా, పసిఫిక్‌లో చైనానూ నిలువరించడమే లక్ష్యంగా బైడెన్ ఉపన్యాసం సాగింది. దూరమవుతున్న ఐరోపా మిత్రులను తన సామ్రాజ్యవాద యుద్ధ వ్యూహంలోకి తిరిగి లాక్కోవడానికి ఆయన ప్రయత్నించారు. పశ్చిమ దేశాల "ప్రజాస్వామ్య విలువల"కు చైనా, రష్యాల నుండి సవాళ్లు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నాడు. "రష్యా మన ప్రజాస్వామ్య వ్యవస్థలపై దాడి చేస్తోంది. మన పరిపాలనా విధానాన్ని బలహీన పరచ డానికి ప్రయత్నిస్తోంది", "పుతిన్ ఐరోపాను, ఐరోపా లక్ష్యాన్ని, మన నాటో కూటమిని బలహీనపరచడానికి, అమెరికా-ఐరోపాల మధ్య ఐక్యతను వమ్ముచేయడానికి ప్రయత్నిస్తున్నాడు" అని బైడెన్ అన్నారు. అమెరికా-ఐరోపా ఐక్యతను చెడగొడుతున్నారు అన్న మాటను రష్యా-జర్మనీల మధ్య నిర్మించబడుతున్న నార్డ్ స్ట్రీమ్-2 పైప్‌లైన్‌ను దృష్టిలో ఉంచుకుని చెప్పాడు. రష్యా నుండి ఐరోపాకు సహజవాయువు చేరవేసే ఈ గ్యాస్ పైప్‌లైన్ 1,230 కిలోమీటర్ల పొడవున బాల్టిక్ సముద్రం కిందనుండి నిర్మించబ డుతున్నది. 95 శాతం పూర్తయిన ఈ పైప్ లైన్ వల్ల ఐరోపావాసులకు 50 ఏళ్ల పాటు చౌకగా గ్యాస్ లభిస్తుంది. ఉభయ తారకంగా ఉన్న ఈ గ్యాస్ పైప్‌లైన్ పూర్తయితే ఐరోపా దేశాలు తన పట్టునుండి జారిపోతాయని అమెరికా భయపడుతోంది. మూనిచ్ సమావేశం లో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మాట్లాడుతూ ఈ పైప్‌లైన్ పూర్తి కాకుండా అమెరికా అన్ని విధాలా అడ్డుకుంటుందని ప్రకటించారు. దీని వల్ల "పుతిన్ ప్రభుత్వం రష్యా ఇంధనాన్ని ఆయుధాలకు వాడు కుంటుంది, ఐరోపా మొత్తంపై రాజకీయ ఒత్తిడి పెంచుతుంది" అని అన్నారు. ఈ ప్రాజెక్టుకు

> **"చైనాకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక వ్యూహాత్మక పోటీ కోసం" నాటో కూటమి దేశాలన్నీ కలిసి పనిచేయాలని బైడెన్ ఐరోపా దేశాలను కోరారు. బైడెన్ అధికారంలోకి వచ్చిన వెంటనే చైనాపై సైనిక కవ్వింపులకు దిగాడు. ఇటీవలి వారాల్లో అమెరికా దక్షిణ చైనా సముద్రంలో రెండు విమానవాహక యుద్ధ నౌకలను మోహరించింది. "నౌకాయాన స్వేచ్ఛ" ను కాపాడే పేరుతో తైవాన్ జలసంధిలోకి, చైనా అధీనంలోని పరాసెల్ ద్వీపాల వద్దకు యుద్ధ నౌకలు పంపింది.**


అయ్యే ఖర్చులో సగం రష్యా ప్రభుత్వరంగ ఇంధన సంస్థ భరిస్తుండగా, మిగిలిన సగం ఐరోపా సంస్థలు భరిస్తున్నాయి. ఆ సంస్థలపై ఆంక్షలు విధించడానికి బైడెన్ ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

''చైనాకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక వ్యూహాత్మక పోటీ కోసం" నాటో కూటమి దేశాలన్నీ కలిసి పనిచేయాలని బైడెన్ ఐరోపా దేశాలను కోరారు. బైడెన్ అధికారంలోకి వచ్చిన వెంటనే చైనాపై సైనిక కవ్వింపులకు దిగాడు. ఇటీవలి వారాల్లో అమెరికా దక్షిణ చైనా సముద్రంలో రెండు విమానవాహక యుద్ధ నౌకలను మోహరించింది. "నౌకాయాన స్వేచ్ఛ" ను కాపాడే పేరుతో తైవాన్ జలసంధిలోకి, చైనా అధీనంలోని పరాసెల్ ద్వీపాల వద్దకు యుద్ధ నౌకలు పంపింది.

### నాటో రక్షణ మంత్రుల సమావేశం

ఈ సమావేశం ప్రధానంగా మధ్య ప్రాచ్యంలో సిరియా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో నాటో దళాల ఉనికిపై చర్చించింది. తాలిబాన్లతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ ఏడాది మే 1 నాటికి ఆఫ్ఘనిస్తాన్ నుండి అమెరికా దళాలు వైదొలగాలి. కానీ బైడెన్ ప్రభుత్వం వాటిని మరి కొన్నాళ్లు కొనసాగించే ఉద్దేశంలో ఉంది. ఈ సమావేశంలో ప్రధాన అజెండా కాకపోయినప్పటికీ అమెరికా అధికారులు మాత్రం రష్యా, చైనాలను నిలువరించే అంశాన్ని చర్చనీయాంశం చేశారు. రష్యా వల్ల ''అమెరికాతో సహా నాటో కూటమిలోని సభ్యదేశాలన్నిటికీ ముప్పు పొంచి ఉంది" అని అమెరికా రక్షణశాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. అమెరికా సామ్రాజ్యవాదపు స్వంత "నియమాల ఆధారంగా నిర్మితమైన అంతర్జాతీయ వ్యవస్థ"ను రష్యా ధ్వంసం చేయడానికి పూనుకున్నదని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా సమావేశం తొలిరోజు



అమెరికా నూతన అధ్యక్షుడు జో బైడెన్

మాట్లాడిన నాటో ప్రధాన కార్యదర్శి స్టోలెన్‌బెర్గ్... 2010లో రూపొందించిన నాటో వ్యూహాన్ని ప్రస్తుతం చైనా, రష్యాల నుండి ఎదురవుతున్న 'సవాళ్లను' ఎదుర్కొనే విధంగా మార్పు చేయాలని కోరారు. 2010లో నాటో వ్యూహం ఖరారు చేసినప్పుడు చైనా ఎదుగుదల ప్రమాదం మన ముందు లేదు. ఆనాడు రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యంతో పనిచేయాలని మనం భావించాం. కానీ నేడు ఆ రెండు దేశాలను ఎదుర్కొనే విధంగా మన వ్యూహం మార్చాల్సి ఉంది అని అన్నాడు. అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ మాట్లాడుతూ చైనా, రష్యా నుండి వచ్చే సవాళ్లను నాటో దేశాలు గుర్తించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు నాటో దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

### జి7 దేశాల సమావేశం

30 దేశాల నాటో విదేశాంగ మంత్రుల సమావేశం ముగిసిన మరునాడే ఈ సమావేశం జరిగింది. వచ్చే జూన్ 11-13 తేదీల్లో జి7 శిఖరాగ్ర సదస్సుకు ముందుగా జరిగిన ఈ సమావేశంలో కోవిడ్ అనంతర ప్రపంచంలో సంక్షోభాన్ని నివారించడం ఎలా అన్నది ప్రధాన ఎజెండా. అయితే ట్రంప్ విధానాల వల్ల అమెరికాకు దూరం జరిగిన మిత్రులను ఒకటి చేసి చైనాకు వ్యతిరేకంగా నిలపడం అమెరికా స్వంత ఎజెండా. ట్రంప్ హయాంలో జి7 దేశాల మధ్య విభేదాలు బహిరంగంగా వ్యక్తమయ్యాయి. కెనడాలో జరిగిన జి7 శిఖరాగ్ర సదస్సులో జర్మనీ, ఫ్రాన్స్, కెనడా దేశాధినేతలు ట్రంప్‌ను చుట్టుముట్టి నిలదీసిన ఫోటోలు ప్రపంచ మంతటా ఫ్లాష్ అయ్యాయి. అదీగాక కొన్ని సంవత్సరాలుగా జి20 సమావేశాలకు ప్రాధాన్యత పెరుగుతున్న దృష్ట్యా అమెరికా నాయకత్వంలోని పాత సామ్రాజ్యవాద కూటమి అయిన జి7కు ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. బైడెన్ తిరిగి సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసం ఈ పాత కూటమిని పనిలో పెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగమే ఫిబ్రవరి 19 సమావేశం. చైనాకు వ్యతిరేకంగా తన మిత్రులను కూడగట్టే పనిని అమెరికా జి7 సమావేశంతో ప్రారంభిస్తున్నదని సమావేశానంతరం సామ్రాజ్యవాద మీడియా ఊదరగొట్టడం మొదలు పెట్టింది.

### అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా దేశాల చతుష్ట కూటమి (క్వాడ్) సమావేశం

మార్చి 12న ఆన్‌లైన్‌లో జరిగిన ఈ సమావేశాన్ని "చారిత్రాత్మకమైనది"గా అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివాన్ అభివర్ణించారు. అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేస్తున్న చైనాను చుట్టుముట్టి నిలువరించేందుకు దశాబ్దం క్రితం అమెరికా ఈ వ్యూహాత్మక కూటమిని రూపొందించింది. ఆసియాలో 'మినీ నాటో'గా పిలవబడుతున్న ఈ నాలుగు దేశాల కూటమి లక్ష్యాల్లో ప్రధానమైనది, అమెరికా అధికారుల మాటల్లోనే..."తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లో నియమాల ఆధార సముద్రయానానికి ఎదురవుతున్న సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొనడం, నౌకాయాన భద్రతను కాపాడటం." ఈ రెండు సముద్రాల్లో చైనాకూ పొరుగు దేశాలకూ మధ్య ఉన్న విభేదాలను ఉపయోగించుకుని, చైనాకు వ్యతిరేకంగా అమెరికా ఈ ప్రాంత దేశాలను కూడగట్టడానికి క్వాడ్‌ను ఏర్పాటు చేసింది. ట్రంప్ ప్రదర్శించిన చైనా వ్యతిరేకత నుండి బైడెన్ వెనక్కి తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయాలకు భిన్నంగా ఆయన ఇండో-పసిఫిక్ ప్రాంత సైనికీకరణకు ప్రాధాన్యత పెంచారు. "అమెరికా భద్రతకు ఇండో-పసిఫిక్ కీలకంగా ఉంటుంది" అని అమెరికా భద్రతా సలహాదారు జేక్ సుల్లివాన్ ప్రకటించారు. చైనా నుండి "ఇండో-పసిఫిక్‌కు

స్వేచ్ఛ" కల్పించడమే కాకుండా, ఉత్తర కొరియాను అణ్వస్త్ర రహితంగా మార్చడం కూడా తమ బాధ్యత అని 12వ తేదీ సమావేశంలో క్వాడ్ ప్రకటించింది.

**అమెరికా, చైనాల విదేశాంగ మంత్రుల అలస్కా సమావేశం**

వీటన్నిటిలోకీ ప్రధానమైనది మార్చి 19న అలాస్కాలోని ఆంఖోరేజ్‌లో జరిగిన అమెరికా, చైనా విదేశాంగ మంత్రుల స్థాయి సమావేశం. అమెరికా విదేశాంగ మంత్రి ఆంథోనీ బ్లింకెన్, జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివాన్, చైనా వైపు నుండి ఆ దేశ విదేశాంగ మంత్రి వాంగ్ యి, విదేశీ విధాన నిర్ణయ అధికారి యాంగ్ జీచి ముఖాముఖి పాల్గొన్నారు. అయితే సమావేశానంతరం జరిగిన ఉమ్మడి పత్రికా గోష్టిలో అమెరికా ప్రతినిధులు దౌత్య మర్యాదలను వదిలిపెట్టి విలేకరులందరి ముందు చైనాపై నేరుగా ఆరోపణలకు, హెచ్చరికలకు దిగారు. చైనాపై విరుచుకుపడే విషయంలో ట్రంప్ ప్రభుత్వం కన్నా బైడెన్ ప్రభుత్వం మరింత బరితెగించి వ్యవహరిస్తోందన్న విషయాన్ని అలస్కా సమావేశం వెల్లడించింది. "నియమాల ఆధారంగా నడిచే అంతర్జాతీయ వ్యవస్థ''కు కట్టుబడి ఉండకపోతే తీవ్ర పరిణామాలుంటాయని అమెరికా విదేశాంగ మంత్రి బహిరంగంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా సింజియాంగ్ రాష్ట్రంలోని పరిణామాలు, హాంగ్‌కాంగ్, తైవాన్, అమెరికాపై సైబర్ దాడులు, అమెరికా మిత్రదేశాలపై చైనా ఆర్థిక వేధింపులు వంటి పాచిపోయిన ఆరోపణలే అమెరికా చేసింది. సుల్లివాన్ మాట్లాడుతూ చైనాకు వ్యతిరేకంగా సైనిక కూటములను, వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన చైనాను సైనికంగా చుట్టుముట్టే ఎత్తుగడతో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, భారత్‌లతో కూడిన చతుష్ట కూటమి (క్వాడ్) ఏర్పాటు గురించి విశేషంగా చెప్పారు. చైనాతో సంబంధాల మెరుగుదలకు కాకుండా వాటిని మరింత విషతుల్యం చేసేందుకు అలాస్కా సమావేశాన్ని అమెరికా వినియోగించుకుంటున్నదని గ్రహించిన చైనా అదే విలేకరుల సమావేశంలో అమెరికా నేతల ఆరోపణలను అంతే తీవ్రంగా తిప్పికొట్టింది. కొద్ది దేశాల ముఠా చెబుతున్న "నియమాల ఆధార అంతర్జాతీయ వ్యవస్థ''కు మేము కట్టుబడబోము. "ఐక్యరాజ్య సమితి కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ వ్యవస్థకు మేము

**"అంతర్జాతీయ సూత్రాలు, విలువలు అని అమెరికా చెబుతున్నది నిజంగా ఐక్యరాజ్య సమితిలో అన్ని దేశాలూ కలిసి చేసిన సూత్రాలు, అన్ని దేశాలకూ వర్తించే విలువలు కావు. ఎందుకంటే ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అత్యధిక సార్లు తోసి రాజని వ్యవహరించిన దేశం అమెరికా. ఐరాస తీర్మానాలను లెక్కచేయ కుండా ఇరాక్, సిరియా, లిబియా, ఆఫ్ఘనిస్తాన్‌ల మీద, గతంలో సెర్బియా మీద దండయాత్రలు చేసి లక్షలాది మంది ప్రజల ప్రాణాలు తీసింది అమెరికా."**



అలాస్కాలో అమెరికా, చైనాల మధ్య విదేశాంగ మంత్రుల స్థాయిలో జరిగిన సమావేశం

కట్టుబడతాం. కండబలంతో ఇతర దేశామీద దండయాత్రలు సాగించడం, వివిధ మార్గాల ద్వారా ఇతర దేశాల్లో ప్రభుత్వాలను కూలదోయడం, లేక ఇతర దేశాల్లో ప్రజలను ఊచకోత కోయడంపై మాకు నమ్మకం లేదు" అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ అమెరికా చెంపమీద కొట్టినట్టు మాట్లాడారు. మానవ హక్కుల గురించి మీరు మాకు చెప్పనక్కర లేదు. మీ దేశంలో నల్లజాతి వారిని పోలీసులు నిత్యం చంపుతున్నారు, పజాస్వామిక హక్కులు హరించబడుతున్నాయి అని ఆయన అమెరికా విదేశాంగ మంత్రికి గుర్తు చేశారు. చైనా సైబర్ దాడులకు పాల్పడుతున్నదన్న ఆరోపణను తిప్పికొడుతూ "సైబర్ దాడులు చేయడంలోనూ, దానికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలోనూ అమెరికా ఈ ప్రపంచంలో ఛాంపియన్‌గా నిలుస్తుంది" అని విమర్శించారు. అమెరికా అభిప్రాయాలు, లేక ఐరోపా దేశాల అభిప్రాయాలు ప్రపంచ ప్రజల అభిప్రాయాలు ఎంతమాత్రం కావు, అమెరికా చెబుతున్న సార్వత్రిక విలువలను ప్రపంచంలోని మెజారిటీ దేశాలు అంగీకరించడం లేదు. కొద్దిమంది కూర్చుని కొన్ని నియమాలు రూపొందిస్తే అది అంతర్జాతీయ నియమావళి అయిపోదు" అని వాంగ్ తిప్పికొట్టారు. "అమెరికా అనవసరంగా విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు. గత కొన్ని సంవత్సరాలుగా చైనా న్యాయమైన హక్కులు, ప్రయోజనాలపై దాడులు చేస్తున్నారు. దాని వల్ల చైనా–అమెరికా సంబంధాలు దెబ్బతినడమే కాకుండా ప్రపంచ సుస్థిరతకూ, అభివృద్ధికీ ఆటంకంగా మారింది. ఈ పరిస్థితి ఇంకెంత మాత్రం కొనసాగ కూడదు" అని హెచ్చరించారు.

అంతర్జాతీయ సూత్రాలు, విలువలు అని అమెరికా చెబుతున్నది నిజంగా ఐక్యరాజ్య సమితిలో అన్ని దేశాలూ కలిసి చేసిన సూత్రాలు, అన్ని దేశాలకూ వర్తించే విలువలు కావు. ఎందుకంటే ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అత్యధిక సార్లు తోసి రాజని వ్యవహరించిన దేశం అమెరికా. ఐరాస తీర్మానాలను లెక్కచేయకుండా ఇరాక్, సిరియా, లిబియా, ఆఫ్ఘనిస్తాన్‌ల మీద, గతంలో సెర్బియా మీద దండయాత్రలు చేసి లక్షలాది మంది ప్రజల ప్రాణాలు తీసింది అమెరికా. అనేక దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుని అక్కడ ప్రభుత్వాలను కూలదోయడానికి తిరుగుబాట్లను (కలర్

> **“ ప్రపంచంలో ఏకచ్ఛత్రాధిపత్యానికి కాలం చెల్లిందనీ, “బహుళపక్ష” ప్రపంచం ఏర్పడిందని జర్మన్ ఛాన్సలర్ మెర్కెల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌లు పదేపదే చెబుతున్నారు. ఈ రోజున అమెరికా, ఐరోపా మధ్య జరిగే వాణిజ్యం కన్నా చైనా ఐరోపాల మధ్య వాణిజ్యం మించి పోవడాన్ని గమనిస్తే ఐరోపా ఇంకెంత మాత్రం అమెరికాపై ఆధారపడే పరిస్థితి లేదని తెలుస్తున్నది. ”**

రివల్యూషన్స్) ప్రోత్సహించింది అమెరికా. క్యూబా మీద దశాబ్దాలుగా ఆర్థిక ఆంక్షలు పెట్టింది అమెరికా. ఈ నాటికి వెనిజులా, ఉత్తర కొరియా, ఇరాన్ వంటి దేశాల్లో ప్రభుత్వాలను పడగొట్టడానికి ప్రయత్నిస్తున్నది అమెరికా. తన ఆర్థిక ప్రయోజనాలకు భిన్నంగా నడుచుకునే దేశాల మీదా, వాటితో వ్యాపారం చేసే కంపెనీల మీద ఆంక్షలు విధించి వేధిస్తున్నది అమెరికా. ఇటువంటి పాపాల భైరవుడు ఇతర దేశాలకు నీతులు చెప్పడం విచిత్రం కదూ. ఇటువంటి ధోరణిని బహిరంగంగా, నిర్మొహమాటంగా ఎండగట్టింది, అనేక వేదికల మీద ఎండగడుతున్నది చైనా.

1991లో సోవియట్ విచ్ఛిన్నం తరువాత ప్రపంచంలో మరే ప్రాంతీయ శక్తీ తన ఆధిపత్యాన్ని సవాలు చేసే దశకు ఎదగకుండా చేయాలన్న వ్యూహాన్ని అమెరికా అనుసరిస్తోంది. అయితే ప్రపంచ ఆర్థికశక్తిగా ఎదుగుతూ వచ్చిన చైనా 2010లో జపాన్‌ను అధిగమించి అమెరికా తరువాత రెండో అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. తన ఆర్థిక వనరులను వర్థమాన దేశాల అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నందున ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా ఖండాల్లో దాని పలుకుబడి బాగా పెరిగింది. కరోనా మహమ్మారిని ఉపయోగించుకుని అమెరికా, ఇతర సామ్రాజ్యవాద కార్పొరేట్ మీడియా చైనా వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసినప్పటికీ చైనా తన దేశంలో కరోనాను సమర్థవంతంగా కట్టడి చేయడమే కాకుండా ప్రపంచ దేశాల్లో కరోనా కాలంలో కూడా ఆర్థికాభివృద్ధి సాధించిన ఏకైక పెద్ద దేశంగా ఆవిర్భవించింది. ఒబామా ప్రభుత్వం నుండి క్రమంగా అన్ని ప్రభుత్వాలూ చైనా వ్యతిరేక చర్యలను తీవ్రం చేయడంతో చైనా కూడా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. సైనిక, సాంకేతిక శక్తి సామర్థ్యాలను పెంచుకున్నది. ప్రాంతీయ శక్తులైన రష్యా, ఇరాన్ వంటి దేశాలతో వ్యూహాత్మక సంబంధాలు పెంచుకుని ఆధిపత్యవాదాన్ని అడ్డుకోడానికి ప్రయత్నిస్తోంది.

ఇదే సమయంలో పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం, తగ్గిపోతున్న అంతర్జాతీయ పలుకుబడి, అంతర్గతంగా పెరుగుతున్న సమస్యలతో సతమతమవుతున్న అమెరికా వాటి నుండి ప్రజాభిప్రాయాన్ని పక్కకు మళ్లించేందుకు చైనా వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ట్రంప్ హయాంలో ఐరోపా దేశాలతో ఏర్పడిన ఎడబాట్లను తగ్గించుకుని చైనా, రష్యా వ్యతిరేక కూటమిలోకి ఐరోపా మిత్రదేశాలను చేర్చుకోడానికి ప్రయత్నాలు పెంచింది. అలాగే ఆసియాలో చైనాను సైనికంగా చుట్టుముట్టేందుకు భారత్‌తో సహా దక్షిణ కొరియా, జపాన్, ఆస్ట్రేలియాలను ఒకటి చేసే ప్రయత్నాలను కూడా ముమ్మరం చేసింది. బైడెన్ అధికారంలోకి వచ్చిన వెంటనే వరసగా జరిగిన అంతర్జాతీయ సమావేశాల లక్ష్యం ఇదే. ట్రంప్ ప్రభుత్వ ‘అమెరికా ఫస్ట్’ విధానం గురించీ, ఐరోపా పట్ల ట్రంప్ వ్యవహరించిన వైఖరి గురించీ బైడెన్ పరోక్షంగా ప్రస్తావిస్తూ “గత కొద్ది సంవత్సరాలుగా మన సంబంధాలు కొంత మేరకు దెబ్బతిన్న విషయం నాకు తెలుసు. అయితే నమ్మకమైన అమెరికా నాయకత్వంలోకి తిరిగి మిత్రులను తీసుకురావడానికి కృత నిశ్చయంతో ఉన్నాం” అని అన్నారు.

### ఐరోపాలో భిన్నాభిప్రాయాలు

అయితే బైడెన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా నాటోలోని ఐరోపా మిత్రులు అమెరికా ఆధిపత్యం కిందకు వెళ్లేందుకు పూర్తిగా సిద్ధంగా లేరన్న విషయం నేటి అంతర్జాతీయ వాస్తవ పరిస్థితులను గమనిస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా ఐరోపాలో అతి శక్తివంతమైన జర్మనీ, ఫ్రాన్స్‌లు అమెరికా ఎలా చెబితే అలా ఆడేందుకు ఏ మాత్రం ఇష్టపడటం లేదు. ప్రపంచంలో ఏకచ్ఛత్రాధిపత్యానికి కాలం చెల్లిందనీ, “బహుళపక్ష” ప్రపంచం ఏర్పడిందని జర్మన్ ఛాన్సలర్ మెర్కెల్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌లు పదేపదే చెబుతున్నారు. ఈ రోజున అమెరికా, ఐరోపా మధ్య జరిగే వాణిజ్యం కన్నా చైనా ఐరోపాల మధ్య వాణిజ్యం మించి పోవడాన్ని గమనిస్తే ఐరోపా ఇంకెంత మాత్రం అమెరికాపై ఆధారపడే పరిస్థితి లేదని తెలుస్తున్నది. పైగా ఇటీవలనే అమెరికా అభ్యంతరాలను లెక్క చేయకుండా ఐరోపా యూనియన్ చైనాతో ఒక పెద్ద వాణిజ్య ఒప్పందం చేసుకుంది.

రష్యాతో జర్మనీ చేసుకున్న నార్డ్ స్ట్రీమ్-2 గ్యాస్ పైప్‌లైన్ ఒప్పందాన్ని కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఐరోపాకు 50 ఏళ్లపాటు గ్యాస్ సరఫరా చేసే ఈ పైప్‌లైన్ నిర్మాణంలో పాల్గొన్న ఐరోపా కంపెనీలపై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. “ఈ పైప్‌లైన్ చివరికి ఐరోపా భద్రతకే నష్టం కలిగిస్తుంది” అని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ బ్రస్సెల్స్‌లో జరిగిన నాటో దేశాల సమావేశంలో హెచ్చరించారు. “పైప్‌లైన్ నిర్మాణం మంచి ఆలోచన కాదు, ఐరోపాకు మంచిది కాదు, అమెరికాకూ మంచిది కాదు అన్న విషయంలో అధ్యక్షుడు బైడెన్ చాలా స్పష్టంగా ఉన్నారు”అని బ్లింకెన్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రష్యా నుండి బాల్టిక్ సముద్రం గుండా వేస్తున్న పైప్‌లైన్ ద్వారా 5,500 కోట్ల క్యూబిక్ మీటర్ల సహజవాయువు ఐరోపా దేశాలకు అందుతుంది. ఇది పూర్తయితే ఐరోపా దేశాలు రష్యాపై అధికంగా ఆధారపడి, తమ చేయి విడిచేస్తాయన్న భయం అమెరికా పాలకులకు పట్టుకుంది. ఇప్పటికే అమెరికా ఆర్థిక ఆంక్షలకు భయపడి 18 ఐరోపా కంపెనీలు ప్రాజెక్టు నుండి తప్పుకున్నాయి. అయితే జర్మనీ మాత్రం ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రాజెక్టును పూర్తి చేయాలనే పట్టుదలతో ఉంది.

ఐరోపా యూనియన్‌లోని మూడు ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్‌లో ఒక్క బ్రిటన్ మాత్రమే అమెరికాతో కలిసి వెళ్లడానికి సిద్ధంగా ఉంది. జర్మనీ, ఫ్రాన్స్‌లు సైనికంగా కూడా అమెరికాతో తెగతెంపులు చేసుకుని స్వంత దారి చూసుకోవాలన్న ఆలోచన చేస్తున్నాయి. అమెరికా కన్నా “మనకు ఐరోపా ఇరుగు పొరుగు దేశాలు చాలా ముఖ్యం. ముఖ్యంగా ఆఫ్రికా, సిరియా విషయాలను మనం పట్టించుకోవాలి. ఆఫ్రికాతో జర్మనీ సంబంధాలు చాలా వ్యూహాత్మక ప్రాముఖ్యత

కలిగి ఉన్నాయి" అని మెర్కెల్ పేర్కొన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మరో అడుగు ముందుకు వేసి మనకు "కొత్త భద్రతా వ్యవస్థ" కావాలి, దానికోసం "రష్యాతో చర్చలు" జరపడం అవసరం అని సూటిగా చెప్పారు. ఐరోపా యూనియన్ వ్యూహాత్మకంగా స్వయం ప్రతిపత్తి సాధించాలని పేర్కొన్నారు. చైనాతో నిత్యం కయ్యానికి కాలుదువ్వుతున్న అమెరికా ఒక ప్రపంచశక్తి మాదిరిగా కాకుండా పసిఫిక్ మహాసముద్ర ప్రాంత శక్తిగా ప్రవర్తిస్తోందని మాక్రాన్ పేర్కొన్నారు.

మొత్తం మీద చూసినప్పుడు ట్రంప్ విధానాలతో విడగొట్టుకుని ఐరోపాను మరింత అక్కున చేర్చుకుంటానని బైడెన్ ఎంతగా ప్రయత్నాలు చేస్తున్నా ఫలించే అవకాశాలు కనిపించడం లేదు. అమెరికా ఏకఛత్రాధిపత్యం వహిస్తున్నప్పుడు ఏర్పడిన నాటో చట్రంలో ఇమడడానికి ఇతర దేశాలు అంగీకరించే పరిస్థితి నేడు కనిపించడం లేదు. నాటో ఏర్పడినప్పటి నుండి ప్రపంచం చాలా దూరం వచ్చేసింది.

### చైనా, రష్యా, ఇరాన్ మైత్రి

ఒకవైపు నాటో శిఖరాగ్ర సభకు సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే హిందూ మహా సముద్రంలో చమురు సమృద్ధ పర్షియన్ గల్ఫ్‌కు దగ్గరలో రష్యా–ఇరాన్ యుద్ధనౌకలు సంయుక్త విన్యాసాలు ప్రారంభించాయి. త్వరలోనే ఈ విన్యాసాల్లో చైనా యుద్ధనౌకలు వచ్చి చేరు తున్నాయి. అమెరికా నాయకత్వంలో అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా దేశాలు మలబార్ విన్యాసాలు నిర్వహించిన కొద్ది మాసాల్లోనే ఈ మూడు దేశాలు వ్యూహాత్మకంగా నిర్వహించిన ఈ విన్యాసాలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌పై అమెరికా కవ్వింపు ధోరణులకూ, ఆంక్షలకూ వ్యతిరేకంగా, ఈ ప్రాంతంలో అమెరికా ఆధిపత్యాన్ని ఎదుర్కొనేందుకు ఇరాన్–రష్యా – చైనాలు సంయుక్తంగా 2019లో "సముద్ర ప్రాంత భద్రతా బెల్ట్" ఏర్పాటు చేశాయి. ఇది జరిగిన కొద్ది రోజులకే 2020 జనవరి 3న అమెరికా డ్రోన్ దాడి చేసి ఇరాన్‌కు చెందిన ఉన్నత స్థాయి సైనిక జనరల్ ఖ్వాసిమ్ సొలేమానిని బాగ్దాద్ విమానాశ్రయంలో హత్య చేసింది. అలాగే భారత జలాల్లో మలబార్ విన్యాసాలు ముగిసిన వెంటనే ఇరాన్‌కు చెందిన ఉన్నత స్థాయి అణు శాస్త్రవేత్త మొహ్సేన్ ఫక్రిజాదేను కూడా అమెరికా, ఇజ్రాయిల్ గూఢచారి వర్గాలు హత్య గావించాయి. ఈ నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్, ఇతర

" ఒకవైపు నాటో శిఖరాగ్ర సభకు సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే హిందూ మహా సముద్రంలో చమురు సమృద్ధ పర్షియన్ గల్ఫ్‌కు దగ్గరలో రష్యా-ఇరాన్ యుద్ధనౌకలు సంయుక్త విన్యాసాలు ప్రారంభించాయి. త్వరలోనే ఈ విన్యాసాల్లో చైనా యుద్ధనౌకలు వచ్చి చేరు తున్నాయి. అమెరికా నాయకత్వంలో అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియా దేశాలు మలబార్ విన్యాసాలు నిర్వహించిన కొద్ది మాసాల్లోనే ఈ మూడు దేశాలు వ్యూహాత్మకంగా నిర్వహించిన ఈ విన్యాసాలకు ప్రాధాన్యత ఏర్పడింది. "



చైనాలోని గులిన్ నగరంలో రష్యా–చైనా విదేశాంగ మంత్రులు సెర్గి లావ్‌రోవ్, వాంగ్‌ఇల సమావేశం

దేశాల భద్రత కోసం, ఈ ప్రాంతంలో అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడమే రష్యా–చైనా–ఇరాన్ ఉమ్మడి విన్యాసాల లక్ష్యం అని ఇరాన్ నేవీ చీఫ్ రియర్ అడ్మిరల్ హొస్సేన్ ఖంజాది పేర్కొన్నారు. "ఇప్పటివరకు ఈ ప్రాంతంలో ఆధిపత్యం వహించిన ప్రపంచ అగ్ర దేశం ఇకపై ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టే సమయం వచ్చిందని గ్రహించాలి" అని ఆయన స్పష్టం చేశారు.

ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగిన చైనా, నేటికీ ప్రధాన సైనిక శక్తిగా ఉన్న రష్యా, మధ్య ప్రాచ్యంలో ప్రభావం కలిగిన ఇరాన్‌ల మధ్య ఏర్పడిన ఈ బంధం అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికీ ఈ ప్రాంతంలో అతి పెద్ద నౌకా బలంతో అమెరికా తిరుగులేని సైనిక శక్తిగా ఉన్నది. అయితే ఒకవైపు దేశీయంగా కరోనా బారిన పడి అమెరికా ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో దాని మధ్య ప్రాచ్య విధానం కూడా ఎదురు దెబ్బలు తింటోంది. సిరియాలో అల్–ఖైదా ఉగ్రవాదులకు మద్దతివ్వడం ద్వారా అంతర్యుద్ధాన్ని రగిలించిన అమెరికా అక్కడ బషర్ ప్రభుత్వాన్ని కూల్చడంలో విఫలమైంది. రష్యా, చైనా, ఇరాన్‌ల మద్దతులో బషర్ ప్రభుత్వం సిరియాపై పట్టు కొనసాగిస్తుండగా శిధిలమైన సిరియాలో ఒక చిన్న భూభాగానికి అమెరికా ప్రభావం పరిమితమైపోయింది. ఇప్పుడు ఈ ప్రాంతంలో నాటో ప్రాబల్యం కన్నా రష్యా ప్రభావం పెరుగుతోంది.

ఇదే సమయంలో చైనా తన "బెల్ట్ అండ్ రోడ్" ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెంచింది. మరోవైపు చైనా – పాకిస్తాన్ ఆర్థిక కారిడార్ (చెపెక్)తో పాకిస్తాన్ లోని చబహార్ రేవు ద్వారా మధ్య ప్రాచ్యంలో తన ప్రభావాన్ని పెంచుకుంటున్నది. ఇదే సమయంలో ఇరాన్‌తో చైనా 25 ఏళ్ల అతి పెద్ద ఆర్థిక ఒప్పందాన్ని కుదుర్చుకోవడం అమెరికాను మరింత కలవర పెడుతోంది. దీనిపై న్యూయార్క్‌టైమ్స్ పత్రిక రాస్తూ "ఒకవైపు ఆర్థిక మాంద్యంతోనూ, కరోనా మహమ్మారి తోనూ కొట్టుమిట్టాడుతూ అంతర్జాతీయంగా ఏకాకి అయిపోతున్న అమెరికా బలహీనతను చైనా గ్రహించింది. ఇరాన్‌తో చైనా కుదుర్చుకున్న ఒప్పందాన్ని పరిశీలిస్తే ఇతర దేశాల మాదిరిగా

**"రష్యా విదేశాంగ మంత్రితో భేటీ జరిగిన వెంటనే చైనా ప్రభుత్వాధికారులు ఉత్తర కొరియా అధికారులతో కూడా అలాస్కా సమావేశ వివరాలపై చర్చించారు. కొరియా ద్వీపకల్పంలో అమెరికా యుద్ధోన్మాద చర్యలు ఈ ప్రాంతంలోని అనేక దేశాలపై ప్రభావం చూపిస్తాయి. అందు వల్ల కొరియా ద్వీపకల్పంలో అమెరికాకు మిత్రులుగా ఉన్న దక్షిణ కొరియా, జపాన్‌లకు ఉత్తరకొరియా - చైనా స్నేహం చెక్ పెడుతుందని భావిస్తున్నారు."**

కాకుండా వాణిజ్య యుద్ధంలో అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలనూ ఖాతరు చేసేందుకు చైనా సిద్ధంగా లేదని తేలుతోంది" అని పేర్కొంది. ఇరాన్ పరిశ్రమల్లోనూ, ప్రాథమిక సదుపాయాల్లోనూ చైనా పెట్టుబోయే 40,000 కోట్ల డాలర్ల (సుమారు 30 లక్షల కోట్ల రూపాయల) పెట్టుబడుల ఆధారంగా ఒక "విస్తృత ఆర్థిక, భద్రతా భాగస్వామ్యం" ఏర్పడు తోంది అని పత్రిక పేర్కొంది. అలాగే సిరియా యుద్ధానంతర పునర్నిర్మాణానికి చైనా 20,000 కోట్ల నుండి ఒక లక్ష కోట్ల డాలర్ల వరకు (సుమారు 75 లక్షల కోట్ల రూపాయల వరకు) పెట్టుబడులు పెట్టవచ్చునని పత్రిక పేర్కొంది.

ఈ మొత్తం పరిణామాలు మధ్య ప్రాచ్యంలో అమెరికా ఆధిపత్యాన్ని చైనా-రష్యాలు ఎలా సవాలు చేస్తున్నవో తెలియజేస్తున్నాయి. అందు వల్లనే చైనా-రష్యాలకు వ్యతిరేకంగా నేడు అమెరికా మరో ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభిం చింది. అయితే అమెరికా ఆధిపత్యాన్ని, చీటికీ మాటికీ ప్రపంచ దేశాలపై ఆర్థిక ఆంక్షల పేరుతో వేధింపులకు దిగడాన్ని అన్ని విధాలా ఎదుర్కోడానికి రష్యా-చైనాలు వ్యూహాత్మకంగా సిద్ధమవుతున్నాయి.

అలాస్కాలో అమెరికా, చైనా విదేశాంగ మంత్రుల సమావేశం జరిగిన రెండు రోజులకే రష్యా, చైనా విదేశాంగ మంత్రులు సెర్గీ లావ్‌రోవ్, వాంగ్ యీలు చైనాకు చెందిన గువాంగ్జీలోని టూరిస్టు ప్రదేశమైన గిలిన్‌లో సమావేశమై అమెరికా ఆధిపత్యానికి ఎలా అడ్డుకట్ట వేయాలన్న విషయమై లోతుగా చర్చించారు. "అంతర్జాతీయ సంబంధాలను ప్రజాస్వామ్యీకరించడానికి అన్ని దేశాలూ ఐక్యరాజ్య సమితి నియమాలను అనుసరించాలి. అమెరికా తన పెత్తందారీ చర్యలను విడనాడాలి, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఆపాలి. ఇతర దేశాలతో ఘర్షణ కోసం కొద్ది దేశాలతో కూటములు కట్టడం మానుకోవాలి" అని రెండు దేశాల విదేశాంగ మంత్రుల స్పష్టంగా హెచ్చరించారు. "నియమా ల ననుసరించిన అంతర్జాతీయ సూత్రాలను" చైనా పాటించాలని అమెరికా విదేశాంగ మంత్రి అలాస్కాలో చెప్పిన దానికి చైనా విదేశాంగ మంత్రి అప్పుడే సమాధానమిస్తూ "మేము అమెరికా నియమాలు పాటించం, ఐక్యరాజ్య సమితి నియమాలు పాటిస్తాం" అని మొహ మాటం లేకుండా చెప్పారు. అదే విషయాన్ని ఇప్పుడు రష్యా, చైనా విదేశాంగ మంత్రులు కూడా సంయుక్తంగా పునరుద్ఘాటించారు. రష్యా విదేశాంగ మంత్రితో భేటీ జరిగిన వెంటనే చైనా ప్రభుత్వాధికారులు ఉత్తర కొరియా అధికారులతో కూడా అలాస్కా సమావేశ వివరాలపై చర్చించారు. కొరియా ద్వీపకల్పంలో అమెరికా యుద్ధోన్మాద చర్యలు ఈ ప్రాంతంలోని అనేక దేశాలపై ప్రభావం చూపిస్తాయి. అందు వల్ల కొరియా ద్వీపకల్పంలో అమెరికాకు మిత్రులుగా ఉన్న దక్షిణ కొరియా, జపాన్‌లకు ఉత్తరకొరియా - చైనా స్నేహం చెక్ పెడుతుం దని భావిస్తున్నారు.

ఆర్థిక ఆంక్షలతో అనేక దేశాలపై వేధిం పులకు పాల్పడడానికి కారణమవుతున్న అమెరికా డాలరు ఆధిపత్యాన్ని కూడా సవాలు చేయాలని రష్యా-చైనాలు నిర్ణయించాయి. చైనా విదేశాంగ మంత్రితో సమావేశానికి ముందు రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్ చైనా మీడియాతో మాట్లాడుతూ "అమెరికా మీద ఆధారపడకుండా సైన్సు, టెక్నాలజీ పరిశ్రమలు స్వయం సమృద్ధి సాధించాలని, స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు జరుపుతూ అమెరికా డాలరు మీద ఆధారపడ్డాన్ని తగ్గించుకోవాలని, క్రమంగా పశ్చిమ దేశాల నియంత్రణలోని కరెన్సీ చెల్లింపుల వ్యవస్థ "స్విఫ్ట్" నుండి బయట పడాలని పిలుపునిచ్చారు. రష్యా-చైనాలు రెండూ అమెరికా ఆర్థిక ఆంక్షలు ఎదుర్కొం టున్నాయి గనుక రెండు దేశాలూ స్థానిక కరెన్సీల్లో చెల్లింపులు జరపడానికి నిర్ణయించు కున్నాయి. ఇరాన్ నుండి చమురు దిగుమతులకు, ఇరాన్‌కు ఎగుమతులకు కూడా స్థానిక కరెన్సీల్లోనే చెల్లింపులు జరుతున్నాయి. ఫలితంగా అంతర్జాతీయ యవనిక మీద డాలరు ప్రభా వాన్ని తగ్గించడానికీ, తద్వారా అమెరికా ఆర్థిక ఆంక్షలు, వేధింపుల నుండి బయట పడడానికీ రష్యా, చైనాలు ప్రపంచానికి మార్గం చూపెడు తున్నాయి.

**అమెరికా వ్యూహంలో పావుగా భారత్**

నేటి అంతర్జాతీయ యవనిక మీద ఆవిష్కృతమవుతున్న రాజకీయాల్లో ఒకవైపు తన ఏకఛత్రాధిపత్యం నుండి జారిపోతున్న ప్రపంచాన్ని ఆర్థిక ఆంక్షలతో, సైనిక వ్యూహాలతో కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్న అమెరికా, మరో వైపు అమెరికా ఆధిపత్యాన్ని అడ్డుకోడానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న చైనా-రష్యా, ఇతర వర్ధమాన దేశాలు ఆవిష్కృతమవు తున్నాయి. దురదృష్టవశాత్తు ఈ ఘర్షణలో భారత దేశాన్ని మన పాలక వర్గాలు అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహంలో పావుగా మారుస్తు న్నాయి. చైనాతో ఇటీవలి ఘర్షణలు సాకుగా చూపించి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా యుద్ధవ్యూహంలో చేరడాన్ని సమర్ధించుకుంటోంది. కానీ వాస్తవమేమంటే చైనాతో సరిహద్దు ఘర్షణలు ఏర్పడటానికి దశాబ్దం ముందు నుండే మన పాలకులు దేశాన్ని వ్యూహాత్మకంగా అమెరికాతో జత చేయడానికి ఒప్పుకున్నారు. అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో క్వాడ్ కూటమి ఏర్పాటు, అమెరికాతో కలిసి మలబార్ యుద్ధ విన్యాసాలు ఆనాటి నుండే సాగుతున్నాయి. ఇప్పుడు చైనాతో సరిహద్దు సమస్యలను ఉపయోగించుకుని మోడీ ప్రభుత్వం మన దేశాన్ని మరింతగా అమెరికా పంచన చేరుస్తోంది. దీని వల్ల ఇరుగుపొరుగు దేశాలతో మన సంబంధాలు చెడిపోవడమే కాదు, ఇరాన్ వంటి సంప్రదాయ మిత్ర దేశాలనూ కోల్పోవలసి వచ్చింది. రష్యాతో సంబంధాలు దెబ్బతింటున్నాయి. చమురు, భద్రత, ఇతర అవసరాలకు అమెరికాపై రానురాను మరింత ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. ఇది మన దేశానికీ, దేశ ప్రజలకూ నష్టదాయకం. అంతర్జాతీయంగా మితవాద, అభివృద్ధి నిరోధక, సామ్రాజ్యవాద శక్తి అయిన అమెరికా కూటమిలో చేరడం వల్ల మన దేశ పురోభివృద్ధికి నష్టం వాటిల్లడమే కాదు విపత్కరమైన యుద్ధ ప్రమాదాన్ని కూడా ఎదుర్కొ నాల్సి వస్తోంది. ❊

# దేశాభివృద్ధి కోసమే ప్రభుత్వరంగం

ఎ. కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

ప్రభుత్వరంగ సంస్థలపై ప్రభుత్వం దాడిని తీవ్రం చేసింది. 1950 నుండి ప్రణాళికా బద్ధంగా నిర్మించుకుంటూ వచ్చిన దేశ పారిశ్రామిక పునాదిని విచ్ఛిన్నం చేయటానికి పూనుకున్నది. ప్రభుత్వం వ్యాపారం చేయటానికి లేదని, ప్రభుత్వరంగంలోని అన్ని సంస్థలనూ పూర్తిగా ప్రైవేటువారికి అప్పగిస్తామని ప్రధాని ప్రకటించాడు. ప్రభుత్వరంగ సంస్థలు అసమర్థంగా ఉన్నాయని, అవి నష్టాలలో కూరుకుపోతుంటే వాటిని నడపటం కోసం ప్రజల నుండి పన్నుల ద్వారా వసూలు చేసిన డబ్బును ఖర్చు చేయబోమని ఆర్థికమంత్రి ప్రకటించింది. ప్రభుత్వరంగంలోని లక్షల కోట్ల రూపాయల విలువైన పరిశ్రమలను, లక్షల కోట్ల రూపాయల ప్రజల సంపద ఉన్న బ్యాంకులు, బీమా తదితర ద్రవ్య సంస్థలను కార్పొరేట్లు, ఎంఎన్‌సిలకు అప్పగించటానికి అవసరమైన పథకాన్ని రూపొందించారు. ఈ చర్యలపై కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మధ్యతరగతి ప్రజలు తదితరుల వ్యతిరేకతను అణచివేయటం కోసం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. మరోవైపు ప్రజలను మభ్యపెట్టటం కోసం పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. మత, కుల, ప్రాంతీయ విభజనలను ముందుకుతెస్తున్నారు.

1947లో స్వాతంత్ర్యం సాధించే నాటికి భారతదేశం వ్యవసాయక దేశంగా ఉంది. పారిశ్రామిక పునాది చాలా బలహీనంగా ఉంది. బ్రిటిష్‌వారు దేశం వదిలివెళ్ళే నాటికి భారత ఉపఖండంపై పెత్తనం చలాయించటం కోసం వారు ఏర్పాటు చేసిన 18 మందుగుండు తయారుచేసే ఫ్యాక్టరీలు మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. ప్రైవేటురంగంలో కొన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. భారీ పరిశ్రమలు దాదాపుగా లేవు. దేశ ఆర్థిక వ్యవస్థను త్వరితంగా అభివృద్ధి చేయటం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటం, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవటానికి పారిశ్రామికీకరణ సాధించటం అవసరమనే అంశాలపై ఏకీభావం వ్యక్తమైంది. పారిశ్రామికీకరణ చేయటంలో ప్రభుత్వ జోక్యం, క్రమబద్ధీకరించటం అవసరమన్న బాంబేప్లాన్ ఆధారంగా 1948లో పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రణాళికను రూపొందించారు. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సాధించాల్సిన పారిశ్రామికాభివృద్ధిని పేర్కొంటూ 1944లో బాంబేప్లాన్‌ను రూపొందించారు. దేశంలో ఆనాటి అగ్రస్థాయి పారిశ్రామికవేత్తలైన ఆర్ డి టాటా, ఘనశ్యామ్ దాస్ బిర్లా, అర్దేశిర్ దలాల్, అర్దేశిర్ దబర్‌షా ష్రాఫ్, లాలా శ్రీరామ్, కస్తూరి భాయ్ లాల్‌భాయ్, సర్ పురుషోత్తమ్‌దాస్ ఠాకూర్‌దాస్, జాన్ మత్తయ్‌లు ఈ ప్లాన్‌పై సంతకం చేశారు. బాంబేప్లాన్‌గా పిలవటంతో పాటు దీనిని టాటా, బిర్లా ప్లాన్‌గా కూడా పిలిచారు. టాటా, బిర్లా ప్లాన్‌గానే అది ప్రసిద్ధి చెందింది. ప్రణాళికాబద్ధ అభివృద్ధి విధానాల పేరుతో స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం బాంబేప్లాన్‌లో పేర్కొన్న అంశాలనే అమలుజరిపింది.

15 సంవత్సరాల కాలంలో దేశ వ్యవసాయరంగ అభివృద్ధిని రెట్టింపు చేయాలని, పారిశ్రామికాభివృద్ధిని ఐదురెట్లు పెంచాలని ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించారు. ఇందుకోసం 10,000 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టాలని, అందులో 44.8 శాతం పారిశ్రామికాభివృద్ధికి కేటాయించాలని నిర్ణయించారు. ప్రభుత్వ జోక్యం, క్రమబద్ధీకరణ లేకుండా పారిశ్రామికాభివృద్ధి సాధ్యం కాదనేది బాంబే ప్రణాళికలో కీలకాంశం. అపుడే అభివృద్ధి అవుతున్న భారతీయ పరిశ్రమలు స్వేచ్ఛా మార్కెట్ పోటీకి తట్టుకోలేవని, కాబట్టి స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చే ప్రభుత్వం దేశీయ పారిశ్రామిక ఉత్పత్తులను విదేశీపోటీ నుండి కాపాడే విధానాలను అనుసరించాలని, ప్రభుత్వం లోటు ఆర్థిక విధానాలను అమలు చేయటం ద్వారా పెట్టుబడులను సమకూర్చాలని, సమానాభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించాలని, వ్యవసాయంపై ఆధారపడిన సమాజం నుండి పారిశ్రామికాభివృద్ధి ప్రధానంగా ఉండే సమాజంగా అభివృద్ధి చెందాలని, ప్రైవేటు రంగం తక్షణమే నిర్మించలేని పరిశ్రమలను ప్రభుత్వరంగంలో నిర్మించాలని, ప్రణాళికా బద్ధమైన విధానాల ద్వారా ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించాలని కోరారు. బాంబే ప్లాన్‌లో పేర్కొన్న ఈ అంశాలనే 1950 నుండి అమలు చేయటం ప్రారంభించిన మొదటి పంచవర్ష ప్రణాళికలో చేర్చారు. దిగుమతులకు ప్రత్యామ్నాయ పారిశ్రామిక విధానం పేరుతో ఈ విధానాలను అమలుచేస్తూ, దీనికి సమ్మిళిత – ప్రభుత్వ, ప్రైవేటు – ఆర్థిక విధానం అని పేరు పెట్టారు. మౌలిక, భారీ పరిశ్రమలను నిర్మించటం దేశ ఆధునీకరణలో ప్రధానమైనదని నెహ్రూ పేర్కొన్నాడు. దేశాన్ని పారిశ్రామికీకరణ చేయటంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను అభివృద్ధి చేయటం ప్రధానమైనదని 1956లో ప్రభుత్వం పారిశ్రామిక విధానంపై రూపొందించిన తీర్మానంలో పేర్కొన్నది.

ప్రభుత్వ రంగంలో పరిశ్రమలను నిర్మించటం అంటే సోషలిజమేనని, ప్రభుత్వం సోషలిస్టు విధానాలను అమలు చేయటానికి ప్రయత్నం చేస్తున్నదని ఆనాటి మితవాదులు విమర్శించారు. ఆ తర్వాత కూడా ప్రభుత్వ రంగంపై దాడికి దీనిని ఒక ముఖ్యమైన అంశంగా ఎంచుకున్నారు. ఈనాడు ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా రద్దుచేయాలని పెట్టుబడిదారులు కోరుతున్నారు. దేశీయ బడా పెట్టుబడిదారులందరూ ఇదే నినాదాన్ని ప్రధానంగా తీసుకున్నారు. వారి ఆధీనంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా ప్రభుత్వరంగానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ

**"1944లో ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలు నిర్మించాలని, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వజోక్యం ఉండాలని, క్రమబద్ధంగా అభివృద్ధి జరగటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, లోటు బడ్జెట్ విధానం ద్వారా నిధులు సమకూర్చాలని, తమ ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించాలని, విదేశీ పరిశ్రమల పోటీ నుండి తమ ఉత్పత్తులకు రక్షణ కల్పించాలని కోరిన బడా పెట్టుబడిదారులు 1990లలో సరళీరణ విధానాలకు ఎందుకు ఆమోదం తెలిపారు?"**



విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు యంత్రాలను ఉత్పత్తి చేస్తున్న బిహెచ్ఇఎల్

రంగంలోని పరిశ్రమలను స్వాధీనం చేసుకోవటానికి తహతహలాడుతున్నారు. సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలలో వాటాల అమ్మకం ద్వారా వాటిని పాక్షికంగా ప్రైవేటీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వాలు తీసుకున్నాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమల అమ్మకాన్ని వేగిరం చేసింది. నష్టాలు, లాభాలు వచ్చేవాటితో నిమిత్తం లేకుండా ప్రభుత్వరంగ పరిశ్రమలన్నింటినీ అమ్మివేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంవత్సరంలో 1.75 లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వరంగ సంస్థల వాటాలను అమ్ముతామని బడ్జెట్‌లో ప్రకటించారు.

1944లో ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలు నిర్మించాలని, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వజోక్యం ఉండాలని, క్రమబద్ధంగా అభివృద్ధి జరగటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, లోటు బడ్జెట్ విధానం ద్వారా నిధులు సమకూర్చాలని, తమ ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించాలని, విదేశీ పరిశ్రమల పోటీ నుండి తమ ఉత్పత్తులకు రక్షణ కల్పించాలని కోరిన బడా పెట్టుబడిదారులు 1990లలో సరళీరణ విధానాలకు ఎందుకు ఆమోదం తెలిపారు? ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు, విదేశాల నుండి దిగుమతి అవుతున్న సరుకులపై ఆంక్షలు, నిబంధనలు రద్దుచేయాలని ఎందుకు డిమాండ్ చేస్తున్నారు? ఇప్పటికొచ్చేసరికి ప్రభుత్వరంగం అనేదే లేకుండా చేయాలని ఎందుకు కోరుతున్నారు?

ఆనాడు ప్రభుత్వరంగంలో పరిశ్రమలు నిర్మించాలని రూపొందించిన బాంబేప్లాన్, ఈనాడు ప్రైవేటీకరణ కోసం బడాపెట్టుబడిదారులు చేస్తున్న డిమాండ్ వారి వర్గ ప్రయోజనాల కోసం మాత్రమే. బాంబే ప్రణాళిక గాని, ప్రైవేటీకరణ డిమాండు గాని ఆయా సమయాలలో బడా పెట్టుబడిదారుల వర్గ ప్రయోజనాలను వ్యక్తం చేస్తాయి.

1944లో బడా పెట్టుబడిదారులు బాంబేప్లాన్ రూపొందించేనాటికి భారీ పరిశ్రమలు నిర్మించటానికి అవసరమైన పెట్టుబడులు, భారీ యంత్రలను నిర్మించే పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానం వారి వద్దలేదు. అందువలన తాము పరిశ్రమలను నిర్మించుకోవటానికి అవసరమైన భారీ యంత్రాలను తయారు చేసే పరిశ్రమలను – ఉక్కు, యంత్ర నిర్మాణం, రసాయన, మందుల ఉత్పత్తి, వైమానిక, అంతరిక్ష, నౌకా నిర్మాణం, పరిశోధన రంగం తదితరాలు – ప్రభుత్వమే నిర్మించాలని వారు కోరారు. అపుడు ప్రభుత్వ రంగంలో తయారైన యంత్రాలను ఉపయోగించుకొని తమ పరిశ్రమలను అభివృద్ధి చేసుకోవచ్చునని వారు భావించారు. ఆ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నెహ్రూ ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలను నిర్మించటానికి ప్రణాళికను రూపొందించింది.

**పారిశ్రామికాభివృద్ధికి ఆటంకాలు**

పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన ప్రణాళిక రూపొందించారు కాని దానిని అమలు చేయటం సాధ్యం కాలేదు. వాటి నిర్మాణానికి అవసరమైన పెట్టుబడులు ప్రభుత్వం వద్దలేవు. సాంకేతిక పరిజ్ఞానం, భారీ యంత్రాలు అభివృద్ధి చెందిన దేశాల వద్ద ఉన్నాయి. దేశ పారిశ్రామిక అభివృద్ధికి సహకరించమని బ్రిటన్, అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాలను ప్రభుత్వం అర్థించింది. కానీ ఆ దేశాలు సహకారం అందించటానికి మారుగా పారిశ్రామికాభివృద్ధిని నిరోధించటానికి పూనుకున్నాయి. భారీ పరిశ్రమలకు అవసరమైన యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానానికి బదులుగా దేశానికి అవసరమైన పారిశ్రామిక ఉత్పత్తులను సరఫరా చేస్తామని ప్రతిపాదించాయి. అటు వంటి పరిస్థితులలో మన ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి సహకరించమని సోవియట్ యూనియన్‌ను కోరింది. సోవియట్ యూనియన్ అందుకు అంగీకరించి, అవసరమైన తోడ్పాటు నందించింది. భిలాయ్, బొకారో ఉక్కు కర్మాగారాలు, బిహెచ్ఇఎల్, ఐడిపిఎల్, అంతరిక్ష రంగం, అణుశక్తి రంగం, రక్షణ, తదితర రంగాలలో పరిశ్రమలను నిర్మించు కోవటానికి సహకారం అందించింది. ఇతర సోషలిస్టు దేశాలు కూడా తమ శక్తిమేరకు పారిశ్రామికాభివృద్ధికి సహకరించాయి. ఫలితంగా దేశంలో భారీ పరిశ్రమల నిర్మాణం ఊపందుకుంటున్నది. సోవియట్ యూనియన్ సాధిస్తున్న అభివృద్ధి, మనదేశంలో పరిశ్రమల నిర్మాణానికి సహకారం అందించటం, సామ్రాజ్యవాద దేశాలు సహకరించక పోవటంతో దేశప్రజలలో సోవియట్ యూనియన్, సోషలిజం పట్ల సానుకూలత, సామ్రాజ్యవాద దేశాల పట్ల వ్యతిరేకత పెరుగుతున్నది. ఇటువంటి పరిస్థితులలో తాము సహాయం అందించకపోతే భారతప్రజల వ్యతిరేకత తమ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందని గుర్తించిన సామ్రాజ్యవాదులు తప్పనిసరి పరిస్థితులలో తాము కూడా

కొన్ని పరిశ్రమల నిర్మాణానికి సహకారం అందించటానికి ముందుకొచ్చారు.

ప్రభుత్వరంగ పరిశ్రమలను ఆధారం చేసుకొని దేశంలోని ప్రైవేటురంగ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ప్రైవేటు పరిశ్రమలు అభివృద్ధి కావటానికి ఏ విధానాలనైతే అనుసరించాలని బడా పెట్టుబడిదారులు కోరారో అవే విధానాలను ప్రభుత్వం అనుసరించింది. వారికి ఆర్థిక వనరులు, మార్కెట్ సదుపాయం, పెట్టుబడులు సమకూర్చింది. ప్రభుత్వ రంగంలో పరిశ్రమల ఉత్పత్తులు, వాటి కార్యకలాపాలు దేశాభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రైవేటు రంగం బలపడటానికి ఉపయోగపడ్డాయి. ప్రభుత్వరంగ సంస్థలకు నష్టాలు వస్తున్నాయని చెబుతున్నది బూటకం మాత్రమే. వాస్తవం ఏమిటంటే ప్రైవేటురంగం లాభాలు పొందటం కోసం ప్రభుత్వరంగ సంస్థలను నష్టాలలో ముంచారు. ప్రభుత్వ రంగ సంస్థల ఉత్పత్తుల ధరల నిర్ణయం, ప్రైవేటు సంస్థలతో జరిపే లావాదేవీలలో వాటి నష్టాలు ప్రైవేటు సంస్థలకు లాభాలుగా పరిణమించే విధానాలను రూపొందించారు. ప్రైవేటు రంగంలోని పరిశ్రమలు కూడా బలపడటం, పెట్టుబడిదారులు విపరీతమైన లాభాలను సంపాదించుకొని, తమ ఆర్థికశక్తిని పెంచు కోవటంతో బడా పెట్టుబడిదారులు క్రమంగా ప్రభుత్వ రంగాన్ని బలపరిచే వైఖరిని వదలివేసి, దానిపై దాడి చేయటం ప్రారంభించారు. ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు దండగ అని, ప్రభుత్వ రంగ సంస్థలలోని ఉద్యోగులు పని చేయరని, ఈ సంస్థలు నష్టాలలో ఉన్నాయని, ప్రజల సొమ్ముతో వాటిని నడపాల్సి వస్తున్నదని, ఇవి తెల్ల ఏనుగులుగా మారి ప్రభుత్వానికి భారమేనాయని ప్రచారం ప్రారంభించారు. ఇందిరా గాంధి కాలం నుండే మంత్రులు, ప్రధాని పెట్టుబడిదారులతో కలిసి ప్రభుత్వరంగ సంస్థలపై దాడులు చేయటం కొనసాగించారు.

**కుంచించుకుపోతున్న దేశీయ మార్కెట్**

దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో ఆ వ్యవస్థకు సహజమైన సంక్షోభాలు తలెత్తాయి. 1967లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. తర్వాత కూడా సంక్షోభాలు వచ్చినా, 1990లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభంతో పాటు విదేశీ మారకద్రవ్యంలోటు సమస్య తలెత్తింది. దేశంలోని బడా పెట్టుబడిదారులు చేస్తున్న ఉత్పత్తులను అమ్ముకోవటానికి మార్కెట్ సమస్య ఎదురైంది. దేశంలో అమలు జరుగుతున్న ఆర్థిక విధానాలు ఒకవైపు సంపద, మరోవైపున పేదరికం పోగుపడేలా చేసి, ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపచేశాయి. ఫలితంగా దేశంలో ఉత్పత్తి అవుతున్న సరుకులకు డిమాండ్ పడిపోయింది. ఎగుమతులు చేయటం ద్వారా మార్కెట్ సంపాదించుకుందామంటే వివిధ దేశాలు తమ మార్కెట్లలోకి ఇతర దేశాల సరుకులు ప్రవేశించకుండా ఆంక్షలు విధించాయి. అటువంటి పరిస్థితులలో నయా ఉదారవాద విధానాలను అమలుచేయాలని సామ్రాజ్య వాదుల నుండి ఒత్తిడి తీవ్రమైంది. సామ్రాజ్యవాదుల ఉత్పత్తులు మన మార్కెట్‌లోకి ప్రవేశించటానికి అవకాశం కల్పిస్తే, మనదేశంలో ఉత్పత్తి అవుతున్న సరుకులను అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకోవటానికి అవకాశాలు కల్పిస్తామని ఆశలు కల్పించారు. దేశీయ మార్కెట్‌ను విస్తరింపచేయటం, దేశంలోపల తమ సరుకులను అమ్ముకోవటం సాధ్యం కాని పరిస్థితులలో సామ్రాజ్యవాదుల డిమాండ్‌కు అనుగుణంగా సరళీకరణ విధానాలను అమలు చేయటమే తమకు కూడా ప్రయోజనం కలిగిస్తుందని పాలకవర్గాలు భావించాయి. బాంబేప్లాన్‌లో బడా పెట్టుబడిదారులు విదేశీ పరిశ్రమలలో ఉత్పత్తి అయిన సరుకుల పోటీనుండి తమ పరిశ్రమలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 1990లలో విదేశీ సరుకులు దేశంలోకి దిగుమతులు చేసుకోవటానికి, తమ సరుకులు విదేశాలలోకి ఎగుమతులు అవటానికి అవసరమైన విధానాలను అనుసరించాలని కోరారు. ఇపుడు ప్రభుత్వ రంగం మొత్తాన్ని ప్రైవేటీకరించమని కోరుతున్నారు. అపుడు విదేశీ సరుకుల రాకను నిషేధించమని కోరినా, 90లలో ఎగుమతి, దిగుమతులకు అవకాశం ఇవ్వమని కోరినా, ఇపుడు ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించమని డిమాండ్ చేస్తున్నా అవి బడా పెట్టుబడిదారులు తమ వర్గ ప్రయోజనాలను నెరవేర్చుకోటం కోసం చేస్తున్న డిమాండ్లు మాత్రమే. ప్రైవేటు రంగం బాగా విస్తరించటం, పెట్టుబడిదారుల వద్ద భారీగా సంపద పోగుపడటం వారు ఇటువంటి విధానాలను అమలు చేయమని డిమాండ్ చేయటానికి దారితీశాయి. ఫలితంగా 1991 నుండి దేశంలో సరళీకరణ విధానాల అమలు ప్రారంభమైంది.

> **"బాంబేప్లాన్‌లో బడా పెట్టుబడిదారులు విదేశీ పరిశ్రమలలో ఉత్పత్తి అయిన సరుకుల పోటీనుండి తమ పరిశ్రమలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. 1990లలో విదేశీ సరుకులు దేశంలోకి దిగుమతులు చేసుకోవటానికి, తమ సరుకులు విదేశాలలోకి ఎగుమతులు అవటానికి అవసరమైన విధానాలను అనుసరించాలని కోరారు. ఇపుడు ప్రభుత్వరంగం మొత్తాన్ని ప్రైవేటీకరించమని కోరుతున్నారు."**

**ఎల్‌పిజి విధానాల అమలుతో ప్రభుత్వరంగానికి సమాధి**

1991 నుండి నయా ఉదారవాద విధానాలలో భాగమైన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలను అమలు చేయటం వేగం పుంజుకుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలను దెబ్బతీసేందుకూ, ఆ దేశాల ఆర్థికవ్యవస్థలను తన గుప్పెట్లోకి తెచ్చుకొనేందుకూ నయా ఉదారవాద విధానాల ద్వారా సామ్రాజ్యవాదులు ఆయా దేశాలపై అనేక రకాలైన ఆంక్షలు విధిస్తున్నారు. ఎఫ్ఆర్‌బిఎం చట్టాన్ని చేయించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టే ఖర్చుపై నియంత్రణ విధిస్తున్నాయి. బడ్జెట్ లోటును 3 శాతానికి పరిమితం చేశారు. అదనంగా నిధులు కావాలంటే ప్రభుత్వరంగ సంస్థలను అమ్మి నిధులు సమకూర్చుకోమని చెబుతున్నారు. ఫలితంగా ప్రభుత్వం పెట్టుబడులు పెట్టటం, పరిశ్రమలు నిర్మించటం వంటి కార్యక్రమాలకు ఏ మాత్రం అవకాశం లేకుండా చేస్తున్నారు. అటువంటి పరిశ్రమలు, సరుకులు కావాలంటే బహుళజాతి సంస్థలే పెట్టుబడులు పెడతున్నాయి. స్వదేశీ పరిశ్రమలలో వాటాలు కొంటున్నారు. దేశీయ పరిశ్రమలను విదేశీ పెట్టుబడులు స్వాధీనం చేసుకుంటున్నాయి.

విశాఖ ఉక్కుఫ్యాక్టరీని పోస్కోకు అమ్మటం కూడా ఇటువంటిదే. లక్షల కోట్ల రూపాయల విలువైన ఫ్యాక్టరీని బుక్‌వాల్యూ ప్రకారం విదేశీ సంస్థ పోస్కోకు అమ్ముతామని చెబుతున్నారు. నిత్యం దేశభక్తి జపం చేస్తున్న మోడి ప్రభుత్వం దేశసంపదను కారుచౌకగా విదేశీ పెట్టుబడులకు కట్టబెట్టటానికి ఏ మాత్రం సందేహించటం లేదు. తన విధానాలను వ్యతిరేకించే వారిని అణచివేయటానికి దేశభక్తి మినహా వారికి నిజంగా దేశభక్తి లేదు. తమ స్వప్రయోజనాల

> ❝ప్రస్తుతం జరుగుతున్న ప్రైవేటీకరణ, వనరులను ప్రైవేటు వారికి అప్పగించటం యదేచ్ఛగా జరిగిపోవటం వలన ఏర్పడే గుత్త పెట్టుబడిదారులతో ప్రజల జీవితాలు దుర్భరంగా మారతాయి. ప్రజలకు అవసరమైన సరుకులు, సేవల సరఫరా వారిచేతిలోకి వెళ్ళిపోతుంది. వారు కావాలనుకుంటే ఏ సరుకుకైనా, ఏ సేవకైనా కొరతను సృష్టించగలరు. జియో ఉచిత డాటా పేరుతో పోటీదారులను దివాళా తీయించిన తర్వాత ఒక్కసారిగా ఛార్జీలను 40 శాతానికి పైగా పెంచటాన్ని గుర్తుచేసుకోండి.❞

కోసం ఉక్కుఫ్యాక్టరీనే కాదు. దేశం మొత్తాన్ని తెగనమ్మటానికైనా వారు సిద్ధమే.

విదేశాల నుండి దిగుమతి అవుతున్న సరుకులపై ఆంక్షలను ఎత్తివేస్తున్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటున్నారు. ఈ ఒప్పందాల వలన విదేశీ సరుకులు మనదేశ మార్కెట్‌లోకి ఎక్కువగా వస్తున్నాయి మినహా మనదేశంలో ఉత్పత్తి అవుతున్న సరకులు ఇతర దేశాలలోకి ఎక్కువగా వెళ్ళటం లేదు. అందు వలన వాణిజ్య లోటు భారీగా పెరుగుతున్నది. లోటును పూడ్చుకోవటానికి విదేశీ మారకం కావాలి. అందుకోసం అప్పులైనా చేయాలి లేదా దేశంలోకి విదేశీ పెట్టుబడులు రావటానికి అనుకూలమైన విధానాలనైనా అనుసరించాలి. అందుకే విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధానాలను అనుసరిస్తున్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం అంటే ఏమిటి? వాటికి ఎక్కువ లాభాలు వచ్చే విధానాలను అనుసరించటం. పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు నిర్మించటానికి వస్తే భారీగా రాయితీలు ఇవ్వటం, దేశంలోని పరిశ్రమలను చౌకగా కొనుగోలు చేయటానికి అవకాశం కల్పించటం, స్టాక్‌మార్కెట్‌లో ఎక్కువ లాభాలు సంపాదించుకోవటానికి అవసరమైన సడలింపులు ఇస్తున్నారు. ఇటువంటి చర్యలు తీసుకోవటం వలన వచ్చిన విదేశీ మారకాన్ని చూయించి, మనవద్ద రికార్డుస్థాయిలో విదేశీమారక నిధులు ఉన్నాయని చెబుతున్నారు. వాణిజ్యంలో లాభాలా ద్వారా ఇవి మనం సంపాదించుకున్న నిధులు కాదు. లాభాల కోసం వచ్చినవి. మనదేశంలో కన్నా ఇతరదేశాలలో ఎక్కువ లాభాలు వస్తాయనుకుంటే క్షణాలలో ఎగిరి పోతాయి. అపుడు మన ఆర్థిక వ్యవస్థ ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది.

**ద్రవ్య పెట్టుబడులకు లొంగుబాటు**

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులతో దేశంలోని బడా పెట్టుబడిదారులు కలసిపోయి వ్యవహరిస్తున్నారు. ద్రవ్య పెట్టుబడులు మనదేశ సంపదలు, పరిశ్రమలు, భూములు, అడవులు, ఇతర సహజ వనరులన్నింటినీ కొల్లగొట్టి లాభాలను సంపాదించు కోవటానికి ప్రయత్నిస్తున్నాయి. దేశంలోని బడా పెట్టుబడి దారులు కూడా వారితో కలిసి దేశ సంపదలను కొల్లగొట్టటం, ఇతరదేశాలలో కూడా సంపదలను స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధంగా విదేశీ పెట్టుబడి దారులు మనదేశ సంపదలను స్వాధీనం చేసుకోవటం, మనదేశంలోని పెట్టుబడిదారులు ఇతరదేశాలలో సంపదలను స్వాధీనం చేసుకొనే విధానాలు కొనసాగుతున్నాయి. ఇటువంటి విధానాలు కూడా దేశంలోని బడా పెట్టుబడి దారుల వర్గ ప్రయోజనాలను నెరవేర్చటానికి ఉద్దేశించినవే. అందువలననే నయా ఉదారవాద విధానాల అమలు వేగం పెరిగేకొద్దీ అసమానతలు పెరుగుతున్నాయి. దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య పెరుగుతున్నది. అగ్రరాజ్యమైన అమెరికా కన్నా వేగంగా సంపద కేంద్రీకరణ జరుగుతున్నది. బడా పెట్టుబడి దారుల స్థానంలోకి గుత్త పెట్టుబడిదారులు వస్తున్నారు. టెలికాం రంగంలో రిలయన్స్ గుత్తాధిపత్యం సాధిస్తున్నది. పోర్టులు, విమానాశ్రమాలలో ఆదాని గుత్తాధిపతిగా రూపుదాలుస్తున్నాడు. ప్రైవేటీకరణ విధానాలు ఇదే విధంగా ముందుకుపోతే అన్ని రంగాలలోనూ గుత్తసంస్థలు ఆవిర్భవిస్తాయి. ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలతో వ్యవసాయ కార్యకలాపాలు, ఉత్పత్తుల మార్కెట్‌పై కొన్ని సంస్థల గుత్తాధిపత్యం ఏర్పడుతుంది. అంతర్జాతీయంగా బాస్ఫ్, సింజెంటా, బేయర్, డీరే తదితరాలు గుత్త సంస్థలుగా ఉన్నాయి. మనదేశంలో ప్రస్తుతం గాద్రెజ్, టాటాకంపెనీ అనుబంధసంస్థ ర్యాలీస్, బ్రిటానియా వ్యవసాయరంగంలో ఉన్నాయి. ఆహార, వ్యవసయోత్పత్తుల రిటైల్ వాణిజ్యంలో రిలయన్స్ ఫ్రెష్, మోర్, వాల్‌మార్ట్, పాలిమేర మరికొన్ని సంస్థలు ఆధిపత్యం సాధించటం కోసం ప్రయత్నం చేస్తున్నాయి. పాలకవర్గాలకు నాయకత్వం వహిస్తున్న బడా పెట్టుబడిదారులు తమ ప్రయోజనాలను నెరవేర్చుకొనేందుకు సామ్రాజ్యవాద, ద్రవ్య పెట్టుబడులతో జత కడుతున్నారు.

ప్రస్తుతం జరుగుతున్న ప్రైవేటీకరణ, వనరులను ప్రైవేటు వారికి అప్పగించటం యదేచ్ఛగా జరిగిపోవటం వలన ఏర్పడే గుత్త పెట్టుబడిదారులతో ప్రజల జీవితాలు దుర్భరంగా మారతాయి. ప్రజలకు అవసరమైన సరుకులు, సేవల సరఫరా వారిచేతిలోకి వెళ్ళిపోతుంది. వారు కావాలనుకుంటే ఏ సరుకుకైనా, ఏ సేవకైనా కొరతను సృష్టించగలరు. జియో ఉచిత డాటా పేరుతో పోటీదారులను దివాళా తీయించిన తర్వాత ఒక్కసారిగా ఛార్జీలను 40 శాతానికి పైగా పెంచటాన్ని గుర్తుచేసుకోండి. గుత్తసంస్థలు ఏర్పడిన తర్వాత అన్ని రంగాలలోనూ ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. ఫలితంగా ప్రజలు నిత్యావసరాలు, సేవలు, ఇతర అవసరాల కోసం గుత్త పెట్టుబడిదారులు నిర్ణయించిన ధరలు చెల్లించాల్సి వస్తుంది. దానితో ప్రజల జీవితాలు దుర్భరంగా మారతాయి. ప్రజల అవసరాలను అవకాశంగా మలచుకొని, గుత్తపెట్టుబడిదారులు తమ సంపదలను మరింతగా పెంచుకొని, ఆర్థిక వ్యవస్థ, ప్రజల జీవితాలపై మరింత పట్టు బిగిస్తారు.

**బడా పెట్టుబడిదారుల వర్గ ప్రయోజనాలే నెరవేరుతున్నాయి.**

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఈ నాటి వరకు జరిగిన పరిణామాలను పరిశీలిస్తే పాలకవర్గాలు, వారికి నాయకత్వం వహిస్తున్న బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలే నెరవేరుతున్నాయి. స్వాతంత్ర్యానికి ముందు బడా పెట్టుబడిదారులు రూపొందించిన బాంబే ప్లానుకు అనుగుణంగానే ప్రభుత్వరంగ సంస్థల నిర్మాణం జరిగింది. వాటి ద్వారా బడా పెట్టుబడిదారులు అత్యంత ఎక్కువ ప్రయోజనం పొందారు. ప్రభుత్వ వనరులలో అత్యధిక భాగాన్ని వారి ప్రయోజనాల కోసమే వినియోగించుకొన్నారు. అపారంగా సంపదలను కూడబెట్టుకున్న తర్వాత తమ సామ్రాజ్యవాద మిత్రులతో కలిసి ప్రభుత్వరంగాన్ని స్వంతం చేసుకోవటానికి ఉవ్విళ్ళూరుతున్నారు. గుత్తాధిపతులుగా అవతరిస్తున్నారు. ఆనాడు ప్రభుత్వరంగాన్ని నిర్మించమన్న బడా పెట్టుబడిదారులు ఇపుడు వాటిని ప్రైవేటీకరించమని ఒత్తిడి పెడుతున్నారు. నాటి నిర్మాణం నేటి అమ్మకం రెండూ వారి ప్రయోజనాలను నెరవేర్చటానికే దోహదం చేస్తాయి. ❋

మతోన్మాదం

# ప్రతిపక్షంపై దాడి కోసమే విశ్వగురు ప్రచారం

ఎ.జి.నూరాని

ప్రపంచానికే ప్రబోధకురాలి స్థాయికి భారతదేశం ఎదగాలని, రాజకీయ అసమ్మతిని నిర్మూలించగల దీర్ఘకాలిక రాజకీయ ప్రణాళికతో దేశాన్ని చుట్టేయాలని, ఆ తర్వాత దక్షిణ ఆసియాపై పట్టు సాధించాలని ఆర్‌యస్‌యస్ పథకం రూపొందించింది. అడాల్ఫ్ హిట్లర్ రాజకీయ ప్రణాళికను నిర్లక్ష్య చేయటంవల్ల ప్రపంచం భారీ మూల్యాన్నే చెల్లించింది. అతని ఎజండా, అవగాహనలే ఆ దుష్ట ప్రణాళిక రూపకల్పనకు ప్రేరేపించాయి.

ఇటలీ దేశ మేధావి మార్జియా కెసోలారి తన ప్రఖ్యాత గ్రంథం "స్వస్థిక్ నీడలో" ఇలా పేర్కొన్నారు : "భారత జాతీయవాదం, నాజీ ఫాసిజాల మధ్య అనుమానాస్పదమైన సంబంధం వుంది. ఆర్‌యస్‌యస్, విడి సావార్కర్‌లకు నాజీలతోను, వారి ఫాసిస్టు సిద్ధాంతాలతోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. న్యూఢిల్లీ, రోమ్ నగరాల పురావస్తు భాండాగారాల్లో జరిపిన అద్భుతమైన పరిశోధనలు వారి సంబంధాలను స్పష్టం చేస్తున్నాయి.

విశ్వగురువుగా ఎదగాలన్న ఆర్‌యస్‌యస్ అకాంక్షలు కొత్త పరిణామాలు కావని, చరిత్రలో భాగమని ఆర్‌ఎస్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నది. ఆర్‌యస్‌యస్ అధినేత యంయస్ గోల్వాల్కర్ తన 'పాంచజన్యం' గ్రంథం (1966)లో ఇలా చెప్పారు: "ఒకవైపున అమెరికా (కొలంబస్ అమెరికాను కనుగొనక ముందే) -- వేరొక వైపున చైనా,జపాన్, కాంబోడియా, మలయా, థాయిలాండ్ (సియాం), ఇండోనేషియా తదితర ఆగ్నేయ ఆసియా దేశాలన్నీ, ఉత్తరాన మంగోలియా, సైబీరియా వరకూ మన బాహువులు విస్తరించాయి. శక్తివంతమైన మన రాజకీయ సామ్రాజ్యం కూడా 1400ల సంవత్సరాల పాటు ఈ ఆగ్నేయ ఆసియా ప్రాంతమంతటా విస్తరించింది. అందులో 'శైలేంద్ర' సామ్రాజ్యం ఒక్కటే 700ల సంవత్సరాల పాటు వర్ధిల్లింది – చైనా విస్తరణను శక్తివంతంగా అడ్డుకొని నిలిచింది.

విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన ప్రవీణ్ తొగాడియా అవధుల్లేని తన వూహలను ఇలా వ్యక్తపరిచాడు : "ఒకనాడు ప్రపంచమంతటా 'హిందువులే'. నాడు 700ల కోట్లమంది హిందువులు ఉండేవారు. ఇపుడు ఆ సంఖ్య కేవలం 100 కోట్లు మాత్రమే." (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 15, 2014.) ఆనాటికి అతడు విశ్వహిందూ పరిషత్‌కు అంతర్జాతీయ వర్కింగ్ అధ్యక్షుడుగా వున్నాడు. అలాంటివారు వేదకాలంలో జీవిస్తుంటారు. ఆ యుగపు ఘనకార్యాలను వల్లిస్తూ గారడీ చేస్తుంటారు.

హిందుస్థాన్ టైమ్స్ 2015, జనవరి 5న ఇలా నివేదించింది: "భరద్వాజ మహర్షి తన వైమానిక శాస్త్రంలో ఒక రసాయన ప్రక్రియను రూపొందించారు. దాన్ని వుపయోగిస్తే గాల్లో దూసుకెళ్తున్న విమానం అదృశ్యమైపోవచ్చు. 100 మంది కౌరవ సోదరులే మానవ క్లోనింగ్‌కు తొలి సాక్షీభూతం. గో మూత్రంతో క్యాన్సర్ నివారిణి ......1991లో ప్రారంభమైన సంఘ్ అనుబంధ శాస్త్రవిజ్ఞాన సంస్థ "విజ్ఞాన భారతి" ఒక పథకం రూపొందించింది. దాని ప్రకారం మహమ్మదీయుల ఆధిపత్యంలోని గల్ఫ్ దేశాలకు విస్తరించాలి. అక్కడి భారతీయ కుటుంబాల పిల్లలతో సాన్నిహిత్యం ఏర్పరచుకోవాలి. వారికి మన దేశపు సుసంపన్నమైన శాస్త్రీయ, సాంస్కృతిక వారసత్వాన్ని అందించాలి.

"ప్రఖ్యాత శాస్త్రవేత్తలు జి. మాధవన్ నాయర్, అనిల్ కాకోద్కర్‌లు ఆ సంస్థకు పోషకులు(ప్యాట్రన్స్)గా వున్నారు. భారత్‌లో తొలి సూపర్ కంప్యూటర్‌ను అభివృద్ధిచేసిన విజయ్ పి.భాట్కర్ ఆ సంస్థకు అధినేతగా వున్నారు......



రచయిత విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి

"సాంప్రదాయ, ఆధునిక శాస్త్ర విజ్ఞానాలను, ప్రకృతి, ఆధ్యాత్మిక శాస్త్రాలను మిళితం చేసి స్వదేశీ శాస్త్రవిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం, తన వ్యవస్థాపక లక్ష్యంగా విజ్ఞాన భారతి చెబుతున్నది.

విజ్ఞానభారతికి చెందిన డా. సోమ్‌దేవ్ భరద్వాజ్ ఇలా చెప్పారు : వేదాలు, ఉపనిషత్తుల్లోని జ్ఞానం భారత్‌కు గొప్ప వూపునిస్తుంది. వాటిపై పరిశోధనలు జరిపేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాలి.

గల్ఫ్‌కు విస్తరించాలని విజ్ఞానభారతి కోరుతున్నది. స్వదేశీ గోవులను..... రక్షించి అభివృద్ధిచేయాలని విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) ప్రభుత్వాన్ని వత్తిడి చేస్తున్నది.

"ఈపాటికే వ్యవసాయ మంత్రిత్వ విభాగం దేశీయ ఆవుల రక్షణ కోసం రు.500ల కోట్లు కేటాయించింది. రు.378 కోట్ల విలువైన ప్రాజక్టులను మంజూరు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రు.123 కోట్లను విడుదల చేసింది. 2014 చివరకు మధురతోపాటు, దక్షిణ భారతంలోనూ రెండు గో పోషణ కేంద్రాలను ఏర్పరచాలని కూడా ప్రతిపాదించారు."

'ఆ కాలంలోనే ప్లాస్టిక్ సర్జరి బాగా అమల్లో వుందని' ముంబయిలో నూతనంగా నిర్మించిన ఒక ఆసుపత్రిని ప్రారంభిస్తూ ప్రధాని మోడీ వక్కాణించటంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.

ఆరంభంలో 'హిందూ' ప్రపంచ గతికి సంకేతంగా 'జగత్‌గురు' పదం వినియోగించబడింది. కానీ ప్రధాన హిందూ మత పెద్దలైన నల్గురు సన్యాసుల పేర్లు – జగద్గురు శంకరాచార్యుల పేర్లను పోలివుండి గందరగోళానికి అవకాశం వుంది. అందుకే ఆర్‌యస్‌యస్ అధీనంలోని భారత్‌కు 'విశ్వగురువు' పదాన్ని

> **“ద్వేషం విడదీస్తుంది. కలుపుతుంది.” సుపరిచితమైన ఈ అంశాన్ని పరిశీలిద్దాం : హిందువులను ఐక్యం చేసేందుకు, ఇతర భారతీయుల నుండి వారిని వేరుచేసేందుకు ఆర్‌యస్‌యస్ ద్వేషాన్ని విరజిమ్ముతున్నది. ప్రత్యేకంగా ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు. ఈ ముగ్గురూ అంతర్గత శతృవులని గోల్వాల్కర్ పాంచజన్యం(చాప్టర్ 11)లో పొందుపర్చాడు. గోల్వాల్కర్ తన ‘మన జాతీయత నిర్వచించ బడింది’ పుస్తకంలో హిందుత్వ ఆలోచనలను వ్యక్తం చేశాడు..**

వాడి వుండవచ్చు. గోల్వాల్కర్ – ‘వుయ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్’(1939) మరియు పాంచజన్యం(1966) .. రెండు పుస్తకాలను రచించాడు. ఆ రెండు పుస్తకాలతో విడగొట్టు కోవాలని ప్రయత్నం చేస్తున్నది.

కాని వంచనతో కూడిన వారి ప్రయత్నాలు ఫలించటం లేదు. ఆర్‌యస్‌యస్ అధినేత రాజేంద్రసింగ్, మాజీ అధినేత ఎం డి దేవరస్ సోదరుడు భావురావు దేవరస్‌లు, 1978లో తాము సమర్పించిన అప్లికేషన్ 17లో పై రెండు పుస్తకాలూ తమ సంస్థవేనని నమోదు చేశారు. వెర్రిమొర్రి చరిత్ర నిర్మాణాలతో విశ్వగురువుగా ఆర్‌యస్‌యస్ వేసుకున్న స్వీయ ముద్రకు ఉన్న రాజకీయ పర్యవసానాల నుండి దృష్టి మళ్లించటం సాధ్యం కాదు. అందుకు అనుగు ణంగానే, కరుడుగట్టిన ఆర్‌యస్‌యస్ నేత, బిజెపి మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 2016, మార్చి 5న చేసిన స్పష్టమైన, నిస్సందేహమైన ప్రకటన ఇలావుంది : “భారత్ మాత విశ్వగురువు స్థాయికి ఎదగాలంటే... దేశంలో 25 సంవత్సరాలు బిజెపి ప్రభుత్వం కొనసాగటం ముఖ్యం.” (ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మార్చి 6,2016).

విశ్వగురువుపేర వేస్తున్న గావుకేకలకు మూల కారణాలను, తద్వారా దేశం ఎదుర్కొం టున్న చిక్కులను పై అంశాలు తెలియ జేస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థులను అంత మొందించటం, అసమ్మతిని అణచి వేయటం, లౌకికతత్వం పట్ల వైషమ్యం, మిలిటరీ బలాన్ని పెంచుకోవటం, నవభారత విభాగంగా ఆర్‌యస్‌యస్ ప్రపంచ సమ్మతిని పొందటం, మరికొన్ని చోట్ల ఫాసిస్టు శక్తులతో చేతులు కలపటం – ఇలాంటి దీర్ఘకాల రాజకీయ ప్రణాళికతో ఆర్‌యస్‌యస్ చుట్టుముదుతున్నది. సూక్ష్మంగా చెప్పాలంటే, దేశం లోపల హిందుత్వ విజయం సాధించం, అందుకు అంతర్జాతీయ ఆమోదాన్ని పొందటమే వారి వ్యూహంగా వుంది.

**హిందుత్వ ద్వితీయ పర్వం :**

విచిత్రమైన ఈ కల నెరవేరజాలదన్న అంశాన్ని పక్కన పెడదాం. కాని దీనితో మన దేశం ఎదుర్కోబోతున్న ప్రమాదానికి సంబం ధించిన అంశం ముఖ్యమైనది. దక్షిణాసియాపై ఆధిపత్యం సాధించటమే దాని సహజ పరిణా మం కానుంది. ‘విశ్వగురు’ హిందుత్వ ద్వితీయ పర్వం.

సావర్కర్ 1923లో హిందుత్వపై రాసిన వ్యాసం విస్తారంగా విషం చిమ్మేసింది. అది విశ్వగురు బీజాలను నాటింది. వారి వారసులు ఆ మొక్కలకు నీరుపోసి పెంచేందుకు పాటుపడుతున్నారు. కానీ సావార్కర్ బలంగా తన వాదనలను ఇలా విన్పిస్తున్నారు : “ఈ భూమిపై పుట్టిన పెద్దల నుండి ప్రపంచంలోని ప్రతివారూ తమ బాధ్యతలను నేర్చుకుందురు గాక!” బుద్ధుడు మరియు బౌద్ధ సిద్ధాంతం పట్ల గౌరవాన్ని వ్యక్తం చేయటంలో సావర్కర్ చాలా ఇబ్బంది పడ్డాడు. బౌద్ధం భారతదేశ వ్యాపితం గా విస్తరించటం, అనంతర పర్యవసానాల పట్ల తన ఆవేదనను, అసమ్మతిని దాచుకోలేక పోయాడు. బౌద్ధం అభివృద్ధికి పూర్వ కాలమే అతడికి, ఇతర ఆర్‌యస్‌యస్ నాయకులకు ప్రేరణగా నిలచింది. “ వైదిక ధర్మం వర్ధిల్లాలి। వేదాలు పునరాగమనం కావాలి । జాతీయ వాదం బిగ్గరగా, మరింత బిగ్గరగా ప్రతిధ్వనిం చాలి”.......వాస్తవానికి రాజకీయ ఆవశ్యకతే అందుకు పురికొల్పుతున్నది. “హిందుత్వ ఒక రాజకీయ ప్రణాళిక” అనేది ఎంతో వాస్తవం. కేవలం రాజకీయ అవసరాల కోసమే వారు భారత్‌లో బౌద్ధాన్ని తిరస్కరించారు.

“ద్వేషం విడదీస్తుంది. కలుపుతుంది.” సుపరిచితమైన ఈ అంశాన్ని పరిశీలిద్దాం : హిందువులను ఐక్యం చేసేందుకు, ఇతర భారతీయుల నుండి వారిని వేరుచేసేందుకు ఆర్‌యస్‌యస్ ద్వేషాన్ని విరజిమ్ముతున్నది. ప్రత్యేకంగా ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు. ఈ ముగ్గురూ అంతర్గత శతృవులని గోల్వాల్కర్ పాంచజన్యం(చాప్టర్ 11)లో పొందుపర్చాడు. గోల్వాల్కర్ తన ‘మన జాతీయత నిర్వచించ బడింది’ పుస్తకంలో హిందుత్వ ఆలోచనలను చేశాడు. అతని వివరణ ద్వేషంతో ఆరంభమై ఇలా ముగుస్తుంది : “జాతి స్ఫూర్తి మనల్ని హెచ్చరిస్తున్నది. అది శాశ్విత మార్గదర్శిగా ఆధ్యాత్మిక వైభవంతో, అజ్ఞానాంధకారంలోని తన బిడ్డలను రక్షించే ఆదర్శాల వైపుకు మార్గం చూపుతుంది. నిజమైన జాతీయత స్థాయికి స్వయంగా మనం ఎదగాలి. మన జాతిని నడుపుతున్న స్ఫూర్తిని అందరం అనుసరిద్దాం. వేద రుషుల ఆదేశాల తో స్వర్గాన్ని నింపుదాం. సంద్రం నుండి సంద్రం వరకూ భూమండల మంతా ...ఒక దేశం, ప్రతిష్టాత్మకం, అద్భుతమైన హిందూ దేశం శాంతిని పుష్క లంగా ప్రపంచ మంతటా విరజిమ్ముతున్నది.”

**విపరీత వాదనలు :**

“మా విశ్వ మిషన్”... ఈ పదాలతోనే గోల్వాల్కర్ ‘పాంచజన్యం’(చాప్టర్ 1) ఆరంభమౌతుంది. మోడీ బృందం గతంలో తాము సాధించామని ప్రచారం చేసుకుంటున్న విపరీత వాదనలనే గోల్వాల్కర్ ఆ పుస్తకంలో వివరించాడు : “ఈ గడ్డపైన మాత్రమే సనాతన కాలం నుండి తరతరాలుగా తాత్వికులు, దార్శనికులు, రుషులు మానవ జీవిత రహస్యాలను బట్టబయలు చేశారు. వారు మానవాతీతమైన జ్ఞాన ప్రపంచం లోతుల్లోకి దిగబడ్డారు. గొప్ప ఐక్యతా సిద్ధాంతాన్ని గుర్తించగల శాస్త్ర విజ్ఞానాన్ని కనుగొన్నారు. దాన్ని ఉన్నత స్థాయికి అభివృద్ధి చేశారు. మొత్తం దేశంలోని వందల శతాబ్దాల తపస్సు, త్యాగం, అనుభవాలు ఇక్కడ వున్నాయి. ప్రపంచ ఆధ్యాత్మిక దాహార్తిని తీర్చేందుకు ఈ దేశం తరగని విజ్ఞాన శిఖరంలా నిల్చింది. ఆ విజ్ఞానం, అడవుల్లో సన్యాసుల ఆశ్రమాల్లో కూర్చొని ఆలోచించే కొందరి మేధో ఊహాగా నాలకు మాత్రమే పరిమితమైన పొడిపొడి విజ్ఞానం వంటిది కాదు. అదొక సజీవ ఆలోచనా స్రవంతి. ఆలోచనాపరులు, పాలనా దక్షులు, వ్యాపారులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, తాత్వికులు వంటి మన పూర్వీకులను ఈ ‘విశ్వ సహోదరుల’ సందేశం కదిలించగల్గింది. ప్రపంచంలోని పలు సుదూర ప్రాంతాలకు

వారు తరలి వెళ్లి ఆ సందేశాన్ని పంచిపెట్టారు. వారు అడుగుపెట్టిన ప్రతి చోట, జీవితపు ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను స్థానిక ప్రజలకు బోధించారు. భౌతిక సంపదల శాస్త్రాన్ని తెలియజేశారు. దానితోపాటు సజాతీయ దేశాల మధ్య సహోదరత్వాన్ని నిర్మించారు. బలమైన, ఆత్మవిశ్వాసం, స్వీయ సంపన్నమైన మన హిందూ సమాజం సుదూర ఆత్మ (స్పిరిట్) సామ్రాజ్యాన్ని ఐక్యపరచే ఇరుసును సమకూర్చింది."

**అమెరికాపట్ల వ్యామోహం :**

అమెరికాతో కూటమికట్టాలని ఆరంభం నుండి ఆర్‌యస్‌యస్ ప్రబోధించింది (అలీనవిధానానికి తిరస్కరణ). అదే సమయం లో కమ్యూనిస్టు చైనాపట్ల దాని వ్యతిరేకత బహిరంగ రహస్యమే. అంతర్జాతీయంగా ఒక పక్కకు ఒరిగిపోవాలన్న తృష్ణతో పాటు, దేశం లోపల విద్వేషం ఆధారిత విచ్ఛిన్నానికి పూనుకుంటున్నది. "తల్లి గర్భం నుండి బైటకు రాక ముందే మనం హిందువులమన్నది వాస్తవం. కాబట్టి మనం హిందువులుగా పుట్టాం. ఇతరుల గురించి చెప్పాలంటే వారంతా పూరా పేరూ లేని వారుగా ఈ లోకంలో పుట్టారు. తర్వాత, వారు సున్తీతోగానీ, బాప్టిజంతోగానీ ముస్లింలు లేదా క్రిస్టియన్‌లుగా మారారు.

**"అమెరికాతో కూటమికట్టాలని ఆరంభం నుండి ఆర్‌యస్‌యస్ ప్రబోధించింది (అలీనవిధానానికి తిరస్కరణ). అదే సమయం లో కమ్యూనిస్టు చైనాపట్ల దాని వ్యతిరేకత బహిరంగ రహస్యమే. అంతర్జాతీయంగా ఒక పక్కకు ఒరిగిపోవాలన్న తృష్ణతో పాటు, దేశం లోపల విద్వేషం ఆధారిత విచ్ఛిన్నానికి పూనుకుంటున్నది. "తల్లి గర్భం నుండి బైటకు రాక ముందే మనం హిందువులమన్నది వాస్తవం. కాబట్టి మనం హిందువులుగా పుట్టాం."**



దేశీయ ఆవును గోమాతగా ప్రచారం చేస్తున్న సంఘ్ పరివార్

"అందుకే, మన సమాజంలో అస్థిత్వపు స్ఫూర్తిని, ఐక్యతను శక్తివంతం చేయాలి. అది మన పుట్టుకతో వచ్చిన బాధ్యత. మన సహజ కర్మ. లోపభూయిష్టంగా కన్పించినప్పటికీ మన సహజకర్మను విడనాడరాదు. ప్రస్తుత అసమ్మతులు, భిన్నాభిప్రాయాలు మన ప్రాణాధారాలను తినేస్తున్నాయి. అందుకే వాటిని తొలగించుకోవటం మన ప్రథమ కర్తవ్యం. మన సమాజాన్ని మరోసారి ఐక్యం చేయాలి. సామరస్యపూర్వకంగా మార్చుకోవాలి. ఆ పని కేవలం అంతర్గత విశ్వాసాల సయోధ్యల ద్వారా మాత్రమే సాధ్యం కాదు. ప్రపంచానికే ప్రబోధించేందుకు ప్రతిన పూనిన 'విశ్వగురువు' గా హిందుత్వను భారత్‌లో ఉపయోగించాలి.

మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ, కాంగ్రెస్ ల పట్ల వ్యతిరేకతను గురించి ఇలా చెప్పారు :"మన నాయకులు 'హిందూ ముస్లిం ఐక్యత' నినాదమిచ్చారు. అందుకు ఆటంకంగా నిలుస్తున్న వాటిని విస్మరించాలన్నారు. కానీ వేర్పాటు వాదాన్ని వదిలేయమని ముస్లింలకు చెప్పేందుకు వారు ధైర్యం చేయలేదు. తమ ప్రబోధాలన్నీ హిందువులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టారు. మన జాతీయతను హిందుగా పిలువరాదన్నది వారు చెప్పే మొదటి అంశం. మన మాతృభూమిని సాంప్రదాయ నామం 'హిందుస్థాన్' పేర పిలువరాదని, అలా చేస్తే ముస్లింలు మనస్థాపం చెందుతారని వారు బోధిస్తున్నారు. బ్రిటీషువారు పెట్టిన 'ఇండియా' పేరును ఆమోదించారు. 'నూతన దేశాన్ని, 'ఇండియన్ నేషన్'గా పిలుస్తున్నారు. 'ఇండియన్' గా పిలుచు కొమ్మని హిందువులను కోరు తున్నారు .......

"అంటే, నీవు మానసికంగా బలహీను డవని వారు హిందువుకు చెబుతున్నారు. సొంత కాళ్లపై నిలబడి, మాతృభూమి స్వేచ్ఛకోసం పోరాడేందుకు నీకు స్ఫూర్తి, శక్తి లేవని వారంటున్నారు. ఇవన్నీ ఎందుకంటే, ముస్లింల రక్తం హిందువుకు ఎక్కించేందుకే. సనాతనమైన, ధీటైన మన విశ్వాసాలను కూల్చేందుకు, మన స్వంత నాయకులే ముందుకు రావటం సిగ్గుచేటు, దురదృష్టకరం. అంతే కాదు, మన ప్రజల జీవన శ్వాసలైన ఆత్మవిశ్వాసాన్ని, స్వయం సమృద్ధి స్ఫూర్తినే నాశనం చేస్తున్నారు. 'హిందూ ముస్లిం ఐక్యత లేకుంటే దేశ స్వాతంత్ర్యమే లేద'ని చెప్పేవారు రాజ ద్రోహానికి పాల్పడుతున్నారు. గొప్పవారైన సనాతన ప్రజల జీవన స్ఫూర్తిని చంపేసే హేయమైన పాపానికి వారు బద్ధులై వున్నారు. శివాజీకి జన్మనిచ్చిన సమాజానికి నపుంసక కత్వాన్ని బోధిస్తున్నారు. ప్రఖ్యాత చరిత్రకారుడు జాదూనాథ్ సర్కార్ ఇలా చెప్పారు.: 'హిందువులు అమరత్వాన్ని ఇచ్చే అమృతాన్ని సేవించారని ప్రపంచమంతటికీ శివాజీ నిరూపించాడు.' అలాంటి ఆత్మ విశ్వాసం, స్ఫూర్తివంతమైన గొప్పశక్తిగల మన సమాజానికి సమాంతర మైనది ప్రపంచ చరిత్రలోనే లేదు. అంత గొప్ప సమాజానికి వారు పెద్ద ద్రోహం తలపెట్టారు. వారు ప్రవేశపెట్టిన ఆత్మ న్యూనతా భావాన్ని, విశ్వగురు నామోచ్చారణలతో ఉపశమనం కల్గించాలి.

**విశ్వగురువు కోసం ప్రచారం :**

విశ్వగురు ప్రచారాన్ని ఎక్కడా వదిలేయ లేదు. పైగా స్వాతంత్ర్యానంతరం అది వూపందు కుంది. జనవరి 2021 వరకూ నిరంత రాయంగా కొనసాగింది. ఇటీవలి కాలంలో ఆ ప్రచారంలోని కీలక విషయాలను పరిశీలిద్దాం.

1. 1997 విజయదశమి నాడు ఆర్‌యస్

> **"ప్రతి దేశానికీ ఒక ఉద్దేశ్యం వుంటుందని స్వామి వివేకానంద ఇలా అభిప్రాయపడ్డారు : 'రోమ్ తన మిలిటరీ శక్తితో ప్రపంచం ముంగిట ఒక ఉదాహరణగా నిలిచింది. ఆ కర్తవ్యం పూర్తయ్యాక దాని మనుగడ పరిసమాప్తమయ్యింది. ఈ విశాల సృష్టిలో ప్రతి జీవికీ ఒక సార్థకత వుంటుంది. అది దేనికోసం పుట్టిందో ఆ పనిలో విజయ వంతమయ్యాక అది అంతరిస్తుంది...."**



దేశభక్తి పేరుతో జర్మనీలో విధ్వంసం సృష్టించిన నాజీలు

యస్ అధినేత రాజేంద్రసింగ్ నాగపూర్‌లో తమ క్యార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా చెప్పారు : "మరోమారు భారత్‌ను విశ్వగురువుగా మార్చాలన్న తమ కలను సాకారం చేసుకునేందుకు లక్షలాది ప్రజలు తమ వ్యక్తిగత జీవిత సౌఖ్యాలను త్యజిస్తున్నారు. పలు పరిమితులు విధించుకుం టున్నారు. స్వామి వివేకానంద, సావార్కర్, డా. హెడ్గేవార్, సుభాష్‌చంద్ర బోస్, అరబిందో ఘోష్‌వంటి మహనీయులు ఈ కలను సాకారం చేసేందుకు అద్భుతమైన కృషి చేశారు. అసంపూర్ణంగా మిగిలిన ఈ పవిత్రమైన పనిని పూర్తి చేసేందుకు నిర్ణయించుకుని కృషి చేసేవారి జన్మ ధన్యమౌతుంది. ప్రస్తుత దుస్థితి నుండి మాతృభూమిని కాపాడగల్గుతారు. ఒకటి, రెండు సంవత్సరాల్లో ఆశావహము, ఉత్సాహకరమైన వాతావరణాన్ని తీసుకురావచ్చు". (ఆర్గనైజర్, అక్టోబర్26, 1997).

2. బైటూల్‌లో జరిగిన హిందూ సమ్మేళనంలో మోహన్ భగవత్ ఇలా చెప్పారు: "భారత్ విశ్వగురువుగా మారాలని ప్రపంచ ప్రజలందరూ ఎదురు చూస్తున్నారు. ఆ దిశలో కృషి సాగించాల్సిన బాధ్యత ప్రతి హిందువు పైనా వుంది. ప్రపంచమంతటా జరుగుతున్న ఆర్థిక పోరాటాలను మనం చూస్తున్నాం. మతం, తెగలపేర భారీ రక్తపాతం జరుగుతున్నది. పై సమస్యల పరిష్కారం కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తున్నది. విశ్వగురువు పాత్రను పోషిం చేందుకు భారత్‌కు ఇది సరైన సమయము....." (ఆర్గనైజర్, ఫిబ్రవరి 19, 2017).

3. వర్తమాన ప్రపంచ నేపధ్యంలో భారత్ పాత్ర గురించి ఆర్‌యస్‌యస్ బాస్ మోహన్ భగవత్ ఏం చెప్పారో చూద్దాం : "స్వాతంత్ర్యానికి పూర్వమే భారత్ చొరవైన పాత్ర కోసం ప్రపంచం ఎదురు చూసింది. ఈ కాలంలో కూడా భారత్‌కు ఆ ప్రాధాన్యత వుంది. మొదటిది, ఇపుడు మనం మేల్కొన్నాం. మనం స్వతంత్రులమయ్యాక కూడా ఈ విధంగా ఆలోచించలేకపోయాం. ప్రపంచ జీవనంలో స్వతంత్ర భారతదేశ పాత్ర గురించి మనమొక దార్శనిక పత్రం తయారుచేసుకోలేదు. అందుకోసం ఎలాంటి మేధోపరమైన చర్చలూ జరుపలేదు. మనదొక అభివృద్ధి చెందుతున్న దేశం. మనమేం చేయగలమన్న భావనే అందుకు కారణం. కానీ నేడు మారిన మన భావన మనల్ని మేల్కొల్పుతున్నది. ప్రతి దేశానికీ ఒక ఉద్దేశ్యం వుంటుందని స్వామి వివేకానంద ఇలా అభిప్రాయపడ్డారు : 'రోమ్ తన మిలిటరీ శక్తితో ప్రపంచం ముంగిట ఒక ఉదాహరణగా నిలిచింది. ఆ కర్తవ్యం పూర్తయ్యాక దాని మనుగడ పరిసమాప్తమయ్యింది. ఈ విశాల సృష్టిలో ప్రతి జీవికీ ఒక సార్థకత వుంటుంది. అది దేనికోసం పుట్టిందో ఆ పనిలో విజయ వంతమయ్యాక అది అంతరిస్తుంది.... భారతదేశ లక్ష్యం ప్రపంచానికి నిరంతరం అవసరం. ప్రపంచానికి మద్దతునివ్వగల స్థాయికి భారత్ చేరింది. ఆ సమయం ఆసన్నమైంది. ఇపుడు భారత్ మేల్కొనాలి. (ఆర్గనైజర్, డిసెంబర్20,2020).

"భారత్, తన లక్ష్యాలు, ఆలోచనలు ఆధారంగా ప్రపంచంలో ఒక గౌరవనీయ స్థాయికి ఎదిగింది. అవన్నీ ప్రపంచ లక్ష్యాలు కావటమే ఆ ఎదుగుదలకు కారణం. ఆ వూహాశక్తినంతటినీ కలుపుకుని మన జీవితం పైకి ఎగసి నిలచింది. ప్రతి దేశానికీ గుర్తింపు, భిన్నత్వం వుంటాయి. అందరినీ ఒకే వ్యవస్థలో కుక్కేందుకు మనం ప్రయత్నించం.......

"ప్రపంచంలో నూతన శక్తులు ఆవిర్భవిస్తున్నాయి. అందుకే భవిష్యత్ ప్రపంచంలో భారత్ పాత్ర శక్తివంతంగా మారింది. యావత్ ప్రపంచానికీ విశ్వాసం, ధైర్యం, నమ్మకాలనూ కల్పించగల శక్తి కేవలం ఒక్క భారత్‌కు మాత్రమే వుంది. భారత్ ముందుకురికి వారికి నాయకత్వం అందించగల్గటం..అదే మన సంక్షేమం. అందుకే మనం 'శివ తావ్' ని తప్పక ధరించాలి.అది మన నమ్మకాలను అర్థవంతం చేస్తుంది. ప్రపంచానికొక నూతన ప్రామాణిక నిర్వచనాన్ని అందిస్తుంది...."

4. అక్టోబర్ 3, 2012న న్యూఢిల్లీ వుపన్యాసంలో విశ్వగురువు ప్రచారం గురించి ఇలా చెప్పారు : "భారత్ ప్రపంచానికి నాయకత్వంవహించాలి. (ఆర్గనైజర్, అక్టోబర్ 13, 2012). జనవరి 2, 2021న ప్రధాని నరేంద్ర మోడీ ఇలా మాట్లాడారు." భారతదేశ ప్రభవాన్ని ప్రపంచంలో దిశదశలా వ్యాప్తి చేసేందుకు ఇది సరైన సమయం..."

**అనువాదం: వై సిద్ధయ్య**

❋

# పెట్టుబడి కేంద్రీకరణతో తీవ్రమౌతున్న సంక్షోభం

సందేహాలు సమాధానాలు

బి.వి. రాఘవులు



**పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉందని అంటున్నాం..! అయితే, పెట్టుబడిదారులు కొత్త కొత్త వ్యాపారాల్లోకి వెళుతూ, కొత్త యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం వారికి ప్రధాన రంగాల్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలో ఉందని ఎలా భావించగలం..? అంతేకాకుండా బడా పెట్టుబడిదారులకు వ్యక్తిగత ఆస్తులు, ఇంకా వ్యాపార రీత్యా... భూముల రూపంలో, ఫ్యాక్టరీలు, యంత్రాలు, ఫ్యాక్టరీల్లో ఉండే ముడి/తయారైన సరుకు ఇలా అనేక రూపాల్లోనూ ఆస్తులున్నప్పుడు సంక్షోభం కిందకు ఎలా వస్తుంది? ఉత్పత్తిలో వచ్చే మిగులులో కార్మికుల వాటా తగ్గి, పెట్టుబడిదారుల వాటా పెరుగుతూ ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల పెట్టుబడిదారులకు లాభం రాకపోవటాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం అని ఎలా భావించగలం? వివరణ ఇవ్వగలరు.**

**– విష్ణు వర్ధని, విజయవాడ**

సమాజం యొక్క ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి, పంపిణీ, వినియోగం కీలకమైన భాగాలు. ఈ మూడు అంశాలు సమన్వయంతో సక్రమంగా పని చేస్తుంటే ఆర్థిక వ్యవస్థ సజావుగా నడుస్తుంది. ఎప్పుడైనా తీవ్రమైన ఆటుపోట్లు, ఒడిదుడుకులు, అస్థవ్యస్త పరిస్థితులు ఎదురై ప్రజా జీవనం అతలా కుతలం కావడమో, దెబ్బతినడమో జరిగితే ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో పడిందని అంటాం.

ఈ సంక్షోభాలు ఆర్థిక వ్యవస్థకు బాహ్యంగా వుండే పరిస్థితుల వలన సంభవించవచ్చు. కరువు కాటకాలు, వరదలు ఉప్పెనలు, భూకంపాలు, ప్లేగు కలరా, కరోనా వంటి అంటువ్యాధులు వగైరా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో పడవచ్చు. ఆ పరిస్థితులు ఉపశమించినప్పుడు తిరిగి ఆర్థిక పరిస్థితి మెరుగుపడవచ్చు.

ఆర్థిక వ్యవస్థలోనే వివిధ ఉత్పత్తి శాఖల మధ్య సమన్వయం దెబ్బతిన్నప్పుడు, డబ్బు చలామణిలో అసమతుల్యం ఏర్పడినప్పుడు సరుకుల రవాణా, చలామణిలో అంతరాలు ఏర్పడినప్పుడు కూడా తాత్కాలికంగా ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో పడవచ్చు. అవి సవరించబడితే ఆర్థిక వ్యవస్థ మరల తిరిగి కోలుకోవచ్చు. పైన పేర్కొన్నటువంటి సంక్షోభాలు ఒక ప్రాంతానికో, దేశానికో, పరిమితం కావచ్చు. ఒక రంగానికో కొన్ని రంగాలకో పరిమితి కావచ్చు. అయితే మనం సాధారణంగా ప్రస్తావించే సంక్షోభం పెట్టుబడిదారీ విధానానికి సంబంధించింది. పైన పేర్కొన పరిస్థితుల మూలంగా పెట్టుబడిదారీ విధానంలో కూడా సంక్షోభం ఏర్పడవచ్చు. కాని ఈ విధానంలో బాహ్య పరిస్థితులు దెబ్బతినడం వలన ఉత్పత్తి, పంపిణి, వినియోగంలో సంక్షోభం కలగదు. పెట్టుబడిదారీ విధానపు అంతర్గత స్వభావం మూలంగానే సంక్షోభం ఏర్పడుతంది. 'పెట్టుబడిదారీ విధానంలో పెట్టుబడిదారులు అదనపు విలువ రూపంలో అంతకంతకు ఎక్కువ ఉత్పత్తిని సొంతం చేసుకుంటారు. సరుకులు కొనుగోలు చేయాల్సిన ప్రజల చేతుల్లో ఆర్థిక శక్తి తగ్గిపోతుంటుంది. దీనివలన ఇబ్బడి ముబ్బడిగా సరుకులు ఉత్పత్తైనా.. అమ్ముడుపోకుండా మిగిలిపోతాయి. ఇది ఒక విషవలయానికి దారితీస్తుంది. శ్రామికుల ఆదాయం తగ్గి సరుకులను కొనుగోలు చేయరు. సరుకులు అమ్ముడుపోక పెట్టుబడిదారులు ఉత్పత్తి తగ్గిస్తారు. ఉత్పత్తి తగ్గినందున అవసరం లేని కార్మికులను పని నుండి తొలగిస్తారు. పని పోయిన కార్మికుల చేతుల్లో డబ్బు లేనందున సరుకులు కొనుగోలు మరింత తగ్గిపోతుంది. ఇలా దారిద్ర్యం, నిరుద్యోగం, పరిశ్రమల మూత పెరిగిపోతాయి. ఈ పరిస్థితిని మనం సంక్షోభం అంటాం. ఇటువంటి సంక్షోభాలు దేశాలతో నిమిత్తం లేకుండా ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తాయి. 1929–30లో అమెరికాలో ప్రారంభమైన మహామాంద్యం, 2008లో అమెరికాలోనే మొదలైన సబ్‌ప్రైమ్ సంక్షోభాలను మనం ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఇటువంటి సంక్షోభాలు వచ్చినప్పుడు నష్టపోయేది సామాన్య ప్రజలు. వారి మీద భారాలు మోపి పెట్టుబడిదారులు సంక్షోభం నుండి బయటపడతారు. సంక్షోభ కాలంలోనే పెట్టుబడిదారుల ఆస్తులు వేగంగా పెరుగుతాయి. సంక్షోభంలో పెట్టుబడిదారుల ఆస్తులకు ఏమీ జరగదు. వారి ఫ్యాక్టరీలు, భూములు, యంత్రాలు, వ్యాపారాలు అలాగే వుంటాయి. అంతవరకు సంపాదించి పెడుతున్న ఆదాయాన్ని మాత్రమే కోల్పోతారు. ఈ కాలంలో దివాళాతీసిన వారి ఆస్తులను, వ్యాపారాలను, ఫ్యాక్టరీలను కొనుగోలు చేసి కొంతమంది పెట్టుబడిదారులు మరింత పెద్దవారవుతారు. ఈ రకంగా ఆస్తులు చేతులు మారి, కొంతమంది ఆస్తులు పెరగడాన్ని సంక్షోభం లేదనడానికి నిర్ధారణగా భావించకూడదు. వాస్తవంగా సంక్షోభ తీవ్రతకు సంకేతంగా చూడవచ్చు. ఇప్పుడు ఆదాని, అంబాని ఆస్తులు సంక్షోభం మధ్యలో ఎలా పెరుగుతున్నాయో మనం చూస్తున్నాం.

పై వివరణను బట్టి మనం ఒకటి అర్థం చేసుకోగలం. పెట్టుబడిదారి విధానం ఉత్పత్తి దెబ్బతిని సంక్షోభంలో పడదు. పెరిగిన ఉత్పత్తిని

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

కొనుగోలు చేయగల ఆదాయాన్ని ప్రజల చేతుల్లోకి చేరకుండా చేయడం వలన వస్తుంది. ఇది పెట్టుబడిదారీ సంక్షోభం యొక్క ప్రత్యేకత.

**మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల అనుకూల విధానాల్ని అమలు చేస్తోంది. పేద, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చిన్న వ్యాపారులపైనా తీవ్రమైన ప్రభావం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ప్రధాన వైరుధ్యాలలో ఏది ముందుకు వస్తుంది? దాని పరిష్కారంలో మన పాత్ర ఎలా ఉండాలి?**

బిజెపి కేంద్ర ప్రభుత్వం సరళీకరణ విధానాలను పూర్తి స్థాయిలో అమలు జరపడానికి పూనుకున్నది. అంతేగాక అన్ని రంగాలలో బడా పెట్టుబడిదారులు (కార్పొరేట్లు) ఆధిపత్య స్థాయిలోకి తొందరగా రావడానికి తోడ్పడుతున్నది. దీనికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ రంగాన్ని వేగంగా నాశనం చేసున్నది. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో సంస్కరణలకు దూరంగా ఉన్న వ్యవసాయాన్ని, ప్రభుత్వ రంగం ఆధిపత్యం వహిస్తున్న ద్రవ రంగాన్ని (బ్యాంకింగ్) పూర్తిగా కార్పొరేటు ఆధీనంలోకి తెస్తున్నది. ఈ విధానాలు వర్గ వైరుధ్యాలను తీవ్రం చేస్తున్నాయి. చిన్నతరహా, మధ్య తరహా పరిశ్రమలను, వ్యాపారాలను నడుపుతున్న చిన్న ప్రాంతీయ పెట్టుబడిదారులు స్వతంత్ర ఉనికిని కోల్పోతున్నారు. కార్పొరేట్లకు మధ్యవర్తులుగానో, వారి ఆధీనంలో వుండేలాగనో మారిపోవాల్సి వస్తున్నది. దీని పట్ల ఈ శక్తులలో వ్యతిరేకత పెరుగుతున్నది.

వ్యవసాయంలో కార్పొరేట్ల ప్రవేశాన్ని ధనిక రైతులతో సహా అన్ని వర్గాల రైతాంగం నిరసిస్తున్నది. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న రైతు ఉద్యమంలో ఈ అసంతృప్తి ప్రతిబింబిస్తున్నది. కార్పొరేట్లకు దేశవ్యాప్తమైన ఉమ్మడి మార్కెట్టు ఏర్పాటుకు ఆటకంగా ఉన్న రాష్ట్రాల హక్కులను ఒక్కొక్కటిగా కేంద్రం హరిస్తున్నది. ఫెడరల్ వ్యవస్థను బలహీనం చేసి కేంద్ర నిరంకుశత్వాన్ని పెంచుతున్నది. ఫెడరల్ స్వభావానికే కాక, ప్రజాస్వామ్యాన్ని కూడా హరించి వేస్తున్నది. రాష్ట్రాలలోని వివిధ వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతీయ పార్టీలకు కేంద్రానికి మధ్య వివాదాలలో ఈ వైరుధ్యం వ్యక్తం అవుతున్నది. ప్రస్తుతం ఈ వైరుధ్యాలన్నీ తీవ్రం అవుతున్నాయి. వివిధ రూపాల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ వైరుధ్యాల న్నింటిలోనూ ఒకకోపులో కార్పొరేట్లు, వాటికి నాయకత్వం వహిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉంది. అందువలన అన్ని వైరుధ్యాల తీవ్రత లోనూ ప్రజలకు ఒకే ప్రత్యర్థి. అందువలన ప్రస్తుతం అన్ని వైరుధ్యాల సారాంశం ఒకటే. కార్పొరేటు శక్తులకు, బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేయటమే లక్ష్యం.

**ప్రస్తుత పరిస్థితుల్లో.. నయా ఉదారవాద విధానాల కారణంగా తలెత్తే అన్యవర్గ ధోరణుల ప్రభావం, నాయకులపైనా, కార్యకర్తలపైనా ఏ రకంగా ఉంటోంది? వాటిని ఎలా ఎదుర్కోవాలి? వివరణాత్మకంగా తెలపగలరు.**

నయా ఉదారవాద విధానాలు (సరళీకరణ విధానాలు) కేవలం ఆర్థిక విధానాలే కాదు. ఆర్థిక, రాజకీయ, సామాజిక సాంస్కృతిక రంగాలన్నింటిలో వాటి సారం వివిధ రూపాల్లో వ్యక్తం అవుతుంటుంది. నయా ఉదారవాద విధానాలు పెట్టుబడిదారి దోపిడి నిరాఘాటంగా సాగడాన్ని ప్రతిపాదిస్తాయి. దానికను గుణమైన విలువలను ప్రజా జీవనంలో ప్రోత్సహిస్తాయి. డబ్బు సంపాదనను ఉదాత్తమైన ఆదర్శంగా ఆకాశానికెత్తుతాయి. ఎలా సంపాదించాం? అన్నది ముఖ్యం కాదు, ఎంత సంపాదించాం? అన్నదే ముఖ్యం. తక్కువ సంపాదించేవారు సమాజంలో చిన్నచూపుకు గురవుతారు. వ్యక్తివాదం, స్వార్థం, ఆశపోతుతనం, విధ్వంసక పోటీ గొప్ప విలువలుగా ముందుకు వస్తాయి. మనిషి వినిమయ యంత్రంగా మారతాడు. ఎన్ని రకాల సరుకులు ఎంత ఎక్కువ వినియోగం చేస్తారన్నదాన్ని బట్టి వ్యక్తికి విలువ, స్థాయి నిర్ణయించబడుతుంది. గౌరవం దక్కుతుంది. ఈ విలువలో అవినీతి, అక్రమం, మోసం, దగా, హింస తప్పు కావు. దయా దాక్షిణ్యం, సహకారం, సహాయం, త్యాగం వీటికి తావులేదు. వీటిని దుర్బలతకు చిహ్నాలుగా భావిస్తారు. ఇటువంటి వాతావరణంలో ప్రజలు బ్రతుకున్నారు. సమాజాన్ని మార్చాలనుకునే శక్తులు (కమ్యూనిస్టులతో సహా) కూడా ఈ వాతావరణాన్ని తప్పించుకోలేవు. అయితే ఈ వాతావరణం మధ్యలోనే భవిష్యత్తుకు ప్రాతినిధ్యం వహిస్తూ పోరాడతామా? సర్దుబాటు చేసుకొని ఈ వాతా వరణంలో ఇమిడిపోతామా? అన్నది ముఖ్యం. సమాజాన్ని మార్చాలనుకున్న శక్తులు ఎదిరించి పోరాడాలి. అదే వర్గ పోరాటం అంటే..

అయితే, అందరు వ్యక్తులు అటువంటి పోరాట పటిమను ప్రదర్శించలేకపోవచ్చు. ఎదిరించడానికి బదులు అన్యవర్గ విలువలతో సర్దుబాటు జేసుకొంటుండవచ్చు. అయితే వైరుధ్యాలు తీవ్రం అయ్యేకొద్దీ, వర్గపోరాటం పదును ఎక్కేకొద్దీ సర్దుకొనే శక్తులు కనుమరుగవుతాయి. ఉన్న వ్యక్తులు అన్యవర్గ ధోరణలకు గురి కాకుండా నిరంతరం సైద్ధాంతిక అవగాహన కల్పించడంతో పాటు, వర్గపోరాట కోవలో ముందుకు తీసుకెళ్ళటం నాయకుల, కార్యకర్తల, అభ్యుదయ విలువలను పరిరక్షిస్తుంది.

❋


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవిందా హైస్కూల్ వద్ద, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.**

# మూడవ పార్టీ మహాసభ

(2వ పేజీ తరువాయి)

కమిటీ సమావేశాలలో చర్చలు జరిగాయి. 1952, డిసెంబర్ 30వ తేదీ నుండి 1953 జనవరి 10 వ తేదీ వరకు కేంద్రకమిటీ విస్తృత సమావేశం జరిగింది. ఇందులో కేంద్ర కమిటీ సభ్యులు, కంట్రోల్ కమిషన్ సభ్యులు, ప్రాంతీయ కమిటీల ప్రతినిధులు 61 మంది పాల్గొన్నారు. ప్లీనంలోజరిగిన చర్చల ప్రాతిపదికగా రాజకీయ తీర్మానం, నిర్మాణ నివేదిక రూపొందించే బాధ్యతను ప్లీనం కేంద్రకమిటికి అప్పగించింది.

1953 డిసెంబర్ 27 నుండి 1954 జనవరి 4 వరకు మదురైలో పార్టీ మూడవ మహాసభ జరిగింది. రాజకీయ, నిర్మాణ తీర్మానాలను ఆమోదించడం తోపాటుపార్టీ కార్యక్రమం, విధాన ప్రకటనను కూడా మహాసభ ఆమోదించింది.

కాంగ్రెస్ పార్టీ ప్రజా పునాది క్షీణిస్తున్నప్పటికీ అదింకా శక్తివంతమైన రాజకీయ సంస్థగానే ఉందని ఆమోదించిన రాజకీయ తీర్మానంలో పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ, ఇతర ప్రజా తంత్ర శక్తులు బలహీనంగా ఉన్న చోట్ల మతతత్వ పార్టీలు బలం పుంజుకుంటున్నాయి. పాలక పార్టీలు ఆర్థిక సంక్షోభ భారాన్ని ప్రజలపైకి నెట్టేసే ప్రయత్నాలు చేయటంతో పాటు వారి ప్రజాతంత్ర, పౌర హక్కులపై దాడులు చేస్తున్నదని చెప్పింది. ఈ దాడులను ఎదుర్కోడానికి వివిధ తరగతి ప్రజలను, ప్రజాసంఘాలను సమీకరించాలని చెబుతూ, కార్మిక వర్గాన్ని సంఘటితం చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పింది. పార్టీ కుల వివక్ష, అస్పృశ్యత లాంటి సామాజిక అంశాలపై కూడా పోరాటాలు చేయాలని, ప్రజలను ఆకర్షిం చడానికి వయోజన విద్య, సాంస్కృతిక కార్య క్రమాలు, క్రీడలు వైద్య సహాయ కార్యక్రమాలు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని తీర్మానించింది.

సమర్ధవంతంగా, విస్తృతంగా పత్రికల ప్రచురణ ద్వారా ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉ ందని రాజకీయ తీర్మానంలో పేర్కొన్నారు. పార్టీ సాహిత్యం ద్వారా రాజకీయ ప్రచారం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

పార్టీ పెరుగుదలతో సమానంగా నిర్మాణం కూడా పెరగాల్సిన అవసరం ఉందని నిర్మాణం పై ఆమోదించిన తీర్మానంలో పేర్కొన్నారు. సరైన నిర్మాణం అంటే దిగువ అంశాలతో సన్నిహితంగా ముడిపడి ఉండాలని పేర్కొంది.

1. బూర్జువా, పెట్టి బూర్జువా, ఫ్యూడల్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రం చేయాలి.

2. పునాది వర్గాలతో పార్టీని అను సంధానం చేయాలి.

3. విమర్శ, ఆత్మ విమర్శ ప్రధానంగా గల కేంద్రీకృత ప్రజాస్వామ్యం సూత్రాన్ని అమలుచేయాలి. కిందిస్థాయి నుండి వచ్చే విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

పార్టీ సభ్యులలో గణనీయంగా ఉన్న మధ్యతరగతి నుండి వచ్చిన వారు సైద్ధాంతి కంగా ఎదగలేదని, వారికి, కార్మిక వర్గానికి, కష్టజీవులకు మార్క్సిజం–లెనినిజం పట్ల అవగాహన కల్పించడానికి ప్రణాళికాబద్ధమైన శిక్షణ ఇవ్వలేక పోయామని తీర్మానంలో చెప్పారు. వారిలో ప్రాథమికంగా ఉండే పెట్టుబడి దారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని సోషలిస్టు చైతన్యంగా మలచలేకపోయామని పేర్కొంది. పార్టీ నినాదాలు, ఎత్తుగడలను రూపొందిం చటంలో పార్టీ మొత్తాన్ని, అన్ని శాఖలను భాగస్వాములుగా చేయలేకపోయామని చెప్పింది. పార్టీ లోపల 'నాయకులూ–అనుయా యులు' అనే ధోరణే ఆచరణలో కొనసాగు తున్నదని, రాజకీయ సమస్యలను పై కమిటీలు మాత్రమే చర్చించటం, కింది కమిటీలు ఆచరణాత్మకమైన తక్షణ సమస్యలను మాత్రమే చర్చించటం, పై కమిటీల నుంచి వచ్చిన ఆదేశాలను కింది కమిటీలు అమలుచేయటం కార్యకర్తల అభివృద్ధికి ఆటంకంగా ఉందని, ఇందువలన వారు చొరవలేని వారుగా తయారవుతున్నారని గుర్తించింది.

ఈ నేపథ్యంలో పై నుండి కింది వరకు పార్టీ కమిటీలు పని విధానాన్ని సరిచేసుకోవాలని తీర్మానం కోరింది. కింది కమిటీల చొరవను పెంచడానికి సహాయం చేయడం, వారు ఎదుర్కొనే సమస్యలను వారే పరిష్కరించుకునే విధంగా ఎదగడానికి సహకరించడమే పై కమిటీల లక్ష్యంగా ఉండాలి. విమర్శలను ఏ మాత్రం అనుమతించని నిరంకుశ అధికారుల లాగా కాక, కింది కమిటీలు విమర్శలు చేయడాన్ని పై కమిటీలు చైతన్యవంతంగా ప్రోత్సహించాలి.

సమిష్టి పని విధానం ద్వారా మాత్రమే పార్టీలో రాజకీయ ఐక్యతను సాధించగలమని తీర్మానంలో పేర్కొనడం జరిగింది. నిర్దిష్ట పరిస్థితులకు 'పార్టీ సాధారణ పంథాను అన్వయించుకొని పార్టీ యూనిట్లు పనిచేయాలి, మరింత పటిష్ట పరచాలి, నిరంతర చర్చలు, విమర్శ, ఆత్మ విమర్శల ద్వారా, పోరాటాలను నిరంతరం సమీక్షించుకోడం ద్వారా, పార్టీ నిర్మాణానికి కట్టుబడి ఉండడం ద్వారా, క్రమశిక్షణ ద్వారా కార్యక్రమాలను అమలుచే క్రమంలో ఐక్యతను మరింతగా విస్తృత పరచుకోవాలి.

పార్టీ సభ్యత్వాన్ని పునరుద్దరించుకోడానికి ఆరు కర్తవ్యాలను నిర్ణయించారు.

1. క్రమం తప్పకుండా పార్టీ కి చేయాల్సిన చెల్లింపులు, లెవి చెల్లించడం.

2. శాఖ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం.

3. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండడం, ఇచ్చిన పనిని పూర్తి చేయడం.

4. పార్టీ రహస్యాలను కాపాడాలి. అక్కడి కబుర్లు ఇక్కడ, ఇక్కడి కబుర్లు అక్కడకు చేరవేయడానికి దూరంగా ఉండడం.

5. ప్రజా సంఘాలలో పనిచేయడం.

6. తనపనిపై నివేదికను ఎప్పటికప్పుడు శాఖకు సమర్పించాలి.


తీర్మానం అన్ని రంగాలలోనూ ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని చెప్పింది. కార్యకర్తల అభివృద్ధి కోసం నిరంతరం రాజకీయ విద్య నేర్పాలని, స్వయం అభివృద్ధికి కృషి చేసేవిధంగా ప్రోత్సహించాలని చెప్పింది.

50,000 మంది పార్టీ సభ్యులు, 25,000 మంది కాండిడేట్ సభ్యులు పార్టీలో ఉన్నట్లు మహాసభ సమీక్షలో వెల్లడైంది. సరైన పార్టీ కేంద్రం లేకపోవడం వలన చర్చలు సక్రమంగా జరగలేదని ఒప్పుకుంది. దీని వలన మహాసభకు సన్నద్ధం కావడానికి అవరోధాలు ఏర్పడ్డాయని, అంతర్గత విభేదాలను పరిష్కరించడంలో ఉదారంగా ఉండవలసిన పరిస్థితి ఏర్పడిందని, వివిధ రాజకీయ సమస్యలపై సరైన అంచనాకు రావడంపైన, సరైన రాజకీయ వ్యూహాన్ని, ఎత్తుగడలను రూపొందించటంపైనా దీని ప్రభావం పడిందని పేర్కొంది. మహాసభ 39 మందితో కేంద్రకమిటీని, తొమ్మిది మందితో పొలిట్‌బ్యూరోను ఎన్నుకుంది.

**అనువాదం: కె ఉషారాణి**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-04-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# రాజ్యాంగ హక్కులను అమలుచేయటం లేదు



– ప్రభాత్ పట్నాయక్

స్వాతంత్ర్యానంతరం ప్రజలకు ఆర్థిక, రాజకీయ హక్కులను ఇస్తామని 1931లో జరిగిన కరాచి కాంగ్రెస్ తీర్మానించింది. ప్రజాస్వామిక, లౌకిక రాజ్యాన్ని నిర్మిస్తామని వాగ్దానం చేసింది. సమాఖ్య విధానం, దేశంలోని ప్రతి పౌరుడూ కనీసస్థాయి జీవనం గడపటానికి అవసరమైన ఆదాయం పొందే చర్యలు తీసుకుంటామని, బాలలందరికీ నిర్బంధ, ఉచితవిద్యను అందిస్తామని చెప్పింది. కరాచి కాంగ్రెస్‌లో చేసిన వాగ్దానాలన్నింటినీ స్వాతంత్ర్యానంతం రూపొందించిన రాజ్యాంగంలో పొందుపరిచారు. రాజ్యాంగంలో ప్రజలకు రాజకీయ హక్కులను గ్యారంటి చేశారు. ఆర్థికహక్కులను మాత్రం ఆదేశికసూత్రాలలో పొందుపరచారు. దేశప్రజల జీవితాలను అభివృద్ధి చేయటంలో ప్రభుత్వపాత్ర ఉండాలని, ఆదేశిక సూత్రాలలో పేర్కొన్న వాటిని అమలుచేయటం కోసం ప్రభుత్వం పనిచేయాలని చెప్పారు.

ప్రస్తుతం మనదేశంలో ఉన్న ప్రభుత్వం పెట్టుబడిదారులు సంపదలను సృష్టిస్తారని, ప్రజల జీవితాలను వారే అభివృద్ధి చేస్తారని చెబుతున్నది. దేశీయ పెట్టుబడిదారులనే కాక విదేశీ పెట్టుబడిదారులను కూడా వచ్చి దేశాన్ని అభివృద్ధి చేయమని కోరుతున్నది. పెట్టుబడిదారులకు ఎంత ఎక్కువ ఇస్తే అంత ఎక్కువగా సంపదలను సృష్టిస్తారని, అంతకంత ఎక్కువ మొత్తం ప్రజలకు, సమాజానికి ఇస్తారని నమ్మబలుకుతున్నది.

ప్రభుత్వ వాదనను అంగీకరిస్తే మనం రాజకీయంగానే కాక ఆర్థికంగా కూడా స్వాతంత్రం కోసం చేసిన పోరాటం అర్థంలేనిదవుతుంది. విదేశీ పెట్టుబడులను దేశంలోకి ఆహ్వానించటం, వారికి అన్ని విధాలైన అవకాశాలు కల్పించటం, రాయితీలు ఇవ్వటం, అభివృద్ధి చేయమని కోరటం బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన విధానానికి భిన్నమైనది కాదు. బ్రిటీష్ ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించటం పేరుతో విదేశీ పెట్టుబడిదారులకు అన్ని విధాలైన రాయితీలను ఇచ్చింది. రైల్వేల నిర్మాణంలోకి వచ్చే విదేశీ పెట్టుబడులకు ఐదుశాతం లాభాలను గ్యారంటీ చేసింది. దేశంలోకి విదేశీ పెట్టుబడులను తీసుకురావటం కోసం అంటూ వలస పాలకులు ఇచ్చిన రాయితీలకు, ప్రస్తుత స్వతంత్ర భారత ప్రభుత్వం ఇస్తున్న రాయితీలకు ఏ మాత్రం వ్యత్యాసం లేదు.

("రాజ్యాంగంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు జరపటంలో విఫలమైంది" అన్న అంశంపై 2020 ఆగస్టు 15వ తేదీన ప్రభాత్ పట్నాయక్ న్యూస్‌క్లిక్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని కొన్ని అంశాలు).

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.11. Published on April 1, 2021